Estd 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

కపిల్ చిట్స్ తోడుంటే
కనక మహాలక్ష్మీ మీ వెంటే
Visit Us: www.kapilchits.com
39 YEARS Safeguarding Trust
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

సంపుటి: 64 • సంచిక: 260 • శుక్రవారం 4 అక్టోబర్ 2019 • విజయవాడ * పేజీలు: 10+4 • వెల: 5.00
•Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry |Tirupati | Visakhapatnam | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

అమ్మవారి నేటి అలంకారం

## శ్రీ మహాలక్ష్మీ దేవి



**నమస్తే స్తు మహామాయే శ్రీ పీఠే సురపూజితే**
**శంఖ చక్ర గదా హస్తే మహాలక్ష్మీ నమో స్తుతే**

దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శుక్రవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వబోతున్నారు. మూడు శక్తుల్లో ఒక శక్తైన శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు అమితమైన పరాక్రమాన్ని చూపించి హాలుడు అనే రాక్షసుడిని సంహరించారు. లోకస్థితికారిణిగా, ధన, ధ్యాన, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజ లక్ష్మీలుగా వరాలు ప్రసాదించే అష్టలక్ష్మీ సమష్టిరూపమైన అమృత స్వరూపిణిగా శ్రీ దుర్గమ్మ మహాలక్ష్మీ దేవిగా భక్తులను అనుగ్రహిస్తారు. శ్రీ మహాలక్ష్మీ స్వరూపంలో అమ్మవారిని దర్శించటం వల్ల భక్తులందరికీ ఐశ్వర్యప్రాప్తి, విజయం లభిస్తుందని భక్తుల నమ్మకం.



సర్వభూపాల వాహనంపై సర్వాంతర్యామి

7 లో



# ముందుగానే పంట ధర!

- దళారులు లేకుండా చూడండి
- గోడౌన్లు, శీతల గిడ్డంగులు ఏర్పాటు
- చిరుధాన్యాల హబ్‌గా రాయలసీమ
- త్వరలో మార్కెట్ కమిటీలు ఏర్పాటు
- మహిళలకు 50 శాతం అవకాశం
- సహకార నష్టాలపై అధ్యయనం
- మార్కెటింగ్, సహకార శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

**అమరావతి, ఆంధ్రప్రభ:** రైతులు ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటను దళారీలకు తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండకూడదని ముఖ్యమంత్రి జగన్ అన్నారు. దళారులు లేకుండానే వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు జరగాలని చెప్పారు. పంట వేసినప్పుడే వాటికి ధరలు ప్రకటించే పరిస్థితి రావాలన్నారు. ఆ ధర ఏమాత్రం తగ్గుతున్నా.. వెంటనే ఆదుకోవడానికి ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అరటి, మామిడి, చీని, కమలా, బొప్పాయి సహా ఏ పంట విషయంలోనైనా దళారులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆరు నెలల్లోగా దళారీ వ్యవస్థను నిర్మూలించాలని, దీనిని సవాల్‌గా తీసుకుని అధికారులు

9వ పేజీలో...

# స్థానికథ ఎలా?

- పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు
- సెజ్‌ల వైపే పారిశ్రామిక వేత్తల మొగ్గు
- ఆ చట్టంలో పలు నిబంధనలు
- అక్కడ రాష్ట్ర చట్టాలు అమలు కావు
- సెజ్ వెలుపల లభించని రాయితీలు
- ఔట్ సోర్సింగ్‌లో రిజర్వేషన్లుండవు
- ఐటీలో స్థానికతే వివాదాస్పదం
- సెజ్ చట్టాన్ని సవరిస్తేనే ప్రయోజనం
- స్థానిక రిజర్వేషన్లు సుసాధ్యం
- సీఎం జగన్ చొరవ చూపాలి
- సామాజిక నిపుణుల సూచనలు

**(అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)**

అధికారంలోకొచ్చీరాగానే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు ఉద్యోగాల పందారంపై దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా కొత్తగా ఏర్పాటు చేసే పరిశ్రమల్లో స్థానికులకే 75శాతం ఉద్యోగాలివ్వాలంటూ ఏకంగా చట్టం చేసేశారు. దీనిపట్ల యువతలో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. కానీ సెజ్ చట్టంలో కొన్ని మార్పులు చేస్తేనే స్థానిక రిజర్వేషన్ల చట్టం ఆశించిన ఫలితం నెరవేరుతుందని, ఇందుకు సీఎం జగన్ చొరవ చూపాలని నిపుణులు సూచిస్తున్నారు.

కొత్తగా ఎవరు పరిశ్రమ పెట్టాలన్నా ప్రత్యేక ఆర్థికమండళ్ళ వైపే మొగ్గుచూపుతున్నారు. ఇందుక్కారణం వీటిలో పరిశ్రమ నెలకొల్పితే పలు ప్రయోజనాలుంటాయి. పెట్టుబడిపై రాయితీ వస్తుంది. పదేళ్ళ పాటు విద్యుత్ ధరల్లో సబ్సిడీ ఉంటుంది. ఆదాయపన్ను, అమ్మకపు పన్ను నిర్ణీత వ్యవధి వరకు చెల్లించాల్సిన అవసరంలేదు. బ్యాంకులకు కట్టే వడ్డీల్లో కూడా ప్రభుత్వం కొంత భాగం భరిస్తుంది. ఇన్ని ప్రయోనాలున్న సెజ్‌లు తప్ప ఇతర ప్రాంతాల్లో పరిశ్రమలకు ఎవరూ ముందుకొచ్చే అవకాశాల్లేవు. ఈ సెజ్‌లు కేంద్ర ప్రభుత్వ చట్టాలకు లోబడి ఏర్పాడ్డాయి. ఇక్కడ ఏ రాష్ట్ర ప్రభుత్వ చట్టం అమలుకాదు. ఆఖరకు కేంద్రం నిర్దేశించిన కార్మిక చట్టాలక్కూడా ఇక్కడ తావుండదు. స్థానిక అధికార్లు ఇక్కడ పెత్తనం చేసే వీల్లేదు. అలాగే ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, ఒత్తిళ్ళకు అసలు అవకాశముండదు. ఇలాంటి చోట్ల ఏర్పాటయ్యే కొత్త పరిశ్రమల్లో మన రాష్ట్ర చట్టాల్ని ఏమేరకు గౌరవిస్తారు. ఎంతవరకు దీన్ని అమలు చేస్తారన్న సందిగ్ధం నెలకొంది. కేంద్ర ప్రభుత్వ చట్టాల పరిధిలోని సెజ్‌లో ఏర్పాటయ్యే పరిశ్రమల్లో రాష్ట్ర ప్రభుత్వ చట్టాల్ని విధిగా అమలు చేయాలన్న నిబంధన ఎక్కడా లేదు. అది జరగాలంటే సెజ్ చట్టాల్ని సవరించాలి. అప్పుడుగా ఇక్కడ ఏర్పాటయ్యే పరిశ్రమల్లో 75శాతం స్థానిక రిజర్వేషన్ అమలు కాదు. సెజ్‌ల్లో తప్ప మరెక్కడా భారీ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు కనిపించడంలేదు. ఇక పోర్టులు, రైల్వేస్టేషన్లు, ఎయిర్ పోర్టుల్లో ఇప్పటికే ఔట్‌సోర్సింగ్ విధానాలొచ్చేశాయి. పోర్టుల్లో యాజమాన్యాలు నేరుగా కార్మికుల్ని నియమించుకోవు. పని కాంట్రాక్టర్ల ద్వారానే కార్మికుల నియామకాలుంటాయి. పని కాంట్రాక్టర్లు ప్రభుత్వోద్యోగులు కారు. దీంతో ఈ వ్యవస్థలో రిజర్వేషన్ల చట్టానికి తావుండదు. ఇవికాక పెద్దెత్తున ఏర్పాటౌతున్నది సాఫ్ట్‌వేర్ పరిశ్రమలే. ఇందులో భారీగా ఉద్యోగావకాశాలు లభిస్థాయి. అయితే ఇవన్నీ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు. వాటి శాఖల్నే మన రాష్ట్రంలో ఏర్పాటు చేస్తారు. ఈ శాఖల మధ్య సిబ్బంది బదలీలు తరచూ జరుగుతాయి. రాష్ట్రాల్లోని శాఖల వారీగా కాకుండా సంస్థ అవసరాలకనుగుణంగా ఇక్కడ నియామకాలు నిర్వహిస్తారు. ఏ ఒక్క ప్రాంతంలోనూ సుస్థిరంగా పని చేసే వెసులుబాటు వీరు కల్పించరు. దీంతో ఇక్కడ స్థానికతనే అంశం వివాదాస్పదమౌతుంది.ఏ ప్రాతిపదికన ఇక్కడ స్థానికతను నిర్దేశిస్తారన్నది సందేహంగా మారింది. ఇలాంటి సందిగ్ధాలపై పూర్తిస్థాయి అధ్యయనం జరపాలి. స్పష్టతలేని అంశాల్ని పరిగణనలోకి తీసుకోవాలి. వాటిని అధిగమించేందుకు తగిన సవరణలు చేపట్టాలి. అప్పుడే ఈ చట్టం ఆశించిన స్థాయిలో స్థానికులకు ప్రయోజనం కల్పించగలుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు.



# జీఎస్టీ... పల్టీ! నకిలీ మకిలీ!!

## వేల కోట్లు హాంఫట్



- జీఎస్టీకి భారీ గండి
- అనామకుల పేరిట రిజిస్ట్రేషన్లు
- లోన్ల పేరిట పాన్, ఆధార్ కార్డుల సేకరణ
- మార్ఫింగ్ చేసి జీఎస్టీ లైసెన్స్
- గుంటూరు జిల్లాలోనే గ్రానైట్‌పై రోజా రూ.6 కోట్ల పన్ను ఎగవేత
- బ్రోకర్లకు రూ.50 లక్షలు
- కీలక పెద్దలకూ వాటాలు
- సంస్థాగత లోపంతోనే అక్రమాలు
- ఎనర్జీ ఆడిట్‌తో చెక్ పెట్టొచ్చు
- 20 ఏళ్ల క్రితమే నిరూపించిన ఓ అధికారి

**గుంటూరు, ప్రభన్యూస్ బ్యూరో:** జీఎస్టీ రిజిస్ట్రేషన్ నిబంధనలలో వున్న వెసులుబాటు అక్రమార్కులకు వరంగా మారింది. అక్రమ రిజిస్ట్రేషన్ల ద్వారా వేలకోట్ల రూపాయల ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. నకిలీ ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్‌లు చేయించి యదేచ్ఛగా పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారు. నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌లు చేయించిన వారిని గుర్తించటంలో ఆశాఖ అధికారులు పూర్తిగా విఫలమై చేతులెత్తేసిన సూచనలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా గ్రానైట్, పాత ఇనుము, జీడిపప్పు, తదితర వ్యాపారులు చేసే లావాదేవీలలో ఇప్పటివరకు కోట్లాది రూపాయల పన్ను ఎగవేత జరిగింది... జరుగుతోంది... అధికారులు, వ్యాపారులకు అనుసంధానంగా వ్యవహరించే బ్రోకర్ల కనసన్నలలోనే ఈ తతంగమంతా నడుస్తోంది. బ్రోకర్ల హస్తలాఘవం, రాజకీయ పలుకుబడి ముందు ఎంతటి వారైనా తలవంచాల్సిందే. 'ఎనర్జీ ఆడిట్' ద్వారా జీఎస్టీ ఎగవేతను అరికట్టేందుకు అవకాశాలున్నప్పటికీ, అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు జరుపకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఒక్క గుంటూరు జిల్లాలోనే

9వ పేజీలో...



ముంచుకొస్తున్నది ముప్పు
శతాబ్దాలుగా చేస్తున్న తప్పు
ఇకనైనా కావాలి కనువిప్పు
ప్లాస్టిక్‌ని వదిలేయడమే ఒప్పు
ప్రతిఒక్కరికీ ఇదే చెప్పు!

GO GREEN | SAY NO TO PLASTIC

సామాజిక శ్రేయస్సును కాంక్షిస్తూ...
ఆంధ్రప్రభ

# ఆన్‌లైన్ బిల్లు... బ్లాక్‌లో చెల్లు!



## ఇసుక మాఫియా మాయాజాలం

- నెల్లూరు పెన్నా ఇసుక బిల్లుతో విజయవాడలో విక్రయాలు
- విజయవాడ-గుంటూరులకే పరిమితం అవుతున్న ఆన్‌లైన్ బిల్లులు
- ఒకే వే బిల్లుతో రోజంతా ఇసుక తరలింపు
- డంపింగ్ యార్డుల్లో చక్రం తిప్పుతున్న చోటా నేతలు

7 లో

ఔరా..!




# ఆటో రయ్!



- రాష్ట్రంలో పెరిగిన అమ్మకాలు
- సబ్సిడీ రుణాలే కారణం
- కార్పొరేషన్ల ఇతోధిక సాయం
- స్వయం ఉపాధికి కోట్లు కేటాయింపు
- రూ.2 లక్షల్లోపే యూనిట్ ధర
- బ్యాంకర్లూ సానుకూలం
- ఉపాధిపై క్షేత్రస్థాయిలో కొరవడిన అధ్యయనం

3 లో

ప్రభుత్వం ఏటా స్వయం ఉపాధి పథకాలకు కోట్లు వ్యయం చేస్తోంది. తద్వారా పరోక్షంగా రోడ్లపైకొచ్చే ఆటోల సంఖ్యను అనూహ్యంగా పెంచుతోంది. వాస్తవంగా లబ్ధిదారుడు ఆటో ద్వారా తగిన ఉపాధి పొందుతున్నాడా లేదా? అది దీర్ఘకాలికంగా అతని కుటుంబ పోషణకు ఉపకరిస్తోందా లేదా అలాగే, ఈ పథకంలో కొనుగోలు చేసిన ఆటోను స్వయంగా నిర్వహిస్తున్నాడా లేక అద్దెకు తిప్పుతున్నాడా అన్న అధ్యయనాలు జరగలేదు. మరికొందరు లబ్ధిదారులైతే ఆటోను ఎకాఎకిన కొంత నష్టానికమ్మేసి బ్యాంక్ రుణాన్ని తిరిగి కట్టేసి మిగిలిన సబ్సిడీ సొమ్మును సొంతానికి జమేసుకుంటున్నారు. ఈ పథకాలన్నీ ఇప్పుడు రాష్ట్రంలో ఆటోలసంఖ్య పెరగడానికి, ఆటోల అమ్మకాలు వృద్ధి చెందడానికే ఉపకరిస్తున్నాయి...

# పట్టుబడిన అవినీతి అక్కిరాజు



- ఏసీబీ వలలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్
- ఏకకాలంలో ఐదుచోట్ల సోదాలు
- రూ.80 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు
- ఉగాండాలోనూ బ్యాంక్ ఖాతా

7 లో



# 10న వైఎస్సార్ కంటి వెలుగు



• రూ.560 కోట్లతో పథకం అమలు • తొలిరోజే 70 లక్షల మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు
• 6 దశల్లో శస్త్రచికిత్సలు • ఉచితంగా ఆపరేషన్లు, మందులు, కళ్లజోళ్లు

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం ఇప్పటికే ఆ దిశగా అనేక కీలక కార్యక్రమాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. అతి ముఖ్యశాఖ అయిన వైద్య ఆరోగ్య శాఖను పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ నడుం బిగించారు. వైద్య ఆరోగ్య శాఖలో సంస్కరణలపై సుజాతారావు కమిటీని ఆయన ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటికే ఆ కమిటీ పలు సిఫార్సులు, మార్పులకు సంబంధించిన నివేదికను ముఖ్యమంత్రి జగన్‌కు అందజేసింది. ఈ దశలోనే ఆయన తెలంగాణలో సక్సెస్ అయిన కంటి వెలుగు పథకాన్ని ఏపీలో కూడా అమలు చేయాలని నిర్ణయించారు. ఈ నెల 10వ తేదీన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. వైఎస్సార్ కంటి వెలుగు పేరిట ప్రారంభించనున్న ఈ పథకానికి రూ.560 కోట్లు ప్రభుత్వం వెచ్చించనుంది. రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా కంటివైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా ఆధునికవైద్య సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమం అమలుకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి (వైద్య ఆరోగ్యశాఖ) ఆళ్ల నాని ఇప్పటికే నేత్ర వైద్య నిపుణులతో భేటీ అయి వారి సాకారాన్ని కోరారు. నేత్ర వైద్యులు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్న నిర్దిష్ట హామీని ఇచ్చారు.

అక్టోబరు 10న 70 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లో కంటి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం ఇప్పటికే ప్రారంభించింది. అక్టోబరు 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా కంటివైద్య పరీక్షలు నిర్వహించి ఆ తరువాత ఆరు దశల్లో కంటిచూపు లోపంతో పాటు ఇతర శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆధునిక వైద్యాన్ని అందించనున్నారు. ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించడంతో పాటు మందులు, కళ్ళజోళ్లు ప్రభుత్వం అందిస్తుంది. ఇప్పటికే దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలో ఎంతో విజయవంతమైన ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడంతో పేదలకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది.

తొలుత ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకే కంటి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం భావించినప్పటికీ ఇటీవల జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి జగన్ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కూడా వర్తింపజేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికార యంత్రాంగం ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల జాబితాను తయారు చేసే పనిలో నిమగ్నమైంది.

# హింసాత్మక ఘటనలను ఎదుర్కొనేందుకు స్వాట్ టీములు

• రాష్ట్రంలో మొదటగా ప్రకాశం జిల్లాలో ఏర్పాటు • పోలీసులకు ప్రజల సహకారం అవసరం • డీజీపీ గౌతమ్ సవాంగ్



**ఒంగోలు క్రైం, ప్రభ న్యూస్:** హింసాత్మక పరిస్థితులు ఎదుర్కొనేందుకు అమెరికాలో లాస్ ఏంజెల్స్ పోలీస్ డిపార్ట్‌మెంట్ తమ ఏజెన్సీలో కొత్త యూనిట్‌ను అభివృద్ధి చేయాలనే ఆలోచనతో పుట్టిందే స్వాట్ (స్పెషల్ వెపన్ అండ్ టాక్టిక్స్) టీం అని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదటిగా ప్రకాశం జిల్లాలో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ విభిన్నంగా ఆలోచించి ఈ టీంను ఏర్పాటుచేశారని రాష్ట్ర డీజీపీ గౌతమ్ సవాంగ్ అన్నారు. గురువారం ప్రకాశం జిల్లా ఒంగోలులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో స్వాట్ టీం ప్రదర్శించిన నమూనా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి వినూత్న టీంను జిల్లాలో మొట్ట మొదటిగా ఏర్పాటు చేసినందుకు ఎస్పీకి అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరిలో ప్రొఫెషనల్ నైపుణ్యాలు, రకరకాల సామర్థ్యాలు ఉంటాయని, వాటిని గైడ్ చేయటం ప్రధానమైన అంశం అన్నారు. ప్రతి జిల్లాలో త్వరలో స్వాట్ టీంలను ఏర్పాటుచేయటం జరుగుతుం దన్నారు. పోలీసులకు ప్రజల సహకారం ముఖ్యమని, అప్పుడే తమ విధులను సక్రమంగా నిర్వర్తించగలరన్నారు. రాష్ట్రంలో సంవత్సరం కాలంగా పోలీసుల వాహనాలకు బకాయిలు చెల్లించలేదని, నూతన ప్రభుత్వం ఇప్పుడే చెల్లింపులు చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్‌లను అప్‌గ్రేడ్ చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశామని, నిధులు విడుదలైన వెంటనే అప్‌గ్రేడ్ చేయటం జరుగుతుందన్నారు. దేశాన్ని పట్టి పీడించే తీవ్రవాద సమస్యను నిర్మూలించేందుకు స్వాట్ టీంలు ఉపయోగపడతాయన్నారు. ఇప్పటివరకు ఇలాంటి సమస్యలు మహానగరాలకే పరిమితమయ్యాయని, క్రమేపీ పల్లెలకు కూడా వ్యాపించే ప్రమాదం ఉందని, దాన్ని ఎదుర్కోవాలంటే జిల్లా స్థాయిలో ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ లాంటి శక్తివంతమైన సంస్థను నెలకొల్పాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ స్వాట్ టీంను ఏర్పాటు చేశారని, ఎస్పీ రాష్ట్రానికే రోల్డ్ మోడల్ అని కొనియాడారు. అనంతరం స్వాట్ టీం చేసిన వివిధ రకాల ప్రదర్శనలు అలరించాయి.

### రూమ్ ఇంటర్ వెన్షన్

పాతబడిన బంగ్లాలో శత్రువులు వీఐపీలను బందీగా చేసుకొని దాగి ఉన్నప్పుడు ఆ వీఐపీలను రక్షించేందుకు స్వాట్ టీం కమాండోస్ లోనికి ప్రవేశించి వీఐపీలను రక్షించి శత్రువులను హతమార్చడం లేదా బందీగా పట్టుకోవడం ఈ ఆపరేషన్ ముఖ్యఉద్దేశం.

### వెహికల్ అసాల్ట్

శత్రువు ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి వీఐపీని బందీగా చేసుకొని వాహనంలో పారిపోతున్నప్పుడు దానిని అడ్డగించి వీఐపీని రక్షించటం.

### బస్ అసాల్ట్

ప్రయాణికులు ఉన్న బస్సును శత్రువులు హైజాక్ చేసి వారి డిమాండ్లు నెరవేర్చుకోవటం కోసం ఇంకొక ప్రదేశానికి తీసుకెళ్లే సమయంలో బస్సును అడ్డగించి ప్రయాణికులను శత్రువుల చెర నుంచి సురక్షితంగా విడిపించడం.

### బ్లైండ్ ఫోల్డ్

చీకటిలో ఆయుధాలను ఉపయోగించి ఏవిధంగా ముందుకెళ్లాలో స్వాట్ టీం కమాండోస్ డెమో చేసి చూపించారు. వెపన్స్ భాగాలు విడదీయటం, జోడించడం వంటివి కళ్లకు గంతలు కట్టుకొని ప్రదర్శించారు.

### అబ్బురపరిచిన పోలీస్ డాగ్స్ విన్యాసాలు

నేరస్తులను ఏవిధంగా గుర్తిస్తాయో పోలీసు డాగ్స్ ప్రదర్శించాయి. షాడో(బెల్జియన్ మెలినోస్ బ్రీడ్) ఇది 9 నెలల శిక్షణను పూర్తి చేసుకొని శిక్షణా కాలంలో గోల్డ్ మెడల్ సాధించింది. సెక్యూరిటీ వింగ్‌లోకి వచ్చిన వెంటనే కొత్తపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసులో గంట వ్యవధిలోనే నేరస్తుడిని గుర్తించింది. అలాగే దర్శిలో వృద్ధ దంపతుల హత్యకేసు నిందితులను ఛేదించి పలు నేరాల్లో పోలీసులకు క్లూస్ అందించింది.స్వీటీ (లేబరేడర్ రిట్రీవర్ బ్రీడ్) డాగ్ పేలుడు సామాగ్రిని గుర్తించడంలో నైపుణ్యాన్ని కలిగింది. 2017లో తమిళనాడులో జరిగిన ఆల్ ఇండియా డ్యూటీ మీట్‌లో ఏపీ తరపున ఎంపికై అధికారుల ప్రశంసలు పొందింది. స్వాట్ టీం ఎంపికకు ఐదు రకాల అంశాలలో ఏఆర్ డీఎస్పీ ఎ. రాఘవేంద్రరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్ యు. నాగేశ్వర అనేక పరీక్షల ద్వారా వడపోసి 25 మందిని ఎంపిక చేసి 4 నెలల పాటు జిల్లా పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో శారీరక సామర్థ్యం, యుఎంటి (అర్బన్ మూమెంట్ టెక్నిక్స్), సి క్యూబి, బాంబ్, బ్రీచింగ్, కమ్యూనికేషన్, టాక్టికల్ ఫైరింగ్ లపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణను రాష్ట్ర డీజీపీ ఎదుట స్వాట్ టీం ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లాఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, ఏపీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవిశంకర్ అయ్యన్నార్, కలెక్టర్ పోలా భాస్కర్, జాయింట్ కలెక్టర్ షన్‌మోహన్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వాట్ టీంలో ప్రతిభ కనబరిచిన వారికి డీజీపీ గౌతమ్ సవాంగ్ చేతుల మీదుగా రివార్డులు, కమాండేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.

## నేడు తిరుమలలో వైభవంగా
# శ్రీవారి గరుడసేవ

• అర్ధరాత్రి నుంచి ద్విచక్రవాహనాల నిషేధం • దివ్యదర్శనం, సర్వదర్శనం టోకెన్లు రద్దు



**తిరుమల, ప్రభ న్యూస్:** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా నేటి రాత్రికి శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడిని అధిరోహించి భక్తులను కనువిందు చేయనున్నారు. రాత్రి జరిగే గరుడోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో టీటీడీ, జిల్లా, విజిలెన్స్, పోలీస్‌శాఖ వారు పటిష్ట భద్రతను, బందోబస్తును ఏర్పాటు చేశారు. గరుడసేవను దృష్టిలో పెట్టుకుని దివ్యదర్శనం, సర్వదర్శనం టోకెన్లను గురువారం నుంచే నిలిపివేసింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యాలు, రవాణా, భద్రత విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆర్టీసీ విభాగం తిరుపతి, తిరుమల మధ్య ఆర్టీసీ బస్సులతో మొత్తం 3700 ట్రిప్పులకు పైగా తిప్పనున్నారు. ప్రతి 10 సెకన్లకు ఒక బస్సు భక్తులకు అందుబాటులో ఉండేవిధంగా ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. తిరుమలకు చేరుకున్న భక్తులను నేడు ఉదయం 10 నుంచి గ్యాలరీలలోనికి అనుమతిస్తామని, ఆ తర్వాత గ్యాలరీలలో ఉండే భక్తులకు అన్నప్రసాదాలు, మజ్జిగ, త్రాగునీటిని ఇబ్బందిలేకుండా నిరంతరాయంగా అందిస్తామని టీటీడీ తెలిపింది. ఇప్పటికే అలిపిరి నుంచి తిరుమల వరకు రోడ్డు భద్రతకు పోలీస్‌శాఖ చర్యలు తీసుకుంటున్నారు. అత్యవసర పరిస్థితులలో భక్తులకు ఏవైనా ఇబ్బందులు తలెత్తినపుడు ప్రథమచికిత్స అందచేసేందుకు మెడికల్ కేంద్రాలను, అంబులెన్సులను సిద్ధం చేశారు. టీటీడీ భక్తులకు విజ్ఞప్తి చేస్తూ వాహనం తిరిగేటపుడు నాణేలను విసరవద్దని, దీని వలన ఉత్సవమూర్తులకు నష్టం వాటిల్లుతుందని, కానుకలు ఇవ్వదలచినవారు వాహన సేవకు ముందు భాగాన నడిచే మొబైల్ హుండీలలో వేయాలని టీటీడీ వారు కోరారు. భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నాలుగు మాడవీధులలో బారికేడ్లను ఇప్పటికే ఏర్పాటు చేశారు.

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా
# జస్టిస్ జేకే



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ జీకే మహేశ్వరి ప్రస్తుతం మధ్యప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు కేంద్ర న్యాయశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ విక్రమ్‌నాథ్‌ను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజీయం గతంలో కేంద్రానికి సిఫార్సు చేసింది. కానీ కేంద్రం ఆ సిఫారసును వెనక్కి పంపింది.

# శ్రీశైలంలో పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి జయరామ్

**అమరావతి, ఆంధ్రప్రభ:** శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంభ, మల్లేశ్వరస్వామి వార్లకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరి జయరామ్ పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. సోమవారం సాయంత్రం ప్రభుత్వం తరపున మంత్రి జయరామ్ పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

## భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో
# ప్రభుత్వం విఫలం

• కొండమీదంతా అధికార పార్టీ నేతల హడావుడే
• మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

**అమరావతి, ఆంధ్రప్రభ:** దసరా శరన్నవరాత్రుల సందర్భంగా భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. దసరా ఉత్సవాల్లో ఐదో రోజైన గురువారం ఆయన నడక మార్గంలో క్యూలైన్లో అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఈ సందర్భంగా దారి పొడవునా భక్తులతో మాట్లాడుతూ.. వారికందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. సామాన్య భక్తులకు కూడా సజావుగా దర్శనం కల్పించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఏర్పాట్లు చేయడంలో విఫలమైందన్నారు. కొండమీద అంతా అధికార పార్టీ నేతల హడావుడే కనిపించిందని ఆరోపించారు. పనిచేసి చూపించడంలోకన్నా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం చేసుకోవడంపై యావ ఎక్కువగా ఉందని ఎద్దేవా చేశారు. వంద రూపాయల టికెట్లకు వీఐపీల ముద్రలు వేసి అమ్ముకుంటున్నారని ఆరోపణలు చేశారు. ఏ మంత్రి అండదండలు ఉండటం వల్ల ఇదంతా జరుగుతోందని ప్రశ్నించారు.

## కనకదుర్గమ్మకు
# బంగారు హారం సమర్పణ

**అమరావతి, ఆంధ్రప్రభ:** దసరా శరన్నవరాత్రుల్లో ఐదో రోజైన గురువారం శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తుడొకరు అమ్మవారికి బంగారు హారం సమర్పించారు. విజయవాడకు చెందిన ధనేకుల వెంకట భవానీ ప్రసాద్, భార్య పద్మ వారి కుటుంబ సభ్యులు కలిసి ఇంద్రకీలాద్రిలో కొలువైన అమ్మవారికి 253 గ్రాముల బంగారు నీలాల హారాన్ని అందజేశారు. రూ. 9 లక్షల 50 వేల విలువైన ఈ ఆభరణాన్ని దేవస్థానం ఈవో ఎంవీ సురేష్ బాబుకు అందజేశారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శనం చేయించి, వేదపండితుల



ఆశీర్వచనంతో పాటు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

# అన్నపూర్ణాదేవిగా విశాఖ శారదామాత

• ప్రత్యేక పూజలు నిర్వహించిన స్వరూపానందేంద్ర



**విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో:** విశాఖ శారదాపీఠంలో శారదాస్వరూప రాజశ్యామల శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 5వ రోజు గురువారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి తెల్లవారు జామునే గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి చండీహోమం, శ్రీ చక్రార్చన అత్యంత వైభవంగా జరిపించారు. సాయంత్రం కుంకమ పూజల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తదుపరి అమ్మవారిని దర్శించుకొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఉదయం నుంచి అక్షరాభ్యాసం కార్యక్రమాలు కూడా నిర్వహించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర భక్తులకు ఆశీర్వాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్, ఆర్‌టీఏ కమిషనర్ ఐలారం రాజు, సీఎంఆర్ గ్రూప్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు నిర్వహించడం జరుగుతుందని పీఠం ధర్మాధికారి కామేశ్వర శర్మ తెలిపారు.





## నిరాశ్రయుల ఆశ్రయంపై
# అధ్యయనం

• ఆరుగురితో కమిటీ • మంత్రి బొత్స సత్యనారాయణ

**అమరావతి, ఆంధ్రప్రభ:** పట్టణాల్లో నిర్వహిస్తున్న నిరాశ్రయులు ఉండే షెల్టర్ల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ఆరుగురు సభ్యులతో కమిటీని నియమించనున్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పట్టణాల్లో నిరాశ్రయులకు వసతి కల్పించే అంశంపై మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి బొత్స మాట్లాడారు. ఆరుగురు సభ్యుల్లో ముగ్గురు అధికారులు, ముగ్గురు ఎన్‌జీవోలు ఉంటారని, ఈ కమిటీ 15 నుంచి 30 రోజుల్లో నివేదిక అందజేస్తుందన్నారు. ఈ కమిటీ నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించే స్వచ్ఛంధ సేవా సంస్థల సాధకబాదకాలు తెలుసుకోవడంతో పాటు పట్టణాల్లో ఎంతమంది నిరాశ్రయులు ఉన్నారన్న విషయాన్ని తెలియజేస్తుందన్నారు. నిరాశ్రయుల సమస్యలు పరిష్కరించే విధంగా వారికి వసతి కల్పించడంతో పాటు వారికి అన్ని వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ వ్యవహారాలతో కలిసి ఎన్జీవోలు నిరాశ్రయులకు కల్పిస్తున్న వసతి, తదితర విషయాలను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని ఎన్జీవోల వివరాలు, వారందిస్తున్న సేవలు, వారికి రావాల్సిన బకాయిలను తెలుసుకొని త్వరలోనే ప్రభుత్వం నిధుల విడుదలకు కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు మాట్లాడుతూ మున్సిపల్ వ్యవహారాలలో రాష్ట్రం దేశంలోనే ముందుందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ శివపార్వతి మున్సిపల్ అధికారులు, ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముహూర్తం

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం; తిథి: షష్ఠి ఉ.9.35 వరకు, నక్షత్రం: జ్యేష్ఠ మ.12.20 వరకు, యోగం: సౌభాగ్య రా.11.55 వరకు; కరణం: తైతుల ఉ.9.35 వరకు, గరజ రా.9.36 వరకు దుర్ముహూర్తం: ఉ.8.32 నుండి ఉ.9.19 వరకు, మ.12.28 నుండి 1.15 వరకు; రాహుకాలం: ఉ.10.36 నుండి మ.12.04 వరకు; వర్జ్యం: రా.8.39 నుండి రా.10.19 వరకు, ఉ.10.43 నుండి మ.12.20 వరకు; యమ గండం మ.3.02 నుండి సా.4.30 వరకు; గుళిక ఉ.7.38 నుండి ఉ.9.07 వరకు; అభిజిత్: ఉ. 11.41 నుండి మ.12.28 వరకు

# ఉపాధి బిల్లులు చెల్లించాలి

• కేంద్రం రూ.1,845 కోట్లు విడుదల చేసినా చెల్లించని రాష్ట్ర ప్రభుత్వం • కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు చంద్రబాబు లేఖ



**అమరావతి, ఆంధ్రప్రభ:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేలా తగిన చొరవ తీసుకోవాలని కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం ఈ మేరకు ఆయన కేంద్రమంత్రి తోమర్‌కు ఒక లేఖ రాశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపాధిహామీ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. తమ హయాంలో 26 వేల కి.మీల సిమెంట్ రోడ్డు, ఆరు వేల అంగన్‌వాడీ భవనాలు, 2200 గ్రామ పంచాయతీ భవనాలతో పాటు 12 వేల లింక్ రోడ్లను గ్రామాల్లో వేయడం జరిగిందని తెలిపారు. ఇటీవల అధికార పగ్గాలు చేపట్టిన కొత్త ప్రభుత్వం నరేగా పెండింగ్ బిల్లులకు సంబంధించి కేంద్రం విడుదల చేసిన రూ.1,845 కోట్లకు తమ వాటా జోడించకుండా ఇప్పటివరకు లబ్ధిదారులకు అందించలేదని తెలిపారు.

## ఇద్దరు సీఎంల
# జంట నాటకం

• కమీషన్ల కోసమే కొత్త పథకం
• ఢిల్లీలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్





**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** కాంట్రాక్టర్ల జేబులు నింపి కమీషన్లు దండుకోవడం కోసమే కొత్త పథకం పేరుతో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రయత్నాలు ప్రారంభించారని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. లక్ష్మణ్ అన్నారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో ఉద్యమం చేపట్టిన కేసీఆర్, అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడింటినీ నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్టు ఇప్పుడు ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసి ప్రజాధనం దోపిడీకి పథక రచన చేస్తున్నారని దుయ్యబట్టారు. ఉద్యమ సమయంలో గోదావరి - కృష్ణా నదుల అనుసంధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన కేసీఆర్, ఇప్పుడు కమీషన్ల కోసం నదుల అనుసంధానం పాట పాడుతున్నారని ఆరోపించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి అక్రమంగా నీటిని ఆంధ్రప్రదేశ్ వాడుకుంటుందని ఆరోపించిన కేసీఆర్, ఇప్పుడు గోదావరి నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు తరలిస్తానని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ - ఆంధ్రా చెరి సగం అంటూ తెలంగాణ ప్రజలకు దక్కాల్సిన నీటి వాటా దక్కకుండా చేస్తారా అంటూ నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా రూ. 30వేల కోట్లు అని తొలుత చెప్పి, తర్వాత దాన్ని రూ. 80 వేల కోట్లకు తీసుకెళ్లారని, 40 వేల ఎకరాలకు నీళ్లు అందిస్తామని చెప్పి ఒక్క ఎకరాకి కూడా చుక్క నీరు ఇవ్వలేకపోయారని లక్ష్మణ్ విమర్శించారు. ఇది చాలక ఈ ప్రాజెక్టుకే ఇంకో రూ. 20 వేల కోట్లు అవసరమని చెబుతున్నారని లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా నదుల అనుసంధానం బీజేపీ విధానమైనప్పుడు కేసీఆర్ ప్రతిపాదన ఎందుకు వ్యతిరేకిస్తున్నారని విలేకరులు ప్రశ్నించగా, తాము నదుల అనుసంధానానికి ఎప్పుడూ వ్యతిరేకం కాదని, కానీ కనీసం డీపీఆర్ కూడా తయారు చేయకుండా దోపిడీ కోసమే ప్రాజెక్టులు చేపట్టడాన్ని తప్పుబడుతున్నామని వివరణ ఇచ్చారు.

# పండక్కి పప్పులు ఉడకవ్!



**•పండుగల సీజన్‌లో ఠారెత్తిస్తున్న అపరాల ధరలు**
**•కంది, మినుము, పెసరపప్పు ధరల్లో పెరుగుదల**

**న్యూఢిల్లీ:** పండుగల సీజన్ వచ్చేసింది. దసరా, దీపావళి హడావుడి మొదలైంది. చిన్నా.. పెద్దా, బీదా.. సాదా తేడాలేకుండా అందరూ సంతోషంగా జరుపుకునే పండుగలివి. అయితే, ఈ సంతోషం పేదోడి ఇంటిదాకా చేరేటట్టు కనిపించడం లేదు. చేతినిండా పనిలేక అరకొర ఉపాధితో కాలం నెట్టుకొస్తున్న దిగువ మధ్యతరగతి కుటుంబాలకు పబ్బం గడిచేట్టు కనిపించడం లేదు. అమాంతం పెరిగిన నిత్యావసరాల ధరలు సామాన్యుడికి శాపంగా మారింది. ఇప్పటికే కూరగాయల ధరలు చుక్కలనంటాయి. రిటైల్ మార్కెట్లో వీటి ధరలు సగటు కిలో రూ.50కి పైమాటే. టమాటా, ఉల్లి ధరలు సరేసరి. పేదవాడింట వీటికి ప్రవేశం నిషిద్ధమయ్యే పరిస్థితి దాపురించింది. ఇవన్నీ ఇలావుంటే, ఇంకొకవైపు పండుగ వేళ పప్పుల ధరలు మండుతున్నాయి. కందిపప్పు, మినుములు, శెనగలు, పెసల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా అయ్యింది. గత వారం రోజుల్లో దేశంలోని ప్రధాన మార్కెట్లలో క్వింటాల్‌కు మినప పప్పు ధర రూ .450- రూ.850 పెరిగింది. పెసరపప్పు, కందిపప్పు, శెనగపప్పుల ధరలు కూడా అదేరీతిలో పెరిగిపోయాయి.

భారీ వర్షాల కారణంగా మధ్యప్రదేశ్‌లో మినప పంట దెబ్బతినడం పప్పుధాన్యాల ధరల్లో పెరుగుదలకు కారణమని నిపుణులు అభిప్రాయపడ్డారు. అదే సమయంలో, గతేడాదితో పోలిస్తే, ఈ ఖరీఫ్ సీజన్లో పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం తక్కువేనని తేలింది. ఇక మొన్నటిదాకా కిలో శెనగలు రూ. 55-60 మధ్య ఉండగా, ఇప్పుడది రూ. 65-75కి చేరింది. ముంబైలో అయితే ఏకంగా 90 రూపాయలు పలుకుతోంది.

- దేశ ఆర్థిక రాజధాని ముంబైలో మంగళవారం మినపప్పు ఎఫ్ఎక్యూ (బర్మా రకం) హోల్‌సేల్ ధర క్వింటాల్‌కు రూ .5,450 గా ఉంది. అంతకుముందు వారంతో పోలిస్తే రూ.550 ఎక్కువ. అదే సమయంలో, ఢిల్లీలో 450 రూపాయలు పెరిగి 5,400 రూపాయలకు చేరుకుంది. చెన్నైలో ఎఫ్ఎక్యూ మినపప్పు ధర రూ.5,650, యుక్యూ వెరైటీ ధర క్వింటాల్‌కు రూ .6,775లుగా నమోదైంది. ఇక చెన్నై, కోల్‌కతాలోనూ క్వింటాలు ధర రూ.6000 పైచిలుకే ఉంది.
- పెసరపప్పు విషయానికొస్తే, క్వింటాల్‌కు రూ.100-200కి పెరిగింది. ఢిల్లీలో మంగళవారం రాజస్థాన్ రకం క్వింటాల్‌కు 6,100 రూపాయలుగా రికార్డయింది.
- 2018-19 (జూన్-జులై) సీజన్‌లో మొత్తం పప్పుధాన్యాల ఉత్పత్తి 234.8 లక్షల టన్నులు. దేశీయ అవసరాలు మాత్రం 240 లక్షల టన్నులుగా ఉన్నది. ఉత్పత్తి కంటే డిమాండ్ ఎక్కువ. ప్రస్తుత పంట కాలంలోనూ ఇదే పరిస్తితి ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఖరీఫ్ పప్పు ధాన్యాల ఉత్పత్తి 82.3 లక్షల టన్నులకు పరిమితం కావొచ్చని భావిస్తున్నారు. గతేడాది కంటే (92.2లక్షల టన్నులు) ఇది దాదాపు 10 లక్షల టన్నులు తక్కువ.
- మధ్యప్రదేశ్‌లో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు మినుపు, పెసల ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. 25-30 శాతం మేరకు దిగుబడి తగ్గుతుందని, అదేసమయంలో వీటి ధరల్లో 10-15శాతం పెరుగుదల ఉండొచ్చని వర్తకులు అంచనా వేస్తున్నారు.

# త్వరలో కేంద్ర కేబినెట్ విస్తరణ

**● రెండు వారాల్లో కసరత్తు పూర్తయ్యే ఛాన్స్**
**● నిపుణులకు పెద్దపీట వేసే అవకాశం**
**● సురేష్‌ప్రభుకి కీలకశాఖ?**

**న్యూఢిల్లీ:** మోడీ 2.0 కేబినెట్ పునర్‌వ్యవస్థీకరణకు కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరో రెండు వారాల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కేబినెట్ ప్రక్షాళన జరిగితే, సురేశ్ ప్రభుకు అవకాశం లభించొచ్చని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఆయన కీలకమైన వాణిజ్య, పరిశ్రమల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మోడీ రెండవసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, ఈ శాఖను పీయూష్ గోయల్‌కు అప్పగించారు. మోడీ 1.0 ప్రభుత్వంలో ప్రభు కీలకంగా వ్యవహరించారు. జీ20 సదస్సు నిర్వహణ బాధ్యతలు కూడా చేపట్టారు. రైల్వేవంటి కీలక మంత్రిత్వశాఖలు అప్పగించినప్పటికీ పార్టీకి మైలేజీని తీసుకురాలేక పోయినందునే రెండవ దఫా కేబినెట్‌కు ఆయన్ను దూరమయ్యేందుకు కారణమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ మందగించడం, జీడీపీ అంచనాలు తగ్గుతుండటం మోడీ ప్రభుత్వాన్ని కలవరపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్థికరంగంలో నైపుణ్యం కలిగిన వారికి కేబినెట్‌లో కీలక బాధ్యతలు అప్పగిస్తే మంచిదని మోడీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ అయిన సురేష్ ప్రభు సేవలు సద్వినియోగం చేసుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం.

ఆటోమొబైల్ వంటి కీలక రంగాలలో ఆర్థిక వ్యవస్థ అత్యుత్తమ స్థితిలో లేకపోయినా, ఉద్యోగ నష్టాలు కొనసాగుతున్నప్పటికీ, ఆర్థికమంత్రిగా నిర్మలా సీతారామన్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. అలసిపోయిన ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలిచ్చేందుకు చర్యలు చేపట్టారు. కార్పొరేట్ పన్నును 30 శాతం నుండి 22 శాతానికి తగ్గించారు. ఈ చర్యను మోడీ ప్రశంసించారు. బ్యాంకుల విలీనం, ఎఫ్‌పిఐ (ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు)కోసం సర్‌చార్జి ఉపసంహరణ వంటి కీలకనిర్ణయాలు ఆమె చొరవతో జరిగాయి.

అయితే, దేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచే ఇతర మంత్రిత్వశాఖలకు మరింత మంది సాంకేతిక నిపుణులను, ప్రధాన నైపుణ్యం కలిగిన వ్యక్తులను తీసుకువచ్చేందుకు మోడీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మాజీ విదేశాంగ కార్యదర్శి ఎస్.జైశంకర్‌ను కేబినెట్‌లోకి చేర్చుకోవడం ద్వారా అందరినీ ఆశ్చర్యపరిచారు. కాశ్మీర్‌కు ఆర్టికల్ 370 రద్దు చేసిన తరువాత, అంతర్జాతీయ దౌత్యంలో జైశంకర్ నైపుణ్యం ఎంతగానో ఉపయోగపడింది. ఇతర కీలకశాఖలను ఆయా రంగాల నిపుణులకు అప్పగించాలని ఆలోచన చేస్తున్నారట.



కేంద్ర కేబినెట్‌లో ప్రస్తుతం 58 మంది మంత్రులు ఉన్నారు. వీరిలో 24 మంది కేబినెట్ హోదాలో ఉన్నారు. కొం దరు ఒకటి కంటే ఎక్కువ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో తమ శాఖపై పూర్తిస్థాయి పట్టు సాధించలేక పోతున్నారు. నరేంద్రసింగ్ తోమర్ వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలను కలిగివున్నారు. రవిశంకర్ ప్రసాద్‌కు లా అండ్ జస్టిస్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ బాధ్యతలు చూస్తున్నారు. ఇలాంటి వారికి అదనపు బాధ్యతల నుంచి విముక్తి కల్పించే అవకాశం ఉంది. దీంతో పాలనా పరమైన నిర్ణయాలతోపాటు, రాజకీయంగానూ వీరి సేవలను సమర్థవంతంగా వినియోగించుకునే వెసులుబాటు కలుగుతుంది. తోమర్ హర్యానా ఎన్నికల ఇన్‌చార్జిగా ఉన్నారు. జైట్లీ మరణం తరువాత పార్టీ వ్యవహారాలను రవిశంకర్ ప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు. కేబినెట్ విస్తరణతో ఇలాంటి వారికి భారం తగ్గుతుందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.



# ఆటో రయ్!

- **రాష్ట్రంలో పెరిగిన అమ్మకాలు**
- **సబ్సిడీ రుణాలే కారణం**
- **కార్పొరేషన్ల ఇతోధిక సాయం**
- **స్వయం ఉపాధికి కోట్లు కేటాయింపు**
- **రూ.2 లక్షల్లోపే యూనిట్ ధర**
- **బ్యాంకర్లూ సానుకూలం**
- **ఉపాధిపై క్షేత్రస్థాయిలో కొరవడిన అధ్యయనం**

**(అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి):** ఆర్థికమాంద్యం ఆటోమొబైల్ పరిశ్రమను కుదిపేస్తోంది. ప్రస్తుత ఆర్థికసంవత్సరం రెండో త్రైమాసికంలో ఆంధ్ర ప్రదేశ్‌లో వాహనాల విక్రయం దాదాపు 39శాతం పడిపోయింది. వ్యక్తిగత, రవాణా వాహనాల కొనుగోలులో తిరోగమనం జోరుగా ఉంది. అయితే ఒక్క ఆటోల విషయంలో మాత్రమే అమ్మకాలు ఆశాజనకంగా ఉన్నాయి. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఈ ఏడాది ఆటో అమ్మకాలు 18శాతానికిపైగా వృద్ధి నమోదు చేశాయి. ఇందు క్కారణం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత కొన్నేళ్ళుగా కులాల వారీగా కార్పొరేషన్‌లు నెలకొల్పి స్వయం ఉపాధి పథకాల క్రింద ఇతోధికంగా రుణాల్ని మంజూరు చేయ డమే. గతంలో ఎస్‌సి సొసైటీ, ఎస్‌టి కార్పొరేషన్, బిసి కార్పొరేషన్, మైనార్టీ కార్పొ రేషన్‌లు మాత్రమే ఉండేవి. ఇవికూడా స్వయం ఉపాధి పథకాల్ని అమలు చేసేవి. అయితే గత మూడ్నాలుగేళ్ళలో దాదాపు ప్రతి కులానికి ఓ కార్పొరేషన్ లేదా ఫెడ రేషన్ ఏర్పాటైంది. అంతకుముందున్న కార్పొరేషన్‌లతో పాటు కాపు కార్పొరేషన్, బ్రాహ్మ ణ కార్పొరేషన్, వైశ్యా కార్పొరేషన్, రెల్లి కార్పొరేషన్, మాదిగ కార్పొరేషనలు నెల కొల్పారు. వీటితో పాటు రజకులు, నాయీబ్రహ్మణులు, సగరలు, కృష్ణ బలిజలు, విశ్వబ్రాహ్మణులు, మేదర్లు, శాలివాహనలు, వడ్డెరలు, వాల్మీకిలు, గీత కార్మికుల కోసం విడివిడిగా ఫెడరేషన్‌లు ఏర్పాటు చేసారు. వీటన్నింటి విధి ఒకటే. ఆయా కులా లు, వర్గాలకు సంబంధించిన నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకాల్ని రూపొం దించడం, అర్హుల్ని ఎంపిక చేసి వారికి రుణసదుపాయం కల్పించడం.

ఈ అన్ని కార్పొరేషన్లు, ఫెడరేషన్లు సబ్సిడీతో కూడిన రుణాలిస్తున్నాయి. వీటిని సద్వినియోగం చేసుకుని నిరుద్యోగులు స్వయం ఉపాధి పథకాల్ని చేపట్టాలి. కొని కార్పొరేషన్లు, పెడరేషన్లు 20నుంచి 50శాతం వరకు సబ్సిడీలిస్తున్నాయి. గరిష్టంగా లక్ష వరకు వ్యక్తిగతంగా సబ్సిడీని భరిస్తున్నాయి. అదే గ్రూపుల వారీ అయితే గ్రూప్ కు గరిష్టంగా ఏడున్నర లక్షల సబ్సిడీని జారీ చేస్తున్నాయి. అయితే ఈ పథకాలకు సంబంధించి బ్యాంక్ లింకేజ్ ఉంటుంది. మొత్తం యూనిట్ విలువలో సగం వరకు బ్యాంకులు రుణంగా మంజూరు చేస్తాయి. మిగిలిన సగాన్ని కార్పొరేషన్‌లు లేదా ఫెడరేషన్లు బ్యాంకులకు సబ్సిడీ రూపంలో జమ చేస్తాయి. ఈ రెండింటిని కలిపి బ్యాంకులు యూనిట్‌ను మంజూరు చేస్తారు. తామిచ్చిన 50శాతం మొత్తాన్ని వడ్డీతో సహా వాయిదాల పద్ధతిలో తిరిగి వసూలు చేస్తారు. అంతవరకు మంజూరు చేసిన యూనిట్‌పై అధికారం బ్యాంకులకే ఉంటుంది. నిర్వహణమాత్రమే లబ్ధిదారుడి చేతుల్లో ఉంటుంది. బ్యాంకులు సహజంగానే చరాస్తులపై రుణాలిచ్చేందుకు ముందుకు రావు. పైగా ఈ రుణాలన్నీ ఎలాంటి హామీతో సంబంధంలేనివే. దీంతో లబ్ధిదారుడు నిర్వహించే స్వయం ఉపాధి పథకం తమ కనుసన్నల్లోమాత్రమే కొనసాగాలని బ్యాం కర్లు కోరుకుంటారు. తమ అనుమతి లేందే ఆయూనిట్ చేతులు మారే అవకాశాలుండకూడదు.

అందుకే దుకాణాలు, చిన్న చిన్న పరిశ్రమలకు ఈ పథకాల క్రింద రుణాలిచ్చేందుకు బ్యాంకులు వెనుకాడుతున్నాయి. వీటికంటే వాహనాల కొను గోలుకు ఇవి ముందుకొస్తున్నాయి. అయితే కార్లు, ఇతర వాహనాల ఖరీదు ఈ పథ కంలో మంజూరయ్యే యూనిట్ విలువకు దరిదాపుల్లో ఉండదు. దీంతో రెండు లక్షల్లోపు పూర్తిగా తమ కనుసన్నల్లో మాత్రమే నిర్వహించగలిగే యూనిట్ ఆటో మాత్రమేనన్న దృక్పథానికి బ్యాంకర్లు వచ్చేశారు. దీంతో బ్యాంకులు ఆటోలైతే రుణా ల మంజూరుకు సై అంటున్నాయి. మరే ఇతర యూనిట్‌లకు ఒక పట్టాన రుణాలి వ్వడంలేదు. ఒకవేళ తప్పదనుకుంటే అందుకు తగ్గ హామీని అనధికారికంగా తీసుకుంటున్నాయి. ఈ కార్పొరేషన్‌లు, ఫెడరేషన్ల దరఖాస్తుదార్లు కూడా స్వయం ఉపాధి కంటే లక్షరూపాయల సబ్సిడీకే ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. బ్యాంకుల అంగీకారం మేరకు ఆటోల్ని కొనుగోలు చేస్తున్నారు. ఇదే ప్రస్తుతం ఆటోల అమ్మ కాలు జోరందుకోవడానికి కారణమౌతోంది.




సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శుక్రవారం 4 అక్టోబర్ 2019

## జీఎస్టీ ప్రమాద ఘంటికలు!

దేశ ఆర్థికవ్యవస్థ ఊహకందని రీతిలో ఎగుడుదిగుళ్లకు గురవుతున్న సంకేతాలు ప్రస్ఫుటమవుతున్నాయి. పాలకులు ఒకటి ఆలోచిస్తుంటే ప్రజలు మరొక విధంగా అడుగులు వేసున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ అంతా సవ్యంగా ఉందన్న భరోసాని దేశ ప్రజలకు ఇస్తుంటే అదే ప్రజ ఆలోచనా సరళి మాత్రం అందుకు భిన్నంగా ఉంటున్నది. ఆర్థికవ్యవస్థకు కొత్త జవజీవాలిచ్చే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న కొన్ని నిర్ణయాలింకా దేశ ఆర్థిక యవనిక మీద సత్ఫలితాల బాట పట్టిన జాడ కనిపించకపోగా, వాటివల్ల సమీప భవిష్యత్తులోనైనా సత్ఫలితాలుంటాయా అన్న అను మానాలు తలెత్తుతున్నాయి. వస్తు సేవా పన్ను.. జీఎస్టీ వసూ ళ్లు తగ్గిపోవడంలోని ఆంతర్యం ఇదేననిపిస్తుంది. మొన్న సెప్టెంబరు నెలలో జీఎస్టీ 91,916 కోట్ల రూపాయలు వసూళ్లయ్యాయి. ఇది గత పందొమ్మిది నెలల్లో ఇంత తక్కువ వసూళ్లు ఏనాడూ లేవని లెక్కలు చెబుతున్నాయి. ఈ ఒక్క తాజా ఉదాహరణ చాలు.. ఆర్థిక వ్యవస్థకు ఇటీవల చేపట్టిన చికిత్సలు అక్కరకు రావడం లేదని భావించడానికి. కార్లు, మోటారుసైకిళ్ల అమ్మకాలు మొన్న సెప్టెంబరులో ఐదింట ఒకవంతు పడిపోయాయి. గ్రామీణ పట్టణ మార్కెట్టు వినియోగదారుడికి చేరువ కాకపోగా మరింత దూరం జరిగిందని ఈ పరిణామం సూచిస్తున్నది. స్థూలంగా పారిశ్రామిక కార్యకలాపాలు మందగించినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కేంద్రం ఈమధ్యే కార్పొరేట్ పన్ను తగ్గించింది. ఆ మిగులుని విని యోగదారుడికి వదిలితే అంతిమంగా అమ్మకాలు పెరగడానికి దోహదపడుతుందని కేంద్రం భావించింది. ఆలోచన బాగానే ఉందిగాని ఆచరణలోనే గాడి తప్పింది. కార్పొరేట్ పన్ను తగ్గుదల దరిమిలా లభించిన ఆర్థిక వెసులుబాటుని కంపెనీలు తమ వడ్డీ బకాయిల చెల్లింపులకు మళ్లించుకుంటున్నాయి. కనీసం కొత్త ప్రాజెక్టుల విస్తరణకు వినియోగించినా అది పరోక్షంగా అమ్మకాల విస్తృతికి, ఉపాధికల్పనకు ఉపకరించి వినియోగదారుడిలో నమ్మకాన్ని పెంచేందుకు వీలుండేది. కంపెనీలు తమ సంస్థ భవిష్యత్తు దృష్ట్యా తమ తక్షణావసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటాయి కాబట్టి వాటిని తప్పుపట్టడానిక్కూడా ఆస్కారం లేదు. ఇక్కడే కేంద్రం నిర్ణయాలకు, కార్పొరేట్‌రంగం ఆలోచనలకు, వినియోగదారుడి సమస్యలకు పొంతన కుదరడం లేదు. కేంద్రం ఎన్నిరకాలుగా నిధులను అందుబాటులో ఉంచుతున్నా అవి ఆర్థిక వ్యవస్థకు అక్కరకొచ్చే ఔషధంగా ఉపకరించ లేకపోతున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే, జీఎస్టీ వసూళ్లు పడిపోవడమే కాదు.. ప్రత్యక్ష పన్నుల రాబడి మందగమనం, కార్పొరేట్ పన్ను తగ్గుదల, కలగలిసి కేంద్రం మీదే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాల మీద కూడా ప్రతికూల ప్రభావం చూపుతు న్నాయి. సాధారణంగా రాష్ట్రాలు కేంద్రం కన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువ ఖర్చు చేస్తాయి. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థలు ఆరోగ్యకరంగా ఉండటం చాలా అవసరమని ప్రత్యే కంగా చెప్పనవసరం లేదు. రిజర్వుబ్యాంకు తాజా నివేదిక ప్రకారం, రాష్ట్రప్రభుత్వాలు తమ ద్రవ్యలోటుని తగ్గించుకోవ డానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. ఆ ప్రయత్నంలో అవి కొంతమేర సఫలమవుతున్నట్టు కనిపిస్తున్నప్పటికీ, మౌలిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్న అసంతృప్తి రాష్ట్రాల్లో ఉంది. కిందటేడాది 2.9 శాతం ఉన్న ద్రవ్యలోటుని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.6 శాతానికి పరిమితం చేయాలన్న సంకల్పం ఇందులో భాగంగానే గుర్తించాలి. రాష్ట్రాలు ఇటీవలి కాలంలో రైతు రుణ మాఫీ పథకాలు ప్రక టిస్తున్నాయి. దానికితోడు ఆదాయం పెంచే స్కీములకు ప్రాధాన్యతనిస్తున్నాయి. దరిమిలా ఖర్చులు పెరిగిపోతు న్నాయి. రాబడిలో వృద్ధి మందగిస్తున్నది. ఇది ద్రవ్యలోటు మీద ప్రభావం చూపుతున్నది. స్టాంపు డ్యూటీ, అమ్మకపు పన్నుల మీద ప్రతి ఏడాది బడ్జెట్ రూపకల్పన సమయంలో రాష్ట్రప్రభుత్వాలు పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకోవడం, తీరా లక్ష్యాల విషయానికొచ్చేసరికి అవి మందగమనంలో ఉండటం పెద్ద సమస్యగా మారింది. రాబడుల మీద భారీ ఆశల వల్ల ఖర్చుల విషయంలో గతితప్పుతున్న దృష్టాంతాలు అనేకం ఉంటున్నాయి.

జీఎస్టీ వసూళ్ల లక్ష్యాలను చేరుకోవడానికి అనేక రాష్ట్రాలు సతమతమవుతున్నాయి. జీఎస్టీ వసూళ్లు తగ్గితే కేంద్రం పరిహారం చెల్లించడం నిజమే అయినా, అది ఎంతకాలమన్నది ప్రశ్న. అదేమీ శాశ్వత ప్రాతిపదికన ఉండే సౌలభ్యం కాదు. అందుకే చాలా రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. జీఎస్టీ వ్యవస్థ 2017 జులై ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చినా ఇంకా అది బాలారిష్టాలను ఎదుర్కొంటూనే ఉంది. పరిష్కారం కావాల్సిన అంశాలు అనేకం ఉన్నాయి. వాటిని వీలువెంట పరిష్కరించుకుని జీఎస్టీ విషయంలో రాష్ట్రాలు ఆర్థిక ప్రతిబంధకాలకు లోనుకాకుండా స్థిరత్వం పొందాల్సిన అవసరం ఉంది. టాక్సు అడ్మినిస్ట్రేషన్‌కు ప్రధాన సవాలుగా పరిణమించిన ఇన్ వాయిస్ మ్యాచింగ్ సిస్టమ్ గురించి ఆలోచించాలన్న డిమాం డు పెరుగుతున్నది. మరోవంక రాష్ట్రాలు గత కొన్నేళ్లుగా అప్పుల బాధతో సతమతమవుతున్నాయి. అభివృద్ధి కార్యక్రమాల కోసం రుణాలు తీసుకురావడం తప్పేమీ కాదన్న భావన రాష్ట్ర పాలకవర్గాల్లో ప్రబలిపోవడం ఒక దుష్పరి ణామంగా గుర్తించాలి. అభివృద్ధి పథకాలకు రుణాలు తేవడాన్ని సూత్రప్రాయంగా తప్పు పట్టాల్సిన పనిలేకున్నా, అభివృద్ధి పథకాల నిర్వచనం దగ్గరే సమస్య వస్తున్నది. రాష్ట్రా ల స్థాయిలో రుణాల స్థాయి జీడీపీలో 25 శాతంగా ఉంటు న్నది. రాష్ట్రాలు చేసే అప్పులే కాకుండా రాష్ట్రాలు ప్రభుత్వరంగ సంస్థల అప్పులకు ఇచ్చే గ్యారంటీలను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఆ అప్పులు పరిధులు మించుతున్నాయి. మరో వంక ఇంధన పంపిణీ సంస్థల ఆర్థికస్థితిగతులు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థికస్థితి మీద వత్తిడి పెంచుతున్నాయి. 2024-25 నాటికి రాష్ట్రాల రుణస్థితిని జీడీపీలో 20 శాతానికి తగ్గించా లంటే, ఇప్పుడున్న పరిస్థితుల్లో, ప్రతి ఏడాది రాబడిని 14 శాతం పెంచాల్సి ఉంటుంది. ఇది నిజానికి కత్తిమీద సామే. కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా ఆర్థిక కార్యకలాపాల విస్తృతికి కృషి చేయాల్సిన అవసరాన్ని దేశ ఆర్థిక ప్రగతి రథచక్రాల మంద గమనం సూచిస్తున్నది. జీఎస్టీ వసూళ్లలో తగ్గుదలని మాత్రం ఒక హెచ్చరికగా తీసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. అదేసమయంలో వినియోగదారుడిలో విశ్వాసాన్ని పెంచకుండా తాత్కాలిక ఉమశమన చర్యలు ఎన్ని తీసుకున్నా పెద్దగా ప్రయోజనం ఉండబోదు. ఈ సంగతి ఇప్పటికే నిరూపితమైంది.

# పులి దారికొచ్చింది!



కలిసి ఉంటే కలదు సుఖం అనే తత్వం బీజేపీ, శివసేనలకు తెలిసినట్టుగా ఇంకెవరికీ తెలియదేమో. 2014 ఎన్నికల్లో సీట్ల పంపిణీలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఇరు పార్టీలూ 25 ఏళ్ల తరువాత విడివిడిగానే పోటీ చేశాయి. 2019 ఎన్నికల్లో మాత్రం ప్రతిపక్షాలను చిత్తు చేసేందుకు బీజేపీ, శివసేనలు ఏకం అయ్యాయి. గత మూడేళ్లుగా ప్రధాని మోడీపై, బీజేపీపై విమర్శలు గుప్పించిన శివసేన.. కమలం పార్టీకి తిరిగి దగ్గరైంది. సీట్ల పంపకాల విషయంలో కూడా పొత్తు కుదరడంతో ప్రచారంలో ప్రతిపక్షాలపై తమదైన శైలిలో విరుచుకుపడుతున్నాయి. శివసేనతో పొత్తు కుదరడంతో ప్రతిపక్షాలను తమవైపు తిప్పుకోవడంలో బిజీగా ఉన్న బీజేపీ.. రెండో సారి అధికారంలోకి వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకుంటుండగా.. పొత్తుతో మరింత బలాన్ని పెంచుకుని అధికారం పంచుకునేందుకు శివసేన కూడా ఉవ్విళ్లూరుతోంది. ఠాక్రే వంశంలో మూడో తరం ఆదిత్య ఠాక్రే బరిలో ఉండటంతో.. అక్టోబర్ 21న జరిగే అసెంబ్లీ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. 1990 నుంచి 2004 వరకు జరిగిన ప్రతీ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు పెట్టుకోగా.. శివసేనయే అత్యధిక సీట్లలో పోటీ చేస్తూ ఎక్కువ స్థానాల్లో విజయం సాధించుకుంటూ వచ్చింది. 2009లో సేనకు 44 సీట్లు, బీజేపీకి 46, 2014లో సేనకు 63, బీజేపీకి 122 సీట్లు వచ్చాయి. అయినా సీనియర్‌గా బీజేపీ నే వ్యవహరిస్తూ వచ్చింది. సేన మాత్రం జూని యర్ పార్ట్‌నర్‌గానే ఉంటూ వచ్చింది.



**బీజేపీకి 164, సేనకు 124 సీట్లు:** సమయం తక్కువగా ఉండటంతో బీజేపీ, శివసేనలు వేగంగా పావులు కదుపుతున్నాయి. 288 సీట్లు ఉన్న అసెంబ్లీలో ఈసారి బీజేపీ 164 స్థానాల్లో పోటీ చేయనుంది. ఇందులో 14 సీట్లను చిన్న భాగ స్వామ్య పార్టీలకు బీజేపీ కేటాయించాల్సి ఉంటుంది. ఆ ప్రకారం బీజేపీ సొంతంగా 150 సీట్లలో పోటీ చేస్తుంది. తక్కిన 124 సీట్లు శివసేనకు కేటాయించారు. 2014 ఎన్నికలతో పోలిస్తే ఈసారి పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. అధికార బీజేపీ, శివసేనతో పాటు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే వర్గం), ధంగర్ వర్గానికి చెందిన మహదేవ్ జంకర్‌కు చెందిన రాష్ట్రీయ సమాజ్ పార్టీ, మంత్రి సదాభావు ఖోత్ నేతృత్వం లోని రైత్‌క్రాంతి, వినాయక్ మేటేకు చెందిన శివసంగ్రామ్ పార్టీతో పొత్తు ఖరారు చేసుకుంది.

**బీజేపీ జూనియర్ పార్ట్‌నర్‌గా ఎందుకు...?:** నేటితో నామినేషన్ల గడువు ముగుస్తుంది. బీజేపీ పెద్దన్న పాత్ర పోషిస్తుండగా.. శివసేన జూనియర్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తోంది. శివసేన ఇప్పుడు పెద్దగా బెదిరించేది బెట్టు చేసేది లేకుండా పోయింది. బీజేపీ చెప్పినట్టు వినాల్సిన పరిస్థితి. 1990లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, శివసేన కూటమిగా బరిలోకి దిగాయి. శివసేన 183 స్థానాల్లో, బీజేపీ 104 స్థానాల్లో పోటీ చేసింది. బీజేపీకి 42 స్థానాలు, శివసేనకు 52 సీట్లు దక్కాయి. కానీ 2019కి వచ్చే సరికి సీన్ కాస్త రివర్స్ అయ్యింది. బీజేపీ 164, శివసేన 124 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. అయితే శివసేన తాను జూనియర్ పార్ట్‌నర్‌గా ఉండటానికి ప్రధానంగా నాలుగు కారణాలు ఉన్నాయి.

**1. సీన్ మారింది :** దేశ వ్యాప్తంగా బీజేపీ బలమేంటో శివసేన తెలుసుకుంది. గతం కంటే ఎంతో పటిష్టమైందని గ్రహించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తిరుగులేని పార్టీగా అవతరించింది. క్షేత్ర స్థాయి నుంచి పార్టీ బలోపేతమైంది. దీన్ని గ్రహించని సేన.. మున్సిపల్ ఎన్నికల్లో ఒంటరిగా వెళ్లి చతికిలబడింది. మెరుగైన ఫలితాలు సాధించలేదు.

**2. ఏకమైన ప్రతిపక్షాలు :** 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, శివసేన వేర్వేరుగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నాక... ప్రతిపక్ష పార్టీలు చీలిపోయాయి. కాంగ్రెస్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ కూడా గత ఎన్నికల్లో కూటమిగా ఏర్పాటు చేయడంలో విఫలం అయ్యాయి. ఈ రెండు ప్రతిపక్షపార్టీలు ఇప్పుడు ఉనికి కోసం పోరాటం చేస్తున్నాయి. ఇప్పుడు కూడా ఒంటరిగా బరిలోకి దిగితే పరాభావం తప్పదని శివసేన భావించి జూనియర్ పార్ట్‌నర్‌గా ఉండేందుకు సిద్ధమైంది.

**3. కుటుంబ ప్రతిష్ట :** ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే ప్రత్యక్షంగా ఎన్నికల బరిలోకి దిగుతున్నాడు. వర్లీ నియోజకవర్గం నుంచి ఆదిత్య ఠాక్రే గురువారం నామినేషన్ దాఖలు చేశారు. శివసేన 'తొలి కుటుంబం' నుంచి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న మొట్ట మొదటి సభ్యుడిగా ఆదిత్య ఠాక్రే ఉన్నాడు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయ తీరానికి తీసుకెళ్లేంతగా యువ నాయకుడు ఎదిగాడని శివసేన ప్రపంచానికి చూపించాల్సిన అవసరం ఉంది. బీజేపీతో పొత్తు పెట్టుకోవడంతోనే ఇది సాధ్యం అవుతుందని గమనించి జూనియర్ పార్ట్‌నర్‌గా ఉండేందుకు అంగీకరించింది.

**4. సీఎం పీఠం:** దేశవ్యాప్తంగా బీజేపీ దూకుడు ఉన్నా..సేన తన కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నూరి పోయాల్సిన అవసరం ఉంది. బీజేపీ పెద్దన్న పాత్ర పోషిస్తుండటం.. సేన మళ్లీ తోకపార్టీగానే మిగిలిపోవడంతో పార్టీ కార్యకర్తల్లో అసంతృప్తి నెలకొంది. తమ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేసినా.. సీఎం పదవి మాత్రం ఆదిత్య ఠాక్రేకే వెళ్తుందన్న ధీమాలో సేన కార్యకర్తలు ఉన్నారు. ఈ ఎన్నికల్లో మరింత దూసుకెళ్లేందుకు ప్రయత్నించడానికి ఇదొక కారణం.

**పొత్తు ఈనాటిది కాదు..:** శివసేన, బీజేపీ పొత్తు ఇప్పటిది కాదు. ఎప్పటి నుంచో వస్తున్నది. మొదట్లో శివసేనతో పొత్తు పెట్టుకోవడానికి బీజేపీ పెద్దగా ఇష్టపడలేదు. 1985 ముందు వరకు పార్టీకి పెద్దగా పట్టు కూడా లేదు. కొన్ని చోట్ల మాత్రమే నామమాత్రంగా ఉండేది. 1985 తరువాత పరిస్థితి మారింది. బీజేపీ హిందుత్వ ఎజెండాతో ముందుకు రావడంతో పార్టీకి కలిసి వచ్చింది. అప్పటి నుంచే శివసేన బీజేపీకి దగ్గరైంది. 1989లో రెండు పార్టీలు ఏకం అయ్యాయి. మహారాష్ట్రలో శివసేన బీజేపీకి పెద్దగా ఉంది. కాగా దేశంలో బీజేపీ, శివసేనకు మార్గదర్శకంగా నిలిచింది. కానీ ఇప్పుడు బీజేపీ పరిస్థితి వేరు. దేశంలో భారీ మెజార్టీ సాధిస్తోంది. మహారాష్ట్రలోనూ మంచి పట్టు సాధించింది. ముంబై మున్సిపాలిటీ ఎన్నికల్లో సైతం ఏకంగా 82 స్థానాలు గెలుచుకుంది. ఒక్క థానే మినహా మిగిలిన చోట్ల బీజేపీకి మంచి పట్టు ఉంది. అయినా శివసేనతో కలిసి పోటీ చేయాలని నిర్ణయం తీసుకుంది బీజేపీ.

**కూటమి సఫలీకృతం అవుతుందా..?:** బీజేపీకి 164 సీట్లు కేటాయించగా.. అందులో 14 సీట్లు చిన్న పార్టీలకు ఇవ్వనుంది. అయితే మరిన్ని సీట్లు చేజిక్కించుకోవాలని భావించిన బీజేపీకి శివసేన రూపంలో చుక్కెదురైంది. ప్రచారంలో బీజేపీ, శివసేన కలిసి ముందుకు వెళ్తుందా..? లేదా కూటమి అభ్యర్థిని ఓడించేందుకు పార్టీలు వేర్వేరుగా పన్నాగాలు పన్నుతాయా..? అన్నది తెలియడం లేదు. ప్రతిపక్షాలు బలంగా లేకపోవడంతో బీజేపీ, శివసేన కూటమి (యుతీ) కొంత పటిష్టంగా ఉన్నప్పటికీ.. కొన్ని ఇబ్బందులు తప్పవని తెలుస్తోంది. ఇప్పటికే చాలా మంది ప్రతిపక్షనేతలు శివసేన, బీజేపీలో చేరారు. ఇది వారి మనోధైర్యాన్ని పెంచుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే సేన, బీజేపీ కోసం.. బీజేపీ, సేన కోసం నిజాయితీగా పని చేస్తుందా..? లేదా..? చూడాలి. నవీ ముంబై టికెట్ బీజేపీ నేత గణేష్ నాయక్‌కు కేటాయించడంతో 200 మంది సేన కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేశారు. ఇలాంటి నేపథ్యంలో స్థానిక సేన నేతలు బీజేపీ అభ్యర్థి నాయక్ గెలుపునకు కృషి చేస్తారా..? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అయితే మోడీ, షా కూడా వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తున్నారు. 29 ఏళ్ల ఆదిత్య ఠాక్రేకు వర్లీ సీటు కేటాయించింది. ఒకవేళ బీజేపీకి వ్యతిరేకంగా సేన పని చేస్తే అందరికీ చెక్ పెట్టేందుకు కమలదళం ఇప్పటికే వ్యూహాలు సిద్ధం చేసింది.

**ముఖ్యమంత్రి పదవిపై సేన నజర్:** ఎలాగైనా మహా పీఠాన్ని అధిరోహించాలనేది శివసేన కుటుంబం ఆశ. ఇందు కోసం చాలానే ప్రయత్నాలు సాగించింది. అయితే ఇప్పటి వరకు విజయవంతం కాలేదు. మహారాష్ట్రలో తొలి నుంచి కాంగ్రెస్ బలంగా ఉంటూ వచ్చింది. ఎన్‌సీపీ రూపంలో చీలిక వచ్చినా.. మళ్లీ ఇరు పార్టీలూ చేతులు కలిపాయి. అధికారాన్ని పంచుకుంటూ వచ్చాయి. ఐదేళ్ల క్రితం కాంగ్రెస్, ఎన్‌సీపీలకు ప్రజలు చెక్ పెట్టారు. బీజేపీ, శివసేనల కు టైం వచ్చింది. అయితే అప్పటి వరకు బీజేపీని తమ్ముడిగా చేసుకుంటూ తను పెద్దన్నగా చెలామణి అయ్యింది శివసేన. కానీ తీరా అధికారం దగ్గరకు వచ్చినప్పుడు బీజేపీ తోక జాడించింది.

తనే పెద్దన్నగా మారింది. శివసేనను తోక పార్టీగా చేసుకుంది. అక్కడ నుంచి అదే తీరు కొనసాగుతూ ఉంది. అప్పుడప్పుడు సేన వాళ్లు బీజేపీని విమర్శిస్తూ వచ్చారు. మోడీపై విరుచుకుపడ్డారు. మోడీ విధానాలను తప్పు బట్టారు. అయితే చివరికి ఆ పార్టీతోనే పొత్తు పెట్టుకోవాల్సి వచ్చింది.

**ఇరు పార్టీలకు రెబల్స్ బెడద:** పొత్తు ఖరారు కావడం.. నేటితో నామినేషన్ల గడువు ముగియనుండటంతో ఇరు పార్టీల్లో రెబల్స్ పెరిగారు. టికెట్ ఆశించి పొత్తు కారణంగా భంగపడ్డ వాళ్లంతా.. బహిరంగంగానే ఆందోళనలు చేపడుతున్నారు. లాతూర్, నవీ ముంబైలో వీధుల్లోకొచ్చి ఇరు పార్టీ కార్యకర్తలు నిరసనలు చేస్తున్నారు. సీఎం ఫడ్నవిస్ పీఏ అభిమన్యు పవార్‌కు టికెట్ దక్కకపోవడంతో 'రాస్తారోకో' ఆందోళన చేపట్టారు. నవీ ముంబైలో శివసేన కార్యకర్తలు కూడా ధర్నాకు దిగుతున్నారు. నవీ ముంబైలోని రెండు స్థానాలు బీజేపీకి కేటాయించడంతో సేన నేతలు పార్టీకి రాజీనామా చేశారు. శివసేన సిటీ యూనిట్ చీఫ్ విజయ్‌కు ఏరోలి సీటు ఇవ్వాలంటూ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. నాసిక్‌లో కూడా ఇరు పార్టీలకు రెబల్స్ బెడద ఎక్కువైంది. అయితే బీజేపీ, శివసేన రెబల్స్‌ను తనవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్, ఎన్‌సీపీ కూటమి ప్రయత్నిస్తోంది.

**30 ఏళ్లుగా బీజేపీ పెద్దన్న పాత్ర**: 1990లో ప్రారంభమైన బీజేపీ, శివసేన కూటమి 2014లో బ్రేక్ పడింది. మళ్లీ 2019లో రెండు పార్టీలు ఏకం అయ్యాయి. 1990 అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన 183 స్థానాల్లో పోటీ చేసి 52 స్థానాల్లో గెలుపొందగా.. బీజేపీ 104 సీట్లలో పోటీ చేసి 42 సీట్లను కైవసం చేసుకుంది.

♦ 1995లో 288 అసెంబ్లీ స్థానాల్లో శివసేన 183 నియోజకవర్గాల్లో పోటీ చేసింది. బీజేపీ 105 స్థానాల్లో బరిలో దిగింది. అయితే శివసేన 73 స్థానాల్లో, బీజేపీ 65 స్థానాల్లో విజయం సాధించింది.

♦ 1999 ఎన్నికల్లో శివసేన 161 స్థానాల్లో పోటీ చేసి 69 సీట్లు, బీజేపీ 117 నియోజకవర్గాల్లో పోటీ చేసి 56 స్థానాల్లో గెలుపొందింది.

♦ 2004 ఎన్నికల్లో శివసేన 163 స్థానాల్లో పోటీ చేసింది. బీజేపీ 111 నియోజకవర్గాల్లో బరిలో దిగింది. సేన 62 స్థానాల్లో, బీజేపీ 54 స్థానాల్లో విజయం సాధించింది.

♦ 2009 ఎన్నికల్లో శివసేన 169, బీజేపీ 119 స్థానాల్లో పోటీ చేయగా.. సేన 44 స్థానాల్లో, బీజేపీ 46 స్థానాల్లో గెలుపొందింది. 1990 నుంచి తొలిసారి బీజేపీ రెండు నియోజకవర్గాలను సేన కంటే ఎక్కువ సొంతం చేసుకుంది.

♦ 2014 ఎన్నికల్లో మాత్రం శివసేన, బీజేపీలు వేర్వేరుగా పోటీ చేశాయి. బీజేపీ 260 స్థానాల్లో, తన మిత్ర పక్షాలకు 28 స్థానాలు కేటాయించగా.. సేన 282 స్థానాల్లో పోటీ చేసింది. చివరికి బీజేపీ 122 సీట్లు సొంతం చేసుకోగా.. శివసేన కేవలం 63 స్థానాలకే పరిమితమైంది.

\- సుత్రావే సంజీవ్

# పుడమికి శాపం.. తాపం!



భూమి ఈ అనంత విశ్వంలో జీవమున్న ఏకైక గ్రహం. జీవరాశి మనుగడ సజావుగా సాగాలంటే పరిసర వాతావరణం, నీరు, భూ ఉపరితలం సహకరించాలి. వ్యవస్థీకృత లోపాలు, మితిమీరిన సహజ వనరుల వినియోగం, నాగరికత అన్న ముసుగులో పౌరసమాజం పుడమితల్లిని ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టేస్తున్నాయి. విపరీతంగా పెరిగిన శిలాజ ఇంధన వాడకం, విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, విచ్చల విడిగా వనాల విధ్వంసం వంటి చర్యలవల్ల పుడమి తాపం అనూహ్యంగా పెరిగి అన్ని అనర్థాలకు దారి తీస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా సాధారణ ఉష్ణోగ్రతకన్నా సగటు ఉష్ణోగ్రత 1.1 డిగ్రీల సెంటీగ్రేడ్ చొప్పున పెరుగుతూ ఉంది. ఈ ఏడాది 'మే' మాసంలో ఆస్ట్రేలియాకు చెందిన 'బ్రేక్ త్రూ నేషనల్ సెంటర్ ఫర్ క్లైమేట్ రిస్టోరేషన్' వెలువరించిన నివేదిక మేరకు 2030 నాటికి సగటు ఉష్ణోగ్రత 1.6 డిగ్రీల సెంటిగ్రేడ్‌లు 2045 నాటికి రెండు డిగ్రీల సెంటిగ్రేడ్, శతాబ్దం చివరి నాటికి వాతావరణ తాపం సాధారణ ఉష్ణోగ్రతకన్నా నాలుగు డిగ్రీల సెంటిగ్రేడ్ పెరుగుతుంది.

భూతాపం వల్ల వాతావరణంలో చోటుచేసుకుంటున్న విపరీత మార్పులు, వాటి వల్ల ఏర్పడే అనర్థాలపై ప్రపంచ దేశాలను ఇటీవల ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. తక్షణం అప్రమత్తత కాకపోతే పరిస్థితి చేయి దాటిపోవచ్చంటూ ప్రమాద ఘంటికలను మోగించింది. భూతాపంతో ప్రభావం కాని రంగమే లేదని, పౌరులు దీనిపై అవగాహన కలిగి ఉండి భూ మాతను పరిరక్షించుకుని భావితరాలకు మంచి భవిష్యత్తు అందించాల్సిన బాధ్యతను గుర్తు చేసింది.

భూతాపానికి కారణం వివిధ రకాలుగా వాతావరణంలోకి బొగ్గుపులుసు వాయువు (కార్బన్‌డయాక్సైడ్) చేరడం కొన్ని దశాబ్దాల క్రితం వాతావరణంలో 0.03 శాతంగా ఉన్న కార్బన్‌డయాక్సైడ్ ప్రస్తుతం 0.04 శాతంగా ఉన్నదని ఇంటర్ గవర్నమెంట్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (ఎంపీసిసి) నివేదిక తెలిపింది. ఈ ఏడాది మే 11 నాడు మొదటి సారి 415 పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్)గా నమోదైంది. ఇది 30 లక్షల సంవత్సరాలలో ఎన్నడూ నమోదు కాని ప్రమాదస్థాయి. అమెరికాలోని ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (ఈపిఏ) నివేదిక ప్రకారం పారిశ్రామిక విప్లవానికి (1750) ముందు 280 పీపీఎంగా ఉన్న కార్బన్‌డయాక్సైడ్ 1900లో 300 పీపీఎంగా నమోదైంది. 2016 నాటికి 400 పీపీఎంగా దీని స్థాయి పెరిగింది. అంటే కేవలం మూడేళ్ల వ్యవధిలో ఏకంగా 15 పీపీఎంలు అదనంగా చేరడం మానవాళికి ముంచు కొస్తున్న ముప్పుకు నిదర్శనం. ప్రతి కార్బన్‌డయాక్సైడ్ అణువు కొన్ని దశాబ్దాలపాటు వాతావరణంలోనే ఉంటుంది. ఉష్ణాన్ని బంధించుకునే స్వభావం ఉన్న కార్బన్‌డయాక్సైడ్‌తోపాటు 'గ్రీన్ హౌస్' వాయువుల ప్రభావంతో భూ ఉపరితలం, సముద్రాలు కూడా వేడెక్కుతున్నాయి. వాతావరణంలో జీవుల మనుగడకు కార్బన్‌డయాక్సైడ్ 350 పీపీఎం దాటరాదు.

భూతాపానికి రెండవ కారణం వైవిధ్యభరితమైన వృక్షజాతులు, జీవజాలానికి ఆలవాలమైన అడవులు నరికివేయడం. మేరీలాండ్ విశ్వవిద్యాలయ పరిశోధనలో 2018 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా 3.9 కోట్ల ఎకరాల అడవులు కనుమరుగైనట్లు తేలింది. అంతర్జాతీయ అధ్యయనాల ప్రకారం 1990- 2000 సంవత్సరాల మధ్య సగటున ఏటా మూడుకోట్ల 95 లక్షల ఎకరాల అడవులు నరికివేతకు గురైనాయి. భూమి ఉష్ణోగ్రత పెరగడానికి మూడో కారణం వాయు కాలుష్యం వాహనాల పొగ బొగ్గును మండించడం, విచ్చల విడిగా వంటచెరుకును వాడడం, పంట వ్యర్థాలను కుప్పగా పోసి పెద్దఎత్తున తగలబెట్టడంవల్ల విషపూరిత రసాయనాలు గాలిలో చేరిపోతున్నాయి. సిమెంటు కర్మాగారాలు, బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల వల్ల వాయుకాలుష్యస్థాయి పెరిగి అధిక ఉష్ణోగ్రతల నమోదుకు కారణమవుతున్నాయి. పుడమి తాపానికి మరోకారణం భూమి నుంచి 15 నుంచి 35 కిలోమీటర్ల ఎత్తులో ఆవరించి ఉన్న ఓజోన్ పొర క్షీణించడం. సూర్యుని నుంచి ఉద్గారమయ్యే అతి లోహిత కాంతి కిరణాలను శోషించుకొని భూతాప నియంత్రణకు దోహదపడుతున్న ఓజోన్ పొర పలచబడిపోవడం ఆందోళన కలిగించేదిగా ఉన్నదని శాస్త్ర ప్రపంచం భావిస్తోంది. పెద్దఎత్తున శీతలీకరణ యంత్రాల ఉపయోగం, క్లోరోఫ్లోరో కార్బన్‌ల (సీఎఫ్‌పీ)లు, బ్రోమోఫ్లోరో కార్బన్‌లు పెద్దమొత్తం లో విడుదల వల్ల ఓజోన్ క్షీణిస్తున్నది. దీనివలన భూమిపై వివిధ వైపరీత్యా లతో పాటు భూతాపం కూడా పెరుగు తున్నది.

పెరుగుతున్న భూతాపం ప్రతికూల వాతావరణ పరిస్థితికి దారితీస్తున్నది. ఈ వాతావరణ మార్పులు ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విధంగా ఉంటున్నాయి. కొన్ని ప్రాంతాల లో భారీవర్షాలు, తుపానులు, వరదలు సంభవిస్తుంటే, మరి కొన్ని ప్రదేశాల్లో కరవులు, వేడిగాలులు విలయ తాండవం చేస్తున్నాయి. 2018లో నైరుతీ రుతుపవనాల వల్ల దేశంలో సాధారణం కంటే అయిదు శాతం లోటు వర్షపాతం నమోదైంది. దీనికి భిన్నంగా ఈశాన్య భారతంలో, ఆ సరిహద్దు లకు ఆనుకొని ఉన్న దేశాల్లో వరదలు పోటెత్తాయి. భారత దేశంలో ఈ సంవత్సరంలో వైవిధ్యమైన వాతావరణ మార్పులు, సంఘటనలు చోటుచేసుకున్నాయి. కొద్దిరోజుల క్రితం వరకు కరవుతో అల్లాడిన మహారాష్ట్రలో భారీవర్షాలు కురిశాయి. ముంబై నగరంలో ముందెన్నడూ లేనివిధంగా వరదలు ముంచెత్తాయి. తూర్పు తీర ప్రాంతంలో తుపానులు బీభత్సాన్ని సృష్టించాయి. గంటకు 160 నుంచి 250 కి.మీ. వేగంతో వీచిన గాలులవల్ల కోస్తా ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ తదితర రాష్ట్రా లు 40 నుంచి 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో సతమతమయ్యాయి. నిత్యం కరవుతో సహజీవనం చేసే రాయలసీమ వాసులను వరుణుడు పలకరించిన పాపాన పోలేదు. అమెరికాలో ఏర్ప డుతున్న టోర్నడోలు, వేసవికాలంలో ఎడారి ప్రాంతాల్లో భీభత్సం సృష్టిస్తున్న ఇసుక తుపానులను గురించి అందరూ ఆలోచించాల్సిన తరుణం ఆసన్నమైంది. ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) అంచనా ప్రకారం భూతాపం వల్ల ఉత్పన్నమయ్యే వాతావరణ పరిస్థితులు సేద్యాన్ని అత్యంత ప్రభావితం చేస్తున్నాయి. కరవు కాటకాలతోపాటు, ఉష్ణోగ్రత వ్యత్యాసాలు వంటి వాటివల్ల వ్యవసాయానికి అపార నష్టం వాటిల్లుతోంది. భూతాపం వల్ల వ్యవసాయ రంగం ప్రభావిత మయ్యే దేశాల జాబితాలో భారత్ మొదటి స్థానంలో ఉందని ఇటీవల అధ్యయనాలు వెల్లడించాయి. భారత దేశ జనాభాలో అత్యధికశాతానికి వ్యవసాయమే జీవనోపాధి.

భూతాపం తగ్గేదెలా?
రేపటి సంచికలో..



\-డా॥ శెట్టెం ఆంజనేయులు
9490057161

# రైతులకు రెట్టింపు ఆదాయం సాధ్యమేనా?



భారత ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో నెలకొన్న మందగమనాన్ని అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం మోటారు వాహనాలు, చిన్న, సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తయారీ రంగం పుంజుకోవడానికి గిరాకీ, సరఫరాలను పెంచడానికి అనేక రాయితీలు ప్రోత్సాహకాలు, ఉపశమనాలు ప్రకటించడమే గాక బడా పారిశ్రామిక సంస్థల పన్ను రేట్లనూ తగ్గించింది. అయితే దేశ జనాభాలో సగం మందికి ఉపాధి కల్పించే సేద్యం - అనుబంధ రంగాలు కోలుకోవడానికి నరేంద్ర మోడీ నాయకత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఏ) ఇంతవరకు నిర్దిష్టమైన చర్యలేవీ చేపట్టలేదు. పర్యావరణ క్షీణత, వాతావరణంలో పెనుమార్పుల కారణంగా కొన్నిప్రాంతాల్లో అనావృష్టితో కరవు తాండవిస్తుండగా, చాలాచోట్ల అకాల, అధిక వర్షాల వల్ల పలు పంటలకు నష్టం వాటిల్లింది. భారత అన్నదాతల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేస్తామని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించి ఇప్పటికే మూడేళ్ళు గడిచాయి. అయితే కొన్ని పంటలకు కనీస మద్దతు ధరలు పెంచుతూ కేంద్రం ప్రకటించిందేగానీ మార్కెట్ మాయాజాలంలో గిట్టుబాటు ధరలు లభించక అన్నదాతలు అయినకాడికే అమ్ముకోవలసిన దుస్థితి తొలగలేదు, గోరుచుట్టుపై రోకటి పోటన్నట్లు పంటల సాగుకు వాడే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, శిలీంధ్ర కీటక నాశనులు, పొలాలను దున్నడానికి వాడే ట్రాక్టర్లు, ఇతర పరికరాల ధరలు, విపరీతంగా పెరిగి పంటలు వేయాలంటే అన్నదాతలు దడదడలాడే పరిస్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలిస్తామని పండిన పంటలను కొంటామని ఇచ్చిన హామీలను నమ్మి పప్పుధాన్యాలను ఇబ్బడి ముబ్బడిగా పండించి, దిగుమతులు అవసరం లేకుండా వేలకోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదాచేసి దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు చేకూర్చారు. అయితే అధికోత్పత్తి చేసిన రైతులకు కనీస మద్దతు ధరలు కూడా రాలేదు. కంది, శెనగ, పెసర, మినుముల వంటి కాయధాన్యాలు, నూనెగింజలు ముఖ్యంగా వేరుశెనగ ధరలు మూడేళ్ళ క్రితం నాటికంటే 15 నుండి 30 శాతం తగ్గడం రైతులకు లాభసాటిగా లేకపోవడమే గాక శ్రమ నిష్ఫలమై అప్పుల పాలు కావలసి వస్తోంది. సాగు ఖర్చుపై 50 శాతం లాభం వచ్చేలా వివిధ పంటల కనీస మద్దతు ధరలు పెంచుతున్నట్లు గత ఏడాది ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రభుత్వాల మాటలకు చేతలకు పొంతన లేనందున వరి, రాగి, సజ్జ, పెసర, మినప, కంది, వేరుశెనగ, సోయాబీన్, ఆవ పంటలను రైతులు కనీస మద్దతు కంటే తక్కువ ధరలకే అమ్ముకోవలసి వస్తోంది. ఎకరానికి పంట దిగుబడులు, ఉత్పాదకత పెరగకపోవడం, కనీస మద్దతు ధరలు రాకపోవడం, కూలీల రేట్లు పెరిగిపోవడంతో పంటసాగువైపు రైతులు ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితులలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కీటక నాశనుల ఉత్పత్తి ఖర్చు తగ్గించి వాటిని సరసమైన ధరలకు అన్నదాతలకు అందుబాటులోకి తేవడం, ట్రాక్టర్లు పిడి యంత్రాలపై సుంకాలు, పన్నులు తగ్గించి యాంత్రీకరణను పెంచడం, తక్కువ వడ్డీకి పంట రుణాలివ్వడం, మెరుగైన మార్కెట్ సౌకర్యాలు, గిట్టుబాటు ధరల కల్పనకు నరేంద్రమోడీ ప్రభుత్వం వివిధ రాష్ట్రాలు తమవంతు చర్యలు నిర్దిష్టంగా చేపడితేనే వచ్చే మూడేళ్ళలో రైతుల ఆదాయం రెట్టింపయ్యేది. లేదంటే అది అందని కలగానే మిగిలిపోతుందని పాలకులు గ్రహించాలి.



\-పతకమూరు దామోదర్ ప్రసాద్
9440990381

## గాంధీ.. ఓ మంగళ గీతం

కవిత

గాంధీ ఓ మామూలు పేరు కాదు
మానవాళి బ్రతకాల్సిన తీరు!
మానవాళి పాలిట వెలుగుల బంగరు తేరు!!
గాంధీ ఓ సంకల్పం గాంధీ ఓ సత్యవ్రతం
గాంధీ ఓ విధం గాంధీ ఓ పథం
సర్వం సర్వస్వం అందించే ఓ విధానం!
గాంధీ ఓ మార్గం గాంధీ ఓ లక్ష్యం
గాంధీ ఓ దీక్ష గాంధీ మానవాళికి పెద్దరక్ష
గాంధీ ఓ తత్త్వం! గాంధీ ఓ తాత్త్వికత!
గాంధీ సత్యం గాంధీ నిత్యం
గాంధీ అవసరమయ్యే నిత్యకృత్యం.
గాంధీ ప్రభావం గాంధీ ఓ సుప్రభాతం
గాంధీ ఓ పరిణామం! గాంధీ ఓ ప్రమాణం!!
గాంధీ సమత గాంధీ మమత
గాంధీ సమతా మమతల కలబోత.
గాంధీ మానవత్వం గాంధీ పూర్ణత్వం
గాంధీ వెలుతురు పిట్ట
గాంధీ ఓ వెలుగుల గుట్ట
గాంధీ ఉషోదయం గాంధీ నవోదయం
గాంధీ ముమ్మూర్తులా మహోదయం
గాంధీ ఓ మంగళగీతం!
గాంధీ ఓ భగవద్గీతా శ్లోకం!!

\-రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669



# జమ్ముకు మోడీ నవరాత్రి బహుమతి

**• ఢిల్లీ నుంచి కత్రాకు వందేభారత్ రైలు సేవలు • వైష్ణోదేవి భక్తులు, యాత్రికులకు ప్రత్యేకరైలు సదుపాయం • జమ్ము అభివృద్ధికి తొలి అంకమన్న మోడీ • రేపటి నుంచి అన్ని రోజుల్లో రైలు సేవలు**

**న్యూఢిల్లీ:** వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలు జమ్ము ప్రజలకు నవరాత్రి కానుకగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివర్ణించారు. జమ్ములోని వైష్ణోదేవి ఆలయాన్ని సందర్శించే భక్తులు, యాత్రికులకు ప్రయాణ సౌకర్యం కోసం వందే భారత్‌రైలు ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. ఢిల్లీ నుంచి కత్రా వెళ్లే వందే భారత్‌రైలు కేంద్ర హోంమంత్రి అమిత్ షా న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలు ప్రారంభం కావడం మాతా వైష్ణో దేవిని దర్శించుకునేందుకు వెళ్లే యాత్రికులకు శుభవార్తగా పేర్కొన్నారు. జమ్ము ప్రజలకు, మాతా వైష్ణోదేవి భక్తులకు ఇది నవరాత్రి బహుమతి. ఈ రైలు ద్వారా జమ్ముకు ఢిల్లీతో కనెక్టివిటీ పెరిగి అభివృద్ధికి దోహదపడుతుందని ట్వీట్ చేశారు.

### పదేళ్లలో అభివృద్ధి చెందిన రాష్ట్రాల సరసన కాశ్మీర్

2029 నాటికి కాశ్మీర్ రూపురేఖలే మార్చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. కాశ్మీర్ అభివృద్ధికి ఎదురౌతున్న ఆటంకాలన్నింటినీ ఒక్కొక్కటిగా తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేస్తోందని తెలిపారు. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్ము కాశ్మీర్ కూడా దేశంలోని అభివృద్ధి చెందిన రాష్ట్రాల సరసనల చేరేలా ముందుకుసాగుతోందని చెప్పారు. ఢిల్లీలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును జెండా ఊపి ప్రారంభించిన అమిత్ షా.. న్యూఢిల్లీ నుంచి జమ్ములోని కత్రా వరకు సేవలందించిన ఈ రైలు ఆరంభమే అభివృద్ధికి తొలి అడుగు అని అభివర్ణించారు. వందే భారత్ ద్వారా కాశ్మీర్ చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభమైందన్నారు. మాతా వైష్ణో దేవి ఆలయాన్ని సందర్శించాలంటే గతంలో ఎన్నో వ్యయ,ప్రయాసలు ఎదరయ్యేవని.. వందే భారత్‌రెలు ప్రారంభంతో యాత్రికుల కష్టాలకు చెక్‌పడిందన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న సురాజ్యం దిశగా మోడీ ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోందన్న షా... స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన వందేభారత్ సేవలు జమ్ముకు కూడా ప్రారంభం కావడం మహాత్ముడి కలలను నిజం చేసేలా ఉందని చెప్పారు. ప్రస్తుతం రైలులో ఢిల్లీ నుంచి కత్రా వెళ్లాలంటే 12 గంటల సమయం పడుతుండగా.. వందే భారత్ ప్రారంభంతో ప్రయాణ సమయం 8 గంటలకు తగ్గిందని తెలిపారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని కూకటివేళ్ల పెకిలించడమే కాకుండా ఉగ్రవాద భావజాలం కలిగిన వారికి బుద్ధివచ్చేలా ఆర్టికల్ 370 ని రద్దు చేసినట్లు వివరించారు.

### ఇవీ ప్రత్యేకతలు

వందే భారత్ రైలును ప్రారంభంలో ట్రైన్ 18గా పిలిచారు. ఢిల్లీ నుంచి కత్రాకు వందేభారత్ రైలు సేవలు ఈనెల 5 నుంచి ప్రారంభవౌతాయి. వారంలో అన్ని రోజులు రైలు సేవలు అందుబాటులో ఉంటాయి. న్యూఢిల్లీ నుంచి ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే రైలు మధ్యాహ్నం 2 గంటల వరకు కత్రా చేరుకుంటుంది. కత్రా నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి రాత్రి 11 గంటలకు ఢిల్లీ చేరుకుంటుంది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ రైలు గంటకు 160 కి.మీ వేగంతో ప్రయాణించగలదు. దేశంలోనే అత్యధిక వేగంతో పరుగెత్తే రైలుగా పేరుంది. ఢిల్లీ నుంచి జమ్ములోని కత్రాకు వెళ్లనున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో సౌకర్యవంతమైన ఇంటీరియర్‌తో పాటు వైఫై, బయో వ్యాక్యూమ్ టాయ్‌లెట్స్, జీపీఎస్ ఆధారిత సమాచార వ్యవస్థ, సీసీటీవీ సేవలు ఉన్నాయి. దేశంలో ఇది రెండో వందేభారత్ రైలు. తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ఢిల్లీ నుంచి వారణాసి మధ్య కొనసాగుతున్నాయి. ఈ రైలును ప్రధాని మోడీ ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించారు.

# ఆస్తుల విక్రయమే శరణ్యం!

**గత ఆరేళ్లలో దేశం ఎన్నడూ చూడని తీవ్ర మందగమనాన్ని అధిగమించి... ఆర్థిక వ్యవస్థకు పురోభివృద్ధి జీవం పోయాలంటే అప్పులు చేయకుండానే అధిక వ్యయానికి ప్రాధాన్యత ఇవ్వాలి... 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని దరిచేరాలంటే భారీగా నిధులు కావాలి... ఊహించని ఆర్థికమాంద్యం నేపథ్యంలో స్థూలంగా ఇదీ సర్కార్ పరిస్థితి. అసలే భారీ ఉద్దీపనలతో ఆదాయం క్షీణించింది. ఆదాయం అత్యయికమైన ఈ పరిస్థితుల్లో ప్రభుత్వరంగ ఆస్తులనే సర్కార్ నమ్ముకుంది. భారీగా ఆస్తుల విక్రయానికి సిద్ధమైంది. రంగాలవారీగా ఆస్తుల విక్రయం ద్వారా రూ.90 వేల కోట్లకుపైగా .. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.1.05 లక్షల కోట్ల ఆదాయం పొందాలని ప్రభుత్వం యోచిస్తోంది ఈమేరకు ఆస్తుల జాబితాను నీతి ఆయోగ్ సిద్ధం చేసింది. కేబినెట్ ఆమోదమే తరువాయి.**

**• ఆర్థిక పునరుజ్జీవనకు ప్రభుత్వ రంగ ఆస్తుల అమ్మకమే ఏకైక మార్గం • అప్పు చేయకుండానే వ్యయం లక్ష్యం • ఆర్థికమాంద్యం నేపథ్యంలో సర్కార్ నిధులవేట • ఆస్తుల జాబితా సిద్ధం చేసిన నీతిఆయోగ్ • త్వరలోనే కేబినెట్ ఆమోదం! • విక్రయం ద్వారా రూ.90 వేల కోట్ల సేకరణ • వాటాల ఉపసంహరణతో రూ.1.05 లక్షల కోట్ల ఆదాయం లక్ష్యం • తదుపరి జాబితాలో స్పోర్ట్స్ స్టేడియాలు, గెస్ట్‌హౌస్, గోల్ఫ్‌కోర్స్‌లు!**

**న్యూఢిల్లీ:** దేశాన్ని తీవ్ర ఆర్థికమాంద్యం ఆవహించింది. వ్యయాల విషయంలో ప్రభుత్వాలు సైతం ఆందోళనలు చేసే స్థాయిలో మాంద్యం ప్రభావం ఉంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే అధిక స్థాయిలో వ్యయం చేయడమే ప్రభుత్వం ముందున్న ఏకైక మార్గం. బడ్జెట్‌లో పేర్కొనని విధంగా భారీగా ఉద్దీపనలు ప్రకటించి లక్షల కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోయిన ప్రభుత్వం అప్పులు చేసేందుకు సిద్ధంగా లేదు. ప్రత్యమ్నాయంగా ప్రభుత్వరంగ ఆస్తుల విక్రయం ద్వారా నిధులను సమకూర్చుకోవాలని యోచిస్తోంది. ఈ మేరకు ప్రణాళికలు, ప్రతిపాదనలను నీతి ఆయోగ్ సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనలకు త్వరలోనే కేబినెట్ ఆమోదం కూడా లభించే అవకాశాలున్నాయి. గుర్తించిన ఆస్తుల అమ్మకం ద్వారా రూ.90 వేల కోట్లకు పైగా నిధులను సేకరించాలని భావిస్తున్న ఇందుకోసం సమగ్రమైన ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈమేరకు రంగాల వారీగా ఆస్తులను ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. విమానయానరంగంలో రూ.15 వేల కోట్లు, శక్తిరంగంలో రూ.20 వేల కోట్లు, షిప్పింగ్ రంగంలో రూ.7,500 కోట్లు, నేషనల్ హైవేస్‌లో రూ.25 వేల కోట్లు, రైల్వేలో రూ.22 వేల కోట్ల ఆస్తులను విక్రయించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. మరోవైపు పలు సంస్థల్లో ప్రభుత్వ వాటాల ఉపసంహరణ ద్వారా రూ.1.05 లక్షల కోట్ల నిధులను సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. ఆర్థిక మాంద్యం నుంచి ఎలాగైనా బయటపడాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న ప్రభుత్వం వరుసగా భారీ ఉద్దీపనలు ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. కార్పొరేట్ పన్నులో భారీ కోత విధిస్తూ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ఒకే ఒక్క నిర్ణయం ప్రభుత్వానికి రూ. 1.45 లక్షల లక్షల కోట్ల ఆదాయాన్ని దూరం చేసింది.

### విక్రయ ప్రణాళికలు సిద్ధం

ఆర్థిక మాంద్యం నుంచి బయటపడేందుకు భారీ ఉద్దీపనలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం భారీగా ఆదాయాన్ని కోల్పోనుంది. కోల్పోయిన ఈ ఆదాయాన్ని అప్పులు చేయకుండా తిరిగి పొందాలంటే ప్రభుత్వం ముందున్న ఏకైక మార్గం ఆస్తుల అమ్మకమే. నీతి ఆయోగ్ ప్రతిపాదనలకు త్వరలోనే కేంద్ర కేబినెట్ ఆమోదం లభించనుందని ఓ అధికారి వివరించారు. నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ సారధ్యంలోని కమిటీ ఈ మేరకు ఇప్పటికే అన్నీ మంత్రిత్వశాఖలతో పలు దఫాల చర్చించింది. నిర్దిష్ట గడువులోగా ఆస్తుల అమ్మకానికి సంబంధించి బిడ్లను ఆహ్వానించాలని ఖచ్చితమైన కాలపరిమితిని విధించింది. ఈ మొత్తం ప్రణాళికను కేబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా పర్యవేక్షిస్తున్నారు. కార్యకలాపాల సామర్థ్యాన్ని పొందేందుకు ఆస్తుల విక్రయం విషయంలో ప్రభుత్వం ధైర్యంగా ముందుకు వెళ్తోందని ఈ వ్యవహారంతో సంబంధమున్న ఓ అధికారి వెల్లడించారు. భారీ సంఖ్యలో ప్రభుత్వ ఆస్తులను విక్రయించాలని యోచిస్తున్న నేపథ్యంలో ఆస్తులను గుర్తించేందుకు అన్నీ మంత్రిత్వశాఖలతో నీతి ఆయోగ్ సన్నిహితంగా పనిచేస్తోంది. మంత్రిత్వశాఖలకు అప్పగించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు



పర్యవేక్షించేందుకు నీతి ఆయోగ్ ఒక డ్యాష్‌బోర్డ్‌ను కూడా ఏర్పాటు చేసిందని ఓ అధికారి వివరించారు.

ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో నిధుల ఉపసంహరణ ద్వారా కూడా వీలైనన్ని నిధులు సమకూర్చుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. బీపీసీఎల్, కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, టీహెచ్‌డీసీ ఇండియా లిమిటెడ్, నీప్కో( నార్త్ ఈస్ట్రన్ ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్) వంటి సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఆయా కంపెనీల్లో ఆస్తుల అమ్మకాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సిన అంశాలను ఇప్పటికే కార్యదర్శుల బృందం ప్రభుత్వానికి వివరించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా మొత్తం రూ.1.05 లక్షల కోట్లు సేకరించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆస్తుల అమ్మకం ద్వారా 2018 ఆర్థిక సంవత్సరంలో రూ.1 లక్ష కోట్లు, 2019 ఆర్థిక సంవత్సరంలో రూ.80 వేల కోట్ల నిధుల సేకరణ లక్ష్యంగా నిర్దేశించుకున్న ప్రభుత్వం ఆ పరిమితిని ఈ ఆర్థిక సంవత్సరంలో పెంచింది.

### త్వరలోనే ఎయిరిండియా విక్రయం

అప్పుల ఊబిలో చిక్కుకుని సతమతమవుతున్న ఎయిరిండియా విక్రయానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఎయిరిండియా కొనుగోలు ఆసక్తి( ఎక్స్‌ప్రెసెన్ ఆఫ్ ఇంటరెస్ట్) పత్రాలు త్వరలోనే ఖరారు కానున్నాయి. ఈ మేరకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఈ వ్యవహారంతో సంబంధమున్న ఇద్దరు ప్రభుత్వాధికారులు ఈ అంశంపై స్పందించారు. ఎయిరిండియా ప్రభుత్వ వాటా విక్రయ ప్రక్రియను వేగవంతం చేస్తామని వారు వివరించారు. ఎయిరిండియాకు మొత్తం రూ.30 వేల కోట్ల అప్పులున్నాయి. అయితే ఏవిధంగా పెట్టుబడులు పెట్టాలనే విషయాలను విషయాలను పెట్టుబడిదారులకు సవివరంగా వెల్లడించనున్నామని అధికారులు తెలిపారు.

### వ్యయమే ఏకైక మార్గం

గత ఆరేళ్లలో దేశం చూడని తీవ్ర ఆర్థికమాంద్యం నుంచి బయటపడాలంటే ఒకే ఒక్క మార్గం ఉంది. ప్రభుత్వ వ్యయం పెరిగితే ఆర్థిక వ్యవస్థకు జీవం పోసినట్టే. అయితే ప్రభుత్వం తన వ్యక్తిగత వ్యయాలను తగ్గించుకోవాలి. అన్నీ విభాగాలు తమ కార్యకలాపాల వ్యయాల్లో 5-10 శాతం వరకూ కోత విధించుకోవాల్సి ఉంటుంది. ప్రజల చేతుల్లోకి అధికం ధనం చేరాలి. మౌలికరంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెరగాలి. హైవేలు, పోర్ట్‌లు, క్యాపిటల్స్, రక్షణ ఆయుధాలు, విద్య వంటి రంగాల్లో అధికంగా వ్యయం చేయాలి. వ్యాపార అనుకూల వాతావరణాన్ని సృష్టించాలి. వృద్ధికి ఊతమిచ్చే అన్నీ చర్యలూ తీసుకోవాలి. ఎక్కడో విదేశాల నుంచి వచ్చే కంపెనీల కోసం గ్లోబల్ ఎకనామిక్ జోన్ వంటి విధానాలు అంత శ్రేయస్కరం కాదు. ఆయా కంపెనీలు మళ్లీ వేరే చోటుకు తరలివెళ్లే అవకాశాలు కూడా ఉన్నాయి. దీనికంటే దేశంలో పెట్టుబడులు పెట్టి కొత్త స్మార్ట్ నగరాల నిర్మాణం చేపడడం అత్యుత్తమం. తద్వారా రియల్ రంగం వృద్ధి జోరందుకుంటుంది.

లక్షలాది కొత్త ఉద్యోగాల సృష్టి జరిగే అవకాశం జరుగుతుంది. మరోవైపు వినియోగదారుడి వ్యయం, పెట్టుబడులు, ప్రభుత్వం వ్యయం, నికర ఎగుమతులను పరిగణిస్తే వచ్చేదే ఆర్థిక వ్యవస్థ ఫలితం. ఆర్థిక వ్యవస్థ తిరిగి వృద్ధి బాట పట్టాలంటే పైన పేర్కొన్న నాలుగు అంశాలు ఆవశ్యకం. వడ్డీరేట్లు, సెన్సెక్స్ స్థాయిల గురించి చర్చించడం కంటే వినియోగదారుల వ్యయం ఏ విధంగా పెంచాలి. సంస్థల ఎగుమతులు పెరగాలి. మరోవైపు ప్రభుత్వానికి మరింత కఠినమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అప్పులు చేయకుండా, పన్నులు విధించకుండా లేదా కరెన్సీని ఎక్కువగా ముద్రించకుండా ప్రభుత్వం వ్యయాలు చేయాలనే ఆర్థిక విశ్లేషకులు సూచిస్తున్నారు.

### విక్రయ జాబితాలో ఉన్న ఆస్తులు ఇవే..

విమానయానరంగంలో ట్రిచీ, ఇండోర్, భువనేశ్వర్, వారణాసి, అమృత్‌సర్, రాయ్‌పూర్ మొత్తం ఆరు ఎయిర్‌పోర్ట్‌లను నీతి ఆయోగ్ గుర్తించింది. ఈ ఎయిర్‌పోర్ట్‌ల అమ్మకం ద్వారా రూ.15 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ విద్యుత్ సరఫరా లైన్ల బదిలీ ద్వారా రెండు పర్యాయాల్లో అమ్మకం ద్వారా రూ.10 వేల కోట్ల ఆదాయాన్ని పొందాలని ప్రభుత్వ యోచన. రైల్వేల విషయంలో మూడు దశల్లో మొత్తం 150 రైళ్లను ప్రైవేటు వ్యక్తుల చేత నడిపించాలని నీతి ఆయోగ్ ప్రతిపాదించింది. ఒక్కో దశలో 50 రైళ్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని పేర్కొంది. దీని మొత్తం రూ.22 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని నీతి ఆయోగ్ అంచనావేసింది. మొత్తం 11 షిప్పింగ్ ఆస్తులను నీతి ఆయోగ్ గుర్తించింది. ఇందులో పోర్ట్ ట్రస్టులు నిర్వహిస్తున్న బెర్త్‌లు కూడా ఉన్నాయి. వీటి అమ్మకం ద్వారా ప్రభుత్వానికి రూ.7,500 కోట్ల ఆదాయం సమకూరనుంది. వీటితోపాటు దేశంలోని 25 వేల కిలోమీటర్ల పొడవైన రహదార్ల ద్వారా వచ్చే మూడేళ్లలో భారీగా ఆదాయాన్ని కూడబెట్టాలని నీతి ఆయోగ్ ప్రతిపాదించింది. మొదటగా రూ.5 వేల కోట్లు ఆ తర్వాత మొత్తం పది దశల్లో ఆస్తులు కూడబెట్టాలని నిర్ణయించింది. హైవేల ద్వారా సంచితం ఆదాయం రూ.25 వేల కోట్లు పొందాలని ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇదిలావుండగా బీపీసీఎల్‌లో 53.3 శాతం, బీఈఎంఎల్‌లో 54 శాతం, కాన్‌కోర్‌లో 54.8 శాతం, ఎస్‌సీఐలో 73.75 శాతం వాటాలు ప్రభుత్వానివిగా ఉన్నాయి.

# పాక్ గురుద్వారాను సందర్శించనున్న మన్మోహన్



**న్యూఢిల్లీ:** సిక్కు మత ప్రబోధకుడు గురునానక్ జయంతి సందర్భంగా వచ్చే నెలలో పాకిస్థాన్ లోని కర్తార్ పూర్ సాహిబ్ గురుద్వారాను మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సందర్శించనున్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ ఆహ్వానం మేరకు మన్మోహన్ పాక్‌లోని గురుద్వారను సందర్శించనున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్రమోడీ కూడా పంజాబ్ ప్రభుత్వ ఆహ్వానాన్ని మన్నించి కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవ వేడుకలకు పంజాబ్ వెళ్లనున్నారు. మన్మోహన్ వ్యక్తిగతంగా కలిసి ఆహ్వానం పలికిన అమరీందర్ సింగ్ పాకిస్థాన్‌లో సిక్కులు నిర్వహించే ఆల్ పార్టీ జథ ( ఆయుధాలు కలిగిన సిక్కులు నిర్వహించే మార్చ్) కు హాజరు కావాలని కోరారు. అమరీందర్ ఆహ్వానాన్ని మన్నించిన మన్మోహన్ అందుకు సుముఖత వ్యక్తం చేశారు. సిక్కు గురువు గురు నానక్ 550 జయంతి సందర్భంగా సుల్తాన్ పూర్ లోధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నంకానా సాహిబ్‌ను పాకిస్థాన్ నుంచి ఆహ్వానించేందుకు అవసరమైన ఫార్మల్ క్లియరెన్స్‌ను ఇవ్వాల్సిందిగా విదేశాంగ మంత్రి జైశంకర్‌కు అమరీందర్ సింగ్ లేఖ రాశారు. గురునానక్ జయంతి సందర్భంగా నవంబర్ 5 నుంచి 15 వ తేదీ వరకు పంజాబ్ ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈనేపథ్యంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్,ప్రధాని మోడీ సహా పలువురు ప్రముఖులకు ఆహ్వానాలు పంపారు.

# కాశ్మీర్ నేతలకు త్వరలో విముక్తి



**న్యూఢిల్లీ:** కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుకు ముందు రోజు నుంచి గృహనిర్బంధంలో ఉన్న నాయకులకు త్వరలోనే విముక్తి కలుగుతుందని జమ్ము కాశ్మర్ గవర్నర్ సలహాదారు ఫరూక్ ఖాన్ తెలిపారు. వ్యక్తిగతంగా వ్యవహారశైలిని విశ్లేషించిన తర్వాత ఒక్కొక్కరిని విడుదల చేయవచ్చన్నారు. జమ్ము కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ఫరూక్ అబ్దుల్లా,ఓమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ సహా వివిధ రాజకీయ పార్టీల నాయకులు దాదాపు రెండు నెలలుగా గృహ నిర్బంధంలో ఉన్నారు. ప్రజా భద్రతకు హాని కలిగించవచ్చని వారిని గృహ నిర్బంధంలో ఉంచారు. జమ్ములో పరిస్థితులు మెరుగుపడటంతో ఆప్రాంత నాయకులను బుధవారం గృహ నిర్బంధం నుంచి విడుదల చేశారు. కాశ్మీర్‌లో ఇంకా అక్కడక్కడ చెదురు మొదురు హింసాత్మక ఘటనలు, ఏర్పాటువాదుల అలజడి కారణంగా ఆ ప్రాంత నాయకులను గృహ నిర్బంధం లోనే ఉంచారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్నట్లు ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించగా.. బుధవారం జమ్ము నేతలను విడుదల చేయడం గమనార్హం. జమ్ము కాశ్మీర్‌లో 310 బ్లాక్‌డెవలప్‌మెంట్‌కౌన్సిల్ చైర్మన్ల నియామకానికి ఈనెల 24న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

### గత తప్పిదాలు సరిదిద్దేందుకే 370 రద్దు

జమ్ము కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్370 రద్దు ఆమోదించదగినదే ప్రముఖ న్యాయవాది హరీష్‌సాల్వే అభిప్రాయపడ్డారు. జమ్ము కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 పెట్టడమే గత పాలకులు చేసిన తప్పని అన్నారు. మోడీ ప్రభుత్వం గత తప్పిదాలను సరిదిద్దుతోందని పేర్కొన్నారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ కూడా భారత్‌లో భాగమేనని.. ఇప్పటికే దివాలా తీసిన పాకిస్థాన్‌కు ఆ ప్రాంతాన్ని మోసే భారం కూడా లేదని అన్నారు. పాకిస్థాన్ పీవోకే ప్రజలు గొంతునొక్కు తోందన్న సాల్వే... భారత్- పాక్ మధ్య ఏదేనా వివాదాస్పద ప్రాంతం ఉందా అంటే అది పాక్‌ఆక్రమిత కాశ్మీరేనని అభిప్రాయపడ్డారు. కాశ్మీర్‌భారత్‌లోని భాగమేనని జమ్ము కాశ్మీర్ రాజ్యాంగం లోనే ఉందని..ఈ విషయం సెంట్రల్ పాకిస్థానీలకు కూడా తెలుసని అన్నారు. ఆర్టికల్ 370 రద్దుకు ఓటేసే సుధీర్ఘ ఓటరును తానే అని హరీష్‌సాల్వే అభిప్రాయపడ్డారు. కొన్ని సార్లు కాశ్మీర్ విషయంలో వీడని సందేహాలెన్నో ఉన్న మోడీ ప్రభుత్వం వాటిని తీరుస్తోందని పేర్కొన్నారు. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 వల్ల మిలిటెంట్లకు అనుకూల వాతావరణం ఉండేదని.. మోడీ ప్రభుత్వం వారి కోరలు విరిచేసినట్లు ఆర్టికల్‌ను రద్దు చేసిందన్నారు.

# హోదా నాటకం ఇకనైనా ఆపాలి

**ఢిల్లీలో బీజేపీ ఏపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ**



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** ప్రత్యేక హోదాపై రాజకీయాలు చేయడం ఇకనైనా మానేయాలని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి సూచించారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాతజమ్ము కాశ్మీర్ రాష్ట్రమే స్వయం ప్రతిపత్తిని కోల్పోయిన విషయం గుర్తుపెట్టుకోవాలని, దేశంలో ఇప్పుడు ఒకే రాజ్యాంగం, ఒకే చట్టం, ఒకే విధానం అమలవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని వివిధ పార్టీలకు చెందిన నేతలు బీజేపీలో చేరిన సందర్భంగా ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాంకేతికంగా ప్రత్యేక హోదా సాధ్యం కాదన్న విషయం ముఖ్యమంత్రి జగన్‌కుసైతం తెలుసునని, దానిపై ఇంతకాలం చేసిన రాజకీయాలు ఇక ముగించాలని అన్నారు. ఇన్నాళ్లూ ప్రత్యేక హోదా పేరుతో ప్రజల్ని మభ్యపెట్టింది చాలని, ఇకపై కూడా మభ్యపెట్టడం తగదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సాయం చేస్తూనే ఉందని ఆయన గుర్తుచేశారు. ఎన్డీయే నుంచి తెలుగుదేశం పార్టీ బయటకు వెళ్లిపోయిన తర్వాత కూడా ఈ సహాయం ఆగలేదని, రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా సరే అది కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి దేశ ప్రధాన మంత్రిని కలవడంలో తప్పేమీ లేదని, తాము స్వాగతిస్తామని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన నిధులు, ప్రాజెక్టుల విషయంలో కేంద్రం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.

# ఉగ్రదాడులపై నిఘావర్గాల హెచ్చరిక

## విమానాశ్రయాల్లో భద్రత కట్టుదిట్టం



**న్యూఢిల్లీ:** ఉగ్రవాదుల దాడికి సంబంధించి నిఘావర్గాల సమాచారంపై అన్ని విమానాశ్రయాలతోపాటు దేశ రాజధాని అంతటా భద్రత కట్టుదిట్టం చేశామని పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రసంస్థ జైషే మహమ్మద్ సభ్యులు నలుగురు నగరంలోకి చొరబడి ఉండవచ్చని ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు ఢిల్లీ పోలీసులు పలుచోట్ల దాడులు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాలకు హెచ్చరికలు జారీ చేశారు. దుర్గాపూజ, రామ్‌లీలా కోసం నగరం సన్నద్ధమవుతున్న తరుణంలో ఢిల్లీ పోలీసులు దేశరాజధానిలో పెట్రోలింగ్ మరియు పికెటింగ్ ముమ్మరం చేశారు.దేశంలో అశాంతిని రేకెత్తించేందుకు పాకిస్థాన్ పన్నిన కుట్రలో భాగంగా సుమారు 450నుంచి 500మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ల్యాంచ్ పాడ్లవద్ద వేచి ఉన్నారని గత నెలలోనే సైనిక వర్గాలు తెలిపాయి. భారత్‌లోకి చొరబడటానికి వేచి ఉన్న కొంత మంది ఉగ్రవాదులకు బాలాకోట్ లోని జైషే మహమ్మద్ శిబిరంలో శిక్షణ ఇచ్చారని నిఘావర్గాలు తెలిపాయి. దక్షిణ భారతంలో ఉగ్రవాద దాడికి అవకాశం ఉందని సైనికవర్గాలు కూడా హెచ్చరించాయి.ఈ మేరకు తమకు సమాచారం ఉందని, సర్ క్రీక్ నుంచి కొన్ని పడవలు స్వాధీనం చేసుకున్నట్టు ఆర్మీసదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఎస్‌కే షైనీ తెలిపారు. ఉగ్రదాడులను ఎదుర్కొనేందుకు తగిన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని షైనీ తెలిపారు. ఆగస్టులో లష్కరే తోయిబా ఉగ్రవాదులు చొరబడ్డారనే సమాచారం అందడంతో తమిళనాడు అంతటా భద్రత కట్టుదిట్టం చేశారు. ఆరుగురు ఉగ్రవాదులు శ్రీలంక నుంచి తమిళనాడులోకి చొరబడి కోయంబత్తూర్‌తోసహా పలు నగరాలకు వెళ్లినట్టు అనుమానిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# 'అట్రాసిటీ చట్టంలోని నిబంధనలను నీరుగార్చలేం'



**న్యూఢిల్లీ:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని కఠిన నిబంధనలను నీరుగార్చే ప్రసక్తే లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. గతేడాది సుప్రీంకోర్టు బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై విచారణ జరిపిన జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఎస్సీ, ఎస్టీలపై జరిగే అకృత్యాల నివారణకు చట్టంలో కఠిన నిబంధనలు ఉండాల్సిందేనని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం కింద ఫిర్యాదు అందినవెంటనే సదరు వ్యక్తిని అరెస్టు చేయకుండా..ముందుగా విచారణ తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని గతేడాది సుప్రీం కోర్టు ఆదేశించింది. కొన్ని కొన్ని సందర్భాల్లో ముందస్తు బెయిల్ కూడా ఇవ్వొచ్చని పేర్కొంది. దీంతో కోర్టు తీర్పునకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం చట్టంలో పలు సవరణలు చేసింది. ఈ నిబంధనలను వ్యతిరేకిస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో విచారణ జరిపిన ధర్మాసనం.. గతంలో ఎస్సీ, ఎస్టీల భద్రతకు అమలు చేసిన నిబంధనలను తిరిగి అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఫిర్యాదు నమోదైనప్పుడు పోలీసులు సదరు వ్యక్తిపై ఏవైనా చర్యలు తీసుకునే ముందు ప్రాథమిక విచారణ జరపాలని సూచించింది. ఒకవేళ ఫిర్యాదు తప్పుది, అనైతికమైనదని అనుమానం వస్తేనే ఈ చర్య చేపట్టాలని తెలిపింది.

# ఢిల్లీలో సురక్షితం కాని తాగునీరు

**• కేంద్ర మంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్**

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని, రాష్ట్ర రాజధానులతోపాటు 100స్మార్ట్ సిటీలలో ప్రారంభమయ్యే పంపు నీటి కోసం బీఐఎస్ నాణ్యత ప్రమాణాన్ని తప్పనిసరి చేయాలని కేంద్రం భావిస్తోంది. త్వరలో సంప్రదింపుల ప్రక్రియ ప్రారంభిస్తామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ గురువారం తెలిపారు. దేశ రాజధానిలోని 11ప్రాంతాలనుంచి యాదృచ్ఛికంగా సేకరించిన పంపునీటి నమూనాల ప్రాథమిక దర్యాప్తులో నీరు బీఐఎస్ ప్రమాణాలు అనుగుణంగా లేదని పాశ్వాన్ తెలిపారు. ఢిల్లీలో తాగునీరు సురక్షితం కాదని తేలిందన్నారు. దేశ రాజధానిలో సరఫరా చేసిన నీటి ప్రాథమిక నివేదికను పరిశీలించిన తరువాత తాగునీటికి బీఐఎస్ ప్రమాణాలను తప్పనిసరి చేయాలని భావిస్తున్నామని కేంద్ర మంత్రి పాశ్వాన్ విలేఖరులకు తెలిపారు. ఇప్పటికే బీఐఎస్ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే నీటి నమూనాలను సేకరించి పరీక్షించడానికి బీఐఎస్ బృందాలను రాష్ట్ర రాజధానులకు పంపినట్టు ఆయన తెలిపారు. ఈ ప్రక్రియకు ఒక నెల సమయం పడుతుందని, నవంబర్ మొదటివారం నాటికి నివేదిక అందే అవకాశం ఉందన్నారు. ఏ రాష్ట్ర రాజధాని సురక్షితమైన తాగునీటిని సరఫరా చేస్తుందో తమకు తెలుస్తుందని తద్వారా ర్యాంకింగ్ ఇవ్వనున్నామని కేంద్ర మంత్రి వెల్లడించారు.

Andhraprabha business 2019

బిజినెస్

BUSINESS

# మరిన్ని సంస్కరణలు

- వృద్ధిరేటుకు ఊతం
- నీతి ఆయోగ్ చీఫ్ అమితాబ్‌కాంత్



అమితాబ్‌కాంత్

**న్యూఢిల్లీ :** కేంద్రప్రభుత్వం ప్రస్తుతం కొనసాగిస్తున్న ఆర్థిక సంస్కరణల జోరు అదే విధంగా కొనసాగిస్తుందని నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ గురువారం ఇక్కడ అన్నారు. ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టడానికి ప్రభుత్వం మరిన్ని సంస్కరణలను ప్రకటించబోతోందన్నారు. ఉత్పత్తి, మెరుగైన పనితీరుకు సంబంధించిన అంశాలపై దృష్టిపెడుతుందన్నారు. 2005 నుంచి ఇప్పటి వరకు సుమారు 300 మిలియన్ ప్రజలను పేదరికం నుంచి వెలికి తీశామని.. గత ఐదు సంవత్సరాల నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ లేదా జీడీపీ 7.5 శాతం సాధిస్తూ వస్తోందన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో జడీపీ వృద్ధిరేటు 8.1 శాతంగా నమోదు కాగా.. 2019-20 జూన్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు 5 శాతానికి పడిపోయిందని ఆయన ప్రపంచ ఆర్థిక సదస్సులో ఇండి యన్ ఎకనమిక్ సమ్మిట్ - సీఐఐ నిర్వహించిన సదస్సులో మాట్లా డుతూ చెప్పారు.రిజర్వుబ్యాంకు, భారత ప్రభుత్వం 2 కలిసి వృద్ధిరేటును తిరిగి గాడిలో పెట్టడానికి ఇప్పటికే పలు చర్యలకు శ్రీకారం చుట్టిందన్నారు. రిజర్వుబ్యాంకు రెపోరేటును ఇప్పటికే 110 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.4 శాతానికి సవరించిందని గుర్తు చేశారు. ద్రవ్యపరపతి విధానంలో కూడా కొన్ని పరిమితులున్నాయి కాబట్టి నేరుగా ప్రభుత్వమే రంగప్రవే శించి పలు చర్యలకు శ్రీకారం చుట్టిందన్నారు.

### సంస్కరణల గురించి..

ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి పలు చర్యలు తీసుకుందని, వాటిలో ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులకు మూలధనం కేటాయిం చడం ఒకటైతే, మరోటి బ్యాంకుల విలీనం చేయడం, ఎగుమతిదార్లకు ప్యాకేజీ ఇవ్వడంతో పాటు కార్పొ రేట్ పన్ను భారీగా తగ్గిందని వివరించారు. తన అంచనా ప్రకారం రాబోయే రోజుల్లో మరిన్ని నిర్మాణాత్మకమైన సంస్కరణలను ప్రభుత్వం ప్రకటిస్తుందన్నారు. ప్రభుత్వ రం గానికి చెందిన కంపెనీల్లో పెట్టుబడుల ఉపసంహరణను ప్రభుత్వం వేగవం తం చేయనుందన్నారు. ప్రభుత్వం మాత్రం పెద్ద ఎత్తున ఆస్తులను విక్రయించి నిధులను సమకూర్చు కోవాలనుకుంటోంద న్నారు. తన అంచనా ప్రకారం ఇన్వెస్టర్లు గ్రీన్‌ఫీల్డ్ ప్రాజె క్టుల బదులు బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలని కాంత్ ఇన్వెస్టర్లకు సూచించారు.




### కార్పొరేట్ టాక్స్ గురించి...

కార్పొరేట్ టాక్స్ గురించి ప్రస్తావిస్తూ.. గ్లోబల్ ప్రమాణాల స్థాయికి తీసుకొచ్చామన్నారు. ప్రభుత్వం పరిస్థితులు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి తప్పు మరింత క్లిష్టం చేయరాదన్నారు. కొన్ని అంశాల్లో ప్రభుత్వం జోక్యం మితిమీరరాదన్నారు. ప్రభుత్వ రంగానికి చెందిన ఆస్తులను విక్రయించడాని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇన్వెస్టర్లు గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల బదలు బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టులపై దృష్టిపెట్టాలని కోరుకుంటోందన్నారు. ప్రభుత్వం కొన్ని ఆస్తులను విక్రయానికి పెడుతోం దని... ఇన్వెస్టర్లు కావాలనుకొంటే ప్రభుత్వ రంగానికి చెందిన ఈ యూనిట్లలో పెట్టుబడులు పెట్టుకోవచ్చునని సూచించారు.వ్యవసాయం, గనులు, బొగ్గు రంగాల్లో ప్రభు త్వం మేఘా సంస్కరణలు తీసుకురాబోతోంద న్నారు. రాబోయే నెలల్లో ఈ సంస్కరణల గురించి ప్రజలకు తెలుస్తుందన్నారు. కేవలం ద్రవ్యపరపతి విధానంపై వల్ల వృద్ధిరేటు పెరగ దని... నిర్మాణాత్మకమైన సంస్కరణల ద్వారానే ఆర్థికవ్యవస్థను బలోపేతం చేసుకోవచ్చునని, దీని ద్వారా దీర్ఘకాలిక వృద్ధిరేటును సాధించుకో వచ్చునన్నారు.

ప్రభుత్వం తీసుకొచ్చే సంస్కర ణల ద్వారా వచ్చే మూడు దశాబ్దాల కాలంలో జీడీపీ వృద్ధిరేటు 9-10 శాతానికి చేరుకోవచ్చునని కాంత్ వివరించారు. దీని ద్వారా మరింత మంది పేదలను దారిద్ర్యరేఖ దిగువ నుంచి వెలికి తీయవచ్చునని ఆయన పేర్కొన్నారు. పారిశ్రామి కోత్పత్తి గణాంకాల గురించి ప్యానెల్ సభ్యులు లెవనెత్తిన ఆందోళన గురించి కాంత్ ప్రస్తావిస్తూ.. పారిశ్రామికోత్పత్తి గణాంకాలు మరింత పుంజుకోవాలంటే అతి పెద్ద నిర్మాణాత్మ కమైన సంస్కర ణలు అవసర మని ఆయన తెలి పారు. ప్రభుత్వం కూడా దీనిపై దృష్టి పెట్టిందని.. పారిశ్రామి కోత్పత్తిని పెంచు కోవడానికి ప్రభు త్వం ఇప్పటి వరకు ఉన్న నిబం ధనలను కూడా సరళతరం చేసిందన్నారు.

### డిజిటల్ ఇండియా గురించి

ప్రస్తావిస్తూ.. ప్రభుత్వం డిజిటల్ ఇండియాను పెద్దె త్తున ప్రోత్స హిస్తోం దని.. దీంతో పరోక్ష పన్నులు నగదురహిత, కాగితపు రహిత లావాదేవీలు పెరి గాయన్నారు. ప్రపంచ బ్యాంకు నేతృత్వంలో నడు స్తున్న సులభతర వాణిజ్యంలో 65 వ స్థానంలో ఉన్నామని.. వచ్చే రెండేళ్లలో టాప్ 50లో అటు తర్వాత వచ్చే ఐదు సంవత్సరాల్లో టాప్ 20లోకి రావాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నామని కాంత్ వివరిం చారు. ప్రభుత్వం తీసుకొచ్చే సంస్క ణలు రాజకీయ వివాదాలు కాకుండా చూస్తామని ఆయన అన్నారు. అయితే ప్రభుత్వ రంగానికి చెందిన సం స్థల్లో పెట్టుబడుల ఉపసంహ రణపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. నీతి ఆయోగ్ మొత్తం 55 ప్రభుత్వ రంగానికి చెందిన కంపెనీల్లో పెట్టుబడుల ఉప సం హ రణకు సిఫారసు చేయగా.. ప్రభుత్వం 26 ప్రభుత్వరంగానికి చెందిన కంపెనీల నుంచి పెట్టుబ డులు ఉపసహరించడానికా ఆమోదం తెలిపిందన్నారు. కొన్ని విష యాల్లో ప్రభుత్వం చక్కగా పని చేసినా.. కొన్ని విష యాల్లో పని తీరు బాగాలేదన్నారు. ఉదహారణకు ఆపరేషన్స్, మెయిన్‌టెనెన్స్‌లో పనితీరు మెరుగ్గాలేదన్నారు. అందుకే ప్రభుత్వం రోడ్లు, ట్రాన్స్ మిషన్‌లైన్లు, ఎయిర్ పోర్టులు దీంతో పాటు పలు రంగాలను నిర్వహించడానికి ప్రైవేట్ రంగానికి చెందిన వారికి అప్పగిం చాలనుకుంటున్నామని కాంత్ పేర్కొన్నారు.

### 2024 నాటికి 5 ట్రిలియన్ డాలర్లు..

ప్రభుత్వం తీసుకొస్తున్న బలమైన సంస్కరణలు, ప్రస్తుతం పరిస్థితులు కూడా అనుకూలంగా ఉండటంతో 2024 నాటికి భారత్ 5 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని సాధిస్తుందని డీపీఐఐటి కార్యదర్శి గురుప్రసాద్ మహాపాత్ర ఇక్కడ జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సదస్సులో మాట్లాడుతూ చెప్పారు. 2030 నాటికి 10 ట్రిలియన్ డాలర్లకు చేరుతావని ఆయన ఇక్కడ జరుగుతున్న డబ్ల్యు ఈఎఫ్ ప్రారంభ సదస్సులో అన్నారు. ప్రస్తుతం పరిస్థితులు భారత్‌కు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని, దీనికి తగ్గట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టాయ న్నారు. భారత పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వం కలిసి అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తాయన్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి సరళతర వాణిజ్యం గురించి ప్రభుత్వం పెద్దెత్తున కసరత్తు చేసిందని మహాపాత్ర పేర్కొన్నారు.



మహాపాత్ర

## అమ్మకాల ఒత్తిడి

- 198 పాయింట్లు డౌన్
- వరుసగా నాలుగో రోజూ నష్టాల్లోనే...

ముంబై : స్టాక్‌మార్కెట్లు వరుసగా నాలుగో రోజు గురువారం కూడా నష్టాలతో ముగిశాయి. జీఎస్టి వసూళ్లు తగ్గడంతో పాటు బ్యాంకింగ్‌రంగంలో నెలకొన్ని సంక్షోభాలు, గ్లోబల్ మార్కెట్లో కొనసాగుతున్న పరిణామాల తదితర కారణాలు స్టాక్ మార్కెట్లను నష్టాల్లోకి నెట్టాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు శుక్రవారం వెల్లడికానున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. ట్రేడింగ్ సరళిని గమనిస్తే.. ఉదయం నుంచే మార్కెట్లు నష్టాలతో ట్రేడ్ అయ్యాయి. సెన్సెక్స్ 38,310.93 పాయింట్ల గరిష్టానికి 37,957.56 పాయింట్ల కనిష్టానికి దిగివచ్చి చివరకు 198.54 పాయింట్ల నష్టంతో 38,106.87 వద్ద, నిఫ్టీ 46.80 పాయింట్లు నష్టపోయి 11,313.10 వద్ద ముగిశాయి. ఇక గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే యూరోపియన్ వస్తువులపై కొత్త టారిఫ్ విధిస్తామని అమెరికా హెచ్చరించడంతో ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న గ్లోబల్ ఆర్థిక వ్యవస్థపై మరింత ప్రభావం పడుతుంది. భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థపై రోజుకో పుకారు రావడంతో ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొంది. దీంతో వరుసగా గత కొన్ని రోజుల నుంచి మార్కెట్లు నేలచూపులు చూస్తోంది. బీఎస్ఈలో అత్యధికంగా నష్టపోయిన షేర్లలో వేదాంత 4.66 శాతంతో అగ్రస్థానంలో ఉండగా.. టాటాస్టీల్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, కొటక్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, హెచ్ యూఎల్, భారతి ఎయిర్‌టెల్‌లు 3.36 శాతం వరకు నష్టపోయాయి. దీనికి వ్యతిరేకంగా ఎస్ బ్యాంకు 33 శాతం వరకు లాభపడింది. ఎస్ బ్యాంకు బలంగా ఉందని.. నియంత్రణా సంస్థల నిబంధనలకు మించి లిక్విడిటీ ఉందని ప్రకటించడంతో షేర్లు జోరందుకున్నాయి. టాటామోటార్స్, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్, పవర్ గ్రిడ్, ఎంఅండ్‌ఎం షేర్లు 6.16 శాతం వరకు లాభపడ్డాయి.



## ఉద్దేశపూర్వక ఎగవేతదార్లలో చోక్సీ, గీతాంజలి జెమ్స్



**ముంబై :** ఉద్దేశపూర్వక ఎగవేతదార్లలో గీతాంజలి జెమ్స్, మెహుల్ చోక్సీ ఉన్నట్లు ప్రభుత్వరంగానికి చెందిన యూనైటెడ్ బ్యాంకు గురువారం ఒక బహిరంగ ప్రకటనలో వెల్లడించింది. రూ.332 కోట్లు బకాయిలు చెల్లించాలని ప్రస్తుతం చట్టం నుంచి పారిపోయిన చోక్సీకి నోటీసులు పంపించినట్లు తెలిపింది. వజ్రాల వ్యాపారి చోక్సీ ఆయన మేనల్లుడు నీరవ్‌మోడీలు దేశంలోని బ్యాంకింగ్ చరిత్రలో ఎన్న డూలేని విధంగా పీఎన్‌బీకి రూ.13,000 కోట్లు మోసిచేసి పారిపోయిన విషయం తెలిసిందే.బ్యాంకు విడుదల చేసిన బహిరంగ ప్రకటనలో యూనైటెడ్ బ్యాంకు చోక్సీ కంపెనీతో పాటు చోక్సీని జూన్ త్రైమాసికంలోనే ఉద్దేశపూర్వక ఎగ వేతదారుగా ప్రకటించింది. ఇప్పటికే పలువార్లు నోటీసులు పంపించినా.. బకాయిలు చెల్లించ డంలో విఫలం కావడంతో ఉద్దేశపూర్వక ఎగవే తదారుగా ప్రకటించాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. గీతాంజలి జెమ్స్‌కు కూడా నోటీసులు జారీ చేసింది. బ్యాంకు చోక్సీ కంపెనీకి రూ.331.85 కోట్లు రుణాలు ఇచ్చింది. మార్చి 2018లో బ్యాంకు ఈ ఖాతాను ఎన్‌పీఏ కింద ప్రకటించింది. ఈ ఏడాది ప్రారంభంలో మరో పీఎస్‌యు బ్యాంక్ ఒరియంటల్‌బ్యాంకు ఆఫ్ కామర్స్ కూడా చోక్సీ, మోడీలు ఇద్దరు ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా ప్రకటించింది.

## ఆంధ్రా బ్యాంకులో స్వచ్ఛతా హీ సేవ

**హైదరాబాద్ :** ఆంధ్రాబ్యాంకు సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవ (ఎస్‌హెచ్ఎస్) -2019 ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించింది. ముఖ్యంగా సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ (ఎస్‌యుపీ)లపై పెద్దెత్తున అవగాహన కార్యక్రమంపై దృష్టిపెట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు టాప్ ఎగ్జిక్యూటివ్‌లు జె పకీర్‌స్వామి, ఎండీ, సీఈవో, కుల్‌భూషణ్‌జైన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎ అరవింద్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, జనరల్‌మేనజర్లతో పాటు ఇతర సిబ్బంది చురు కుగా పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. సాధారణ ప్రజలకు, దుకా ణాదారులకు కరపత్రాలు అందించడం జరిగింది. ఆంధ్రాబ్యాంకు ప్రధాన కార్యా లయం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టి ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు.గాంధీ జయంతి రోజున బ్యాంకు సిబ్బంది శ్రమదానం చేసిన బ్యాంకు చుట్టుపక్కల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉదాహరణకు గ్లాసులు, సీసాలు, ప్లేట్‌లను పెద్దమొత్తంలో సేకరించారు.

## నెక్సా ద్వారా పది లక్షల యూనిట్ల విక్రయాలు




**న్యూఢిల్లీ :** మారుతి సుజుకి ఇండియా గురువారం నాడు సరికొత్త రికార్డును సృష్టిం చింది. ప్రీమియం రిటైల్ నెట్‌వర్కు ద్వారా 10 లక్షల యూనిట్లను విక్రయించింది. కంపెనీ 2015లో నెక్సా నెట్‌వర్క్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం సియాజ్, ఎస్ -క్రాస్, బాలెనో మోడల్ వాహనాలను ఈ రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా విక్రయిస్తోంది. దేశవ్యాప్తంగా 200 నగరాల్లో 350 నెక్సా ఔట్‌లెట్‌లను నిర్వహిస్తోంది. తమ కస్టమ ర్లకు సరికొత్త టెక్నాలజీని అందించేందుకు తాము కట్టు బడి ఉన్నామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మార్కె టింగ్ సెల్స్) శశాంక్ శ్రీవాత్సవ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఐఆర్‌సీటీసీ ఐపీవోకు భారీ స్పందన

**ముంబై :** ప్రభుత్వరంగానికి చెందిన ఐఆర్‌సీ టీసీ ఐపీవోకు భారీ స్పందన లభించింది. గురు వారంతో ఇష్యూ ముగిసింది. సాయంత్రం 4.15 గంటలకు 111 రెట్లు ఒవర్‌సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఇష్యూ సైజు 2,01,60,000 షేర్లకు గాను మొత్తం 2,25,09,16,400 షేర్లకు బిడ్‌లు దాఖలు అయ్యాయి. 2వ రోజు ఇష్యూ 3.25 రెట్లు ఒవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఐపీవో ధర రూ.315 నుంచి 320గా నిర్ణయించింది. ఐఆర్‌సీటీసీ వెబ్ సైట్ ద్వారా నెలకు 15 నుంచి 18 మిలి యన్ లావాదేవీలు జరుపుతోంది. ప్రస్తుతం ఐఆర్‌సీటీసీ మొత్తం 4 రకాల వ్యాపా రాలు నిర్వహిస్తోంది. వాటిలో ఇంట ర్నెట్ టికెటింగ్, కేటరింగ్, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌ను 'రైల్ నీర్' బ్రాండ్ కింది విక్రయిస్తోంది. దీంతో పాటు ట్రావెల్ అండ్ టూరిజం వ్యాపారాన్ని నిర్వహిస్తోంది.

# రెపోరేటు మరో మారు కోత?

- నేడు ప్రకటించనున్న ఆర్బీఐ
- ఇప్పటికే నాలుగు మార్లు 110 బేసిస్ పాయింట్ల తగ్గింపు




**ముంబై :** భారతీయ రిజర్వుబ్యాంకు శుక్రవారం మరో మారు రెపోరేటులో కోత విధించే అవకాశాలు కనిపిసున్నాయి. ప్రస్తుతం ద్రవ్యోల్బణం అదుపులో ఉంది.. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి వడ్డీరేట్లు తగ్గించాల్సి వస్తోంది. ఒకవేళ శుక్రవారం రెపోరేటు తగ్గిస్తే.. వరుసగా ఐదోసారి వడ్డీరేట్లలో కోత విధించినట్లు లెక్క.

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఇప్పటికే వడ్డీరేట్లతో కోత విధిస్తున్నట్లు సంకేతాలు కూడా ఇచ్చారు. ద్రవ్యోల్బణం అదుపులో ఉంది కాబట్టి వడ్డీరేట్లు తగ్గించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే పలు రకాల చర్యలు తీసుకుంది. వాటిలోకార్పొరేట్ పన్నులో భారీ కోత విధించింది. విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లపై విధించిన సర్‌చార్జీని ఉపసంహరించింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు ఆరేళ్ల కనిష్టానికి 5 శాతానికి దిగిరావడంతో వృద్ధిరేటు పెంచుకోవడానికి పలు ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. మూడు రోజుల పాటు ఆరుగురు సభ్యులతో కూడిన ద్రవ్యపరపతి సమీక్ష వివరాలను శుక్రవారం ఆర్‌బీఐ ప్రకటిస్తుంది. అక్టోబర్ 2న గాంధీ జయంతి కారణంగా ప్యానెల్ సమావేశం కాలేదు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆర్‌బీఐ రోపోరేటు నాలుగుసార్లు 110 బేసిస్‌పాయింట్లు తగ్గించింది. చివరగా ఆగస్టులో జరి గిన పరపతి సమీక్షలో బెంచ్ మార్కు వడ్డీరేటును అనుకోని విధంగా 35 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.40 శాతానికి పరిమితం చేసింది. రిజర్వుబ్యాంకు వడ్డీరేట్లను తగ్గించినా.. వాణిజ్య బ్యాంకులు వడ్డీరేట్లు తగ్గించకపోవడంతో పాటు ఆర్‌బీఐ రుణాలను రెపో రేటుతో అనుసంధానం చేస్తూ నిర్ణ యం తీసుకుంది. దీంతో అక్టోబర్ 1వ తేదీ నుంచి రుణాలు రోపోరేటుతో అనుసం ధానం అవుతాయి. ఈ సమావేశానికి ముందు ఆర్‌బీఐ గవర్నర్ ఆర్థిక స్థిరత్వం అభివృద్ధి మం డలి (ఎఫ్ఎస్‌డీసీ) సబ్‌కమిటీతో సమా వేశమై ప్రస్తుతం దేశంలో నెలకొన్ని ఆర్థిక వ్యవస్థ గురించి చర్చించారు. ప్రస్తుతం ప్రభు త్వం వద్ద నిధులు కటకట ఏర్పడింది. ప్రభుత్వం కార్పొరేట్ పన్నును తగ్గించడం.. జీఎస్టి వసూళ్లు తగ్గడంతో ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఇక ఆర్‌బీ ఐపైనే ఆధారపడాల్సి వస్తోందని ఆర్థిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్ష్యం లోపనే ఉంది కాబట్టి వడ్డీరేట్లు తగ్గించడానికి అవకాశం ఉందని కొటక్ మహీంద్రాకు చెందిన శాంతి ఏకాంబరం అన్నారు. ఇటీవల ముడిచమురు ధరలు పెరగడంతో పాటు ప్రభుత్వం కొన్ని ఆర్థికపరమైన చర్యలు ప్రకటించింది. దీని ప్రభావంతో ద్రవ్యోల్బణం పెరగడంతో పాటు ద్రవ్యలోటు పెరిగే అవకాశం ఉందని ఆమె అన్నారు. అయినా ద్రవ్య విధాన కమిటి అక్టోబర్‌లో జరిగే పరపతి సమీక్షలో 20-25 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశాలున్నాయన్నారు. బ్యాంకు ఆఫ్ అమెరికా మెర్లిలించ్ అంచనా ప్రకారం 35 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశాన్నికొట్టి పారేయలేమని తాజా నివేదికలో వెల్లడించింది. రియల్‌ఎస్టేట్‌కు చెందిన నిరంజన్ హీరానందాని రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించాలని, దీంతో రుణాల రేట్లు తగ్గుతాయని.. పెట్టుబడులు పెరిగి..వినియోగం పుంజుకుంటుందన్నారు. నిపుణులు పరిశ్రమలకు చెందిన వారు కూడా ద్రవ్యోల్బణం అదుపులో ఉంది. కాబట్టి ఆర్‌బీఐ వడ్డీరేట్లు తగ్గించడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని, పండుగ సీజన్ ఇప్పుడే మొదలైంది కాబట్టి దసరా నవరాత్రులకు, దీపావళికి కొనుగోళ్లు చేస్తారు కాబట్టి వడ్డీరేట్లు తగ్గించి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకోవచ్చునని చెబుతున్నారు.



## లెక్సిస్ ఆర్‌ఎక్స్ 450 హెచ్‌ఎల్

- ధర రూ.99 లక్షలు

**న్యూఢిల్లీ :** టయోటాకు చెందిన లగ్జరీకార్ల అనుబంధ కంపెనీ లెక్సిస్ గురువారం నాడు లగ్జరీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఆర్‌ఎక్స్450హెచ్‌ఎల్‌ను దేశీయ మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.99 లక్షలు (ఎక్స్ షోరూం ఢిల్లీ)గా ప్రకటించింది. ఫోర్త్ జనరేషన్‌కు చెందిన ఈ మోడల్ కారులో అదనంగా మూడవ సీటింగ్ వరుసను అందిస్తున్నారు. ఈ కారు బుకింగ్ ఈ నెలలోనే మొదలవుతుంది. ఈ మోడల్ బీఎస్‌ఈ-6 ప్రమాణాలతో పాటు 3.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్ బిగించారు. మెరుగైన టెక్నాలజీ, డిజైన్‌తో పాటు ఆకర్షణీయమైన ధరలో అంది స్తున్నందు వల్ల ఆర్‌ఎక్స్ 450 హెచ్‌ఎల్ కస్టమర్లకు నచ్చుతుందని ఒక ప్రకటనలో తెలిపింది. భారత్ మార్కెట్లో సరికొత్త మోడల్స్‌ను అందించాలన్న ఉద్దేశంతోనే కొత్త కొత్త మోడల్ కార్లను అందిస్తున్నామని కంపెనీ భారత ఆపరేషన్ చీఫ్ వేణుగోపాల్ చెప్పారు.

## టాటామోటార్స్ నెక్సాన్ ఎలక్ట్రిక్ కారు

- మార్చి త్రైమాసికంలో విడుదల
- ధర రూ.15 నుంచి 17లక్షల వరకు

**న్యూఢిల్లీ :** ఈ ఆర్థిక సంవత్సరం నాలుగవ త్రైమాసికంలో నెక్సాన్ ఈవీని విడుదల చేయనున్నట్లు టాటామోటార్స్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. దీని ధర రూ.15 నుంచి రూ.17 లక్షల మధ్యలో ఉంటుం దని వెల్లడించింది. ఈ వాహనా నికి జిప్రాన్ టెక్నాలజీని వినియోగిస్తు న్నట్లు పేర్కొంది. మార్చి చివరి నాటికి ఈ ఎలక్ట్రిక్ కారును కస్టమర్లకు అందుబాటులో తెస్తామని టాటా మోటార్స్ ప్రెసిడెంట్ - ఎలక్ట్రిక్ మొబిలిటి బిజినెస్ - కార్పొరేట్ స్ట్రాటజీ శైలేష్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఈవీ మార్కెట్లో ఎదుర్కొంటున్న లోపాలను అన్నీ ఈ మోడల్‌లో పరిష్కరిస్తామని, డ్రైవింగ్‌కు చక్కని అనుభూతి కలిగించే చర్యలు తీ సుకుం టున్నామని, కర్బన ఉద్గ రాలుసున్నా శాతానికి తీసుకువస్తామని వివరించారు.ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేయాలనేవారికి టాటా నెక్సాన్ చక్కగా సరిపో తుందని చంద్ర అన్నారు. జిప్రాన్ టెక్నాలజీ వినియో గించినందువల్ల ఒక్కసారి చార్జి చేసుకుంటే 300 కిలో మీటర్ల వరకు ప్రయాణించవచ్చునని టాటామోటార్స్ ఒక ప్రకటనలో వివరించింది.




**న్యూఢిల్లీ :** హ్యుందాయ్ మోటార్ ఇండియా గురువారం అప్‌డెటెడ్ వెర్షన్ ప్రీమియం సెడాన్ ఇలాంత్రాను మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.15.89 లక్షల నుంచి రూ.20.39 లక్షలు (ఎక్స్ షోరూం ఢిల్లీ)గా నిర్ణయించారు. ఈ మోడల్ 2 లీటర్ల పెట్రోల్ పవర్ ట్రెయిన్ ఇంజిన్‌తో పాటు ఆరు స్పీడ్ మాన్యువల్‌తో పాటు ఆటోమెటిక్ ట్రాన్స్ మిషన్‌ను అందిస్తోంది. కొత్త 2019 హ్యుందాయ్ కొత్త ఇలాంత్రా భారతీయ ప్రీమియం సెడాన్ సెగ్మెంట్‌లో కొత్త ఒరవడిని సృష్టిస్తుందని, కస్టమర్ల అభిరుచిని మించి ఈ కారును రూపుదిద్దామని హ్యుందాయ్ ఇండియా ఎండీ, సీఈవో ఎస్ఎస్ కిమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మోడల్‌కు కొత్తగా బ్లూ లింక్ టెక్నాలజీని అందిస్తున్నామని దీని ద్వారా మొత్తం 34 కనెక్టెడ్ ఫీచర్లను అందిస్తుందని.. వైర్‌లెస్ చార్జర్‌తో పాటు ఫ్రంట్ వెంటిలెటెడ్ సీట్లతో పాటు స్టాండర్డ్ సెఫ్టీ ఫీచర్లతో పాటు ఆరు ఎయిర్‌బ్యాగ్స్, ఎబీఎస్ (యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్)తో పాటు ఈబీడీ (ఎలక్ట్రానిక్ బ్రేక్ ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్) ఎయిర్ పార్కింగ్ సెన్సార్స్‌ను అందిస్తున్నట్లు తెలిపింది.

## హ్యుందాయ్ కొత్త ఇలాంత్రా

- ప్రారంభ ధర 15.89 లక్షలు



## రూ.348 పెరిగిన పసిడి ధర

- వెండి కిలో రూ.1,630

**న్యూఢిల్లీ :** బంగారం ధరలు గురువారం పది గ్రాములు రూ.348 పెరిగి రూ.39,115కు ఢిల్లీలో చేరుకుంది. రూపాయి బలహీనపడ్డంతోపాటు గ్లోబల్ మార్కెట్లో బంగారానికి డిమాండ్ పెరగడంతో దాని ప్రభావంతో దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపించిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ తెలిపింది. వెండి కూడా కిలో రూ.1,630 పెరిగి రూ.47,580కి ఎగబాకింది. న్యూయార్కులో బంగారం ఔన్స్1501



డాలర్లు పలకగా.. వెండి ఔన్స్ 17.61 డాలర్ల వద్ద ట్రేడ్ అయ్యింది. గ్లోబల్ మార్కెట్లో ధరలు పెరగడానికి ప్రధాన కారణం అమెరికాలోపేరోల్ డేటా నిరుత్సాహపర్చడంతో పాటు యూరోపియన్ వస్తువులపై టారిఫ్ విధిస్తామని అమెరికా ప్రకటించడంతో ధరలు భగ్గమున్నాయి. మంగళవారం పది గ్రాముల బంగారం రూ.38,767 వద్ద.. వెండికిలో రూ.45,950 వద్ద ముగిశాయి. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఢిల్లీ బులియన్ మార్కెట్‌కు సెలవు.

## కల్పవృక్ష వాహనంపై

# కైవల్య ప్రదాత



**తిరుమల, ప్రభ న్యూస్:** అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలలో నాల్గవరోజు గురువారం ఉదయం 9 గం॥ కు తిరుమలలో శ్రీవారి ఉత్సవ మూర్తి అయిన మలయప్పస్వామి తన ఉభయ నాంచారులతో కలసి కలవృక్ష వాహనాన్ని అధిరోహించి తిరువమాడవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు శ్రీనివాసుడు. పురాణాలు, బహుముఖంగా కీర్తించే దేవాతా వృక్షం కల్పవృక్షం. ప్రకృతి శోభను పెంపొందించే వృక్షాలు సృష్టిలో చాలా ఉన్నాయి. ఆ వృక్షాలు తాము కాచిన ఫలాలను మాత్రమే అందిస్తాయి. కల్పవృక్షం మాత్రం వాంఛికఫలాలన్నింటిని ప్రసాదిస్తుంది. శ్రీనివాసుడు భక్తజన కల్పతరువు, కోరిన వరాలనే కాదు కోరని వరాలను కూడా అనుగ్రహించగల దేవదేవుడు. మొదట శ్రీ మలయప్ప స్వామి వారికి, శ్రీదేవి, భూదేవి సమేతులై రంగనాయకుల మండపంలో పట్టు పీతాంబర, వజ్ర, వైడూర్యాలతో విశేషాభరణాలంకృతుడై దేవేరులతో కలసి కల్ప వృక్ష వాహనంపై తిరుమాడ వీధులలో రాజమన్నారు వేషధారణలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో దేవతామూర్తుల వేషాలు, భక్తి పాటలు, చెక్కభజనలు, కోలాటాలు, గోవిందనామసంస్మరణ గీతాలు, వివిధ చారిత్రక వేషాలు భక్తులను పరవశింపచేశాయి. శ్రీనివాసుడు కల్పవృక్ష వాహనంలో వేద మంత్రోచ్చారణల మధ్య కన్నుల పండుగగా కల్పవృక్షనీడలో, తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కల్పవృక్షనీడన చేరిన వారికి ఆకలిదప్పులు ఉండవని, పూర్వజన్మస్మరణ కలుగుతుందని, ఈ వాహన దర్శనం వల్ల స్వామి ఆ ఫలాన్ని పరిపూర్ణంగా అనుగ్రహిస్తారని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ వాహనసేవలో ఏపీ హైకోర్టు తాత్కాలిక చీఫ్‌జస్టిస్ ప్రవీణ్‌కుమార్ దంపతులు, టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ దంపతులు, అదనపు ఈఓ ధర్మారెడ్డి, సివిఎస్ఓ గోపినాథ్‌జెట్టి, ఆలయ ఆలయ డిప్యూటీఈఓ హరీంధ్రనాథ్, బోర్డు సభ్యులు, పోలీస్ ఉన్నతాధికారులు, జీయంగార్లు, తదితర అధికారులు, అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సర్వభూపాల వాహనంపై

# సర్వాంతర్యామి



**తిరుమల, ప్రభ న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వరస్వామి తన ఉత్సవమూర్తి అయిన శ్రీమలయప్ప స్వామి వారు శ్రీదేవి, భూదేవిలతో కలసి గురువారం రాత్రి 8 గం॥ సర్వభూపాల వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలలో నాల్గవ రోజు శ్రీవారు సర్వభూపాల వాహనంపై విహరించడంలో అతిశయోక్తి లేదు. ఆదిదేవుడైన శ్రీహరి రాజాదిరాజు కావడంలో వింత ఏముంది. భూపాలురు అంటే రాజులు సర్వ భూపాలురు అంటే అందరు రాజులని అర్థం. ప్రజలను రంజింపచేసే వారే రాజులు. విష్ణ్వంశ లేని వారు రాజు కాలేడు అందుకే నా విష్ణుః పృథ్వీపతిః అని అన్నారు. రాజులందరు భగవదంశ కలవారే వారు అంశలైతే స్వామి వారు అంశి. ఇక్కడ రాజులకు రాజాధిరాజులకు అంశ, అంసీభావం కుదిరింది. అందుకే సర్వభూపాలురు భగవంతుని తమ భుజస్కందాలపై ఉంచుకుని ఊరేగిస్తారు. మొదట శ్రీమలయప్పస్వామి వారికి, ఉభయదేవేరులకు రంగనాయుకల మండపంలో పట్టు పీతాంబరాలతో వజ్ర, వైఢూర్య, విలువైన బంగారు ఆభరణాలు ధరింపచేసి బంగారు సర్వభూపాలవాహనంలో స్వామి వారు తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు నయనానందకరంగా దర్శనమిచ్చారు. స్వామి దర్శన భాగ్యంతో తిరుమల మాడవీధులన్నీ గోవిందనామస్మరణతో మారుమ్రోగాయి. ఈ ఉత్సవంలో దేవతామూర్తుల వేషాలతో, కోలాటాలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రాల మధ్య వైభవంగా ఊరేగింపు సాగింది. ఈ వాహనసేవలో టీటీడీ చైర్మెన్ వైవి.సుబ్బారెడ్డి, ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ దంపతులు, అదనపు ఇఓ ధర్మారెడ్డి, సివిఎస్ఓ గోపినాథ్‌జెట్టి, ఆలయ డిప్యూటీఈఓ హరీంధ్రనాథ్, బోర్డు సభ్యులు, పోలీస్ ఉన్నతాధికారులు, జీయంగార్లు, తదితర అధికారులు, అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదవరోజైన నేడు ఉదయం మోహిని అవతారం, రాత్రి గరుడ వాహనాలపై స్వామివారు మాడ వీధులలో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

# యువతే బ్రాండ్ అంబాసిడర్లు

- "బ్రాండథాన్"తో రాష్ట్రానికి సరికొత్త ఇమేజ్
- ప్రపంచ ఆర్థిక సమాఖ్య సదస్సులో మంత్రి గౌతమ్‌రెడ్డి



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్‌కు సరికొత్త బ్రాండింగ్ సృష్టించే దిశగా "బ్రాండథాన్" నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖా మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రపంచ ఆర్థికసమాఖ్య సదస్సులో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సులో పంజాబ్ ముఖ్యమంత్రి అమరేందర్ సింగ్, మేఘాలయ ముఖ్యమంత్రి సంగ్మా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్ నాథ్, తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావులతో కూడా ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి చర్చలు జరిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచడమే తక్షణ కర్తవ్యంగా ముందుకెళ్తున్నామని గౌతమ్ రెడ్డి వెల్లడించారు. పారదర్శకత, సుపరిపాలనకు విలువనిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే సీఎం సంకల్పమని వివరించారు.

రాష్ట్రానికి ప్రత్యేకత చేకూర్చే విధంగా రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనకు ప్రపంచ దృష్టిని ఆకర్షిం చే(బిల్డింగ్ బ్రాండ్ ఏపీ) విధంగా దేశం నలుమూలల నుంచి ప్రత్యేక గుర్తింపు పొందడానికి సృజనాత్మక యువత నుంచి తమ అమూల్యమైన సలహాలు, సూచనలను అక్టోబర్ 3 నుంచి 28వ తేదీ వరకు https://bit.ly/2m1KVml పోర్టల్ ద్వారా ఎంట్రీలను స్వీకరించనున్నట్టు తెలిపారు. పరిశ్రమలు, వాణిజ్య, ఐ.టీ శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డితో హింద్ వైర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రతినిధులు సమావేశమయ్యారు. హింద్ వైర్ కంపెనీ గురించి ఆ సంస్థ ఎండీ మంత్రికి వివరించారు. జపాన్‌కు చెందిన మిత్సుబిషి ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీ ప్రతినిధులు మంత్రిటితో భేటీ అయ్యారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ గురించి చర్చించారు.

# ఆన్‌లైన్ బిల్లు... బ్లాక్‌లో చెల్లు!



## ఇసుక మాఫియా మాయాజాలం

- నెల్లూరు పెన్నా ఇసుక బిల్లుతో విజయవాడలో విక్రయాలు
- విజయవాడ-గుంటూరులకే పరిమితం అవుతున్న ఆన్‌లైన్ బిల్లులు
- ఒకే వే బిల్లుతో రోజంతా ఇసుక తరలింపు
- డంపింగ్ యార్డుల్లో చక్రం తిప్పుతున్న చోటా నేతలు

**అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో:** రాష్ట్రంలో ఇసుక అక్రమ రావాణాను అరికట్టేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త పాలసీలను తీసుకొస్తున్నా.. ఇసుక మాఫియా మాయా జాలం ముందు అవి బలాదూర్ అవుతున్నాయి. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అతి సామాన్యుడికి ఇసుకను సులువుగా అందించాలన్న ఆలోచనతో వ్యవస్థలో కొత్త మార్పులకు శ్రీకారం చుట్టారు. అయితే, సాంకేతిక పరిజ్ఞానాన్ని తమకు అనుకూలంగా మలచుకుని అక్రమాల విక్రమార్కులు ఇసుక అక్రమ రవాణాను కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. నెల్లూరు పెన్నా నదిలో పుష్కలంగా ఉన్న ఇసుకను ఆ జిల్లాకు చెందిన వారు ఆన్‌లైన్‌లో కొఉగోలు చేయలేక అష్టకష్టాలు పడుతూ ఉంటే నిత్యం విజయవాడ, గుంటూరుకు చెందిన కొంత మంది అవే ఆన్‌లైన్ బిల్లును బ్లాక్‌లో విక్రయించి అంతకు రెట్టింపు మొత్తాన్ని సొమ్ము చేసుకుంటున్నారంటే ఇసుక మాఫియా ఏస్థాయిలో దోపిడీకి పాల్పడుతుందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు.

### దోపిడీ సాగుతోందిలా...

నూతన ఇసుక విధానం ప్రకారం ట్రాక్టర్ ఇసుక కావల్సిన లబ్ధిదారుడు ఉదయం 12 గం.ల నుండి సాయంత్రం 6 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తులో ఇసుకరీచ్ పేరు, ట్రాక్టర్ నంబరు, డ్రైవర్ సెల్‌ఫోన్ నంబరు, ఇసుక ఎక్కడి నుండి ఎక్కడికి దిగుమతి చేయాలనే అంశాలు ఆ దరఖాస్తులో స్పష్టంగా పొందుపర్చాలి. అందుకు సంబంధించిన ఆధార్ నంబర్లను కూడా నమోదు చేయాలి. ఇంతవరకు నిబంధనలన్నీ బాగానే ఉన్నప్పటికీ ఆన్‌లైన్ ఓపెన్ చేయగానే రెండు నుండి మూడు నిమిషాలకే నో స్టాక్ సందేశం వస్తోంది. అదే సమయంలో విజయవాడ, గుంటూరుకు చెందిన వారికి అదే ఆన్‌లైన్‌లో క్షణాల్లో బిల్లు అనుమతులు లభిస్తున్నాయి. తిరకాసంతా ఇక్కడే దొరుకుతుంది. నెల్లూరులో లభించే ఇసుకను అదే ప్రాంతానికి చెందిన వారు 10 రోజులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ లభించడం లేదు. పొరుగున ఉన్న విజయవాడ, గుంటూరులకు మాత్రం 10 నిమిషాల్లోనే ఎన్ని అనుమతులు కావాలంటే అన్ని అనుమతులు వచ్చేస్తున్నాయి ఇదెలా సాధ్యమన్నదే ప్రధాన ప్రశ్న. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టున్న కొంత మంది మేధావులను తమకు అనుకూలంగా మలచుకుని ఇసుక వ్యాపారులు ఆ పరిజ్ఞానాన్ని కూడా తమ దోపిడీకి ఉపయోగిస్తున్నారు. నెల రోజులుగా ఇదేతంతు జరుగుతుందంటే దోపిడీ ఏ స్థాయిలో జరుగుతుందో ఆన్‌లైన్ ప్రత్యక్షసాక్ష్యం.

### ఆన్‌లైన్ బిల్లు.. బ్లాక్‌లో అమ్మకాలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాలుగు టన్నుల ట్రాక్టర్ ఇసుకకు ఆన్‌లైన్‌లో అనుమతులొచ్చాక రూ.1500 చెల్లించాలి. అలాగే 10 టైర్ల లారీలో 18 టన్నుల ఇసుకకోసం రూ.7,750 చెల్లించాలి. అయితే, ఆన్‌లైన్‌లో రాజమార్గంలోనే బిల్లులు స్వంతం చేసుకున్న మాఫియా ఏకంగా వాటిని బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక బిల్లును రూ. 3 వేలకు, లారీ ఇసుక బిల్లును రూ. 15,000కు అమ్మకాలు చేస్తున్నారు. అయితే, ఇదంతా గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతోంది. ఎక్కడివారు అక్కడే ఉంటారు. అన్నీ ఆన్‌లైన్‌లోనే ప్రక్రియ మొత్తం పూర్తవుతుంది. విజయవాడకు చెందిన మాఫియా ఆన్‌లైన్ బిల్లును నెల్లూరులో ఉండే తమ మనుషులకు ఆన్‌లైన్ లేదా వాట్సాప్‌లో పంపుతారు. ఇసుక అవసరమైన వ్యక్తులు ఆ బిల్లును తీసుకుని వాడగిన మొత్తాన్ని ఆన్‌లైన్ అకౌంట్‌లో జమ చేస్తారు. అందుకు సంబంధించిన రసీదు వారికి వాట్సాప్‌లో పంపుతారు. ఇలా నెల్లూరు ఇసుకను అక్కడివారికి విజయవాడ మాఫియా ఆన్‌లైన్‌లో అమ్మకాలు జరపడం చూస్తుంటే మాఫియా ఏ స్థాయిలో దోపిడీ చేస్తుందో, పాత విధానాన్ని కొత్త టెక్నాలజీతో ఎలా కొనసాగిస్తుందో అర్థమౌతోంది.

### మాఫియా మాయాజాలం

ప్రభుత్వం ఇసుక ధరను అధికారికంగా ప్రకటించింది. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో కొత్త రీచ్‌లను కూడా తెరచింది. అయితే, గతంలో ఇసుక రీచ్‌ల నుండి ఇష్టానుసారంగా తవ్వకాలు జరిపి దోపిడీ చేస్తున్నారని గుర్తించిన పాలకులు తాజాగా రీచ్‌లతో సంబంధం లేకుండా అందుబాటులో డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసింది. రీచ్‌ల నుండి టన్నుల కొద్దీ ఇసుకను డంపింగ్ యార్డుకు తరలించి నిల్వచేస్తారు. ఆన్‌లైన్‌లో బిల్లు అనుమతి పొందిన వారికి సంబంధిత పత్రాలతో డంపింగ్ యార్డు అధికారి వద్దకు రావాలి. వాటిని పరిశీలించాక ఇసుక రవాణాకు అనుమతిస్తారు. అయితే, ఇసుక మాఫియా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందడం దగ్గర నుండి ఇసుకను రవాణా చేసే వరకు అంతా తమ కనుసన్నల్లోనే సాగిస్తున్నారు.

### ఇక అనుమతితో రోజంతా తరలింపు

ఇసుక కోసం ఆన్‌లైన్‌లో అనుమతి పొందిన లబ్ధిదారుడు ఆ ఇసుకను తమ నివాస ప్రాంతానికి తరలించేందుకు సంబంధించి వాహనానికి అనుమతులు తీసుకోవాలి. అందుకు సంబంధించి డంపింగ్ యార్డు పాయింట్ నుండి వారికి అవసరమైన ప్రాంతానికి ఇసుకను తీసుకెళ్లేందుకు సంబంధిత వాహనానికి కిలో మీటరుకు రూ. 4.90 వంతున చెల్లించి ఇసుక తరలింపుకు ప్రభుత్వం నుండి అనుమతి తీసుకోవాలి. అందుకు సంబంధించి పైకం చెల్లించాకే డంపింగ్ యార్డు అధికారి రవాణాకు అనుమతిస్తారు. అయితే, ఇంతవరకూ బాగానే ఉన్నప్పటికీ అదే అనుమతితో రోజంతా ఇసుక రవాణాచేస్తూ ప్రభుత్వ ఆదాయానికి బహిరంగంగా గండికొడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిబంధనల ప్రకారమే ఇసుక రవాణాకు అనుమతిస్తున్నామని తమ తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తూనే మరోవైపు చోటా నేతలతో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడుతున్నారు. పనిలో పనిగా అధికారులు తమకు అనుకూలంగా ఉన్నారన్న ధీమాతో వాహన యజమాని కూడా ఏకంగా కిలోమీటరుకు రూ.110 వంతున లబ్దిదారుల నుండి వసూలు చేసి రెండో రకం దోపిడీకి పాల్పడుతున్నారు.

## శేషవాహనంపై ఊరేగిన

# శ్రీగిరివాసుడు

### స్కందమాత అలంకారంలో దర్శనమిచ్చిన భ్రమరాంబికాదేవి



**శ్రీశైలం, ప్రభ న్యూస్:** జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా 5వ రోజు గురువారం రాత్రి శ్రీగిరివాసుడైన శ్రీ మల్లికార్జున స్వామి భ్రమరాంబ సమేతుడై శేషవాహనంపై ఆసీనుడై స్కంధమాత అలంకృత అమ్మవారితో పాటు శ్రీశైల పుర వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వగా వేలాది మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని పునీతులయ్యారు. స్వామివారి ఆలయ దక్షిణ ద్వారం వద్ద వివిధ పుష్పాలతో అలంకరించిన శేషవాహనంపై స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆసీనులను చేశారు. స్వామివారి ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి వాహన సేవలను గావించారు. అనంతరం వాహనరూడులైన శ్రీ స్వామివార్లకు అలంకృత అమ్మవారితో పాటు ఆలయ రాజగోపురం గుండా బయటకు తెచ్చి గంగాధర మండపం వద్ద ఉంచి క్షత్రక్షామరాజులను అమర్చారు. అనంతరం ఈఓ కెవెస్ రామారావు స్వామివార్లకు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. వేద పండితులు వేద మంత్రాలు మంగళవాయిద్యాలు, బాండు మేళాల మధ్య ప్రారంభమైన ఈ గ్రామోత్సవం అంకాలమ్మ గుడి, నంది గుడి, వీరభద్ర స్వామి ఆలయం, రథశాల మీదుగా ఊరేగింపు నిర్వహించి తిరిగి ఆలయానికి చేర్చారు. ఈ గ్రామోత్సంలో కోలాటాలు, లంబాడీల విన్యాసాలు, విరప్పడోలు వాయిద్యాలు, సందికోల విన్యాసాలు, డ్రమ్ముల విన్యాసాలు, బుట్ట బొమ్మలు, పగటి వేషగాళ్ల అలంకరణలు వంటివి భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

**స్కందమాత అలంకారంలో దర్శనమిచ్చిన భ్రమరాంబ**

శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబదేవి గురువారం రాత్రి స్కంధమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. దేవతల సేనాధిపతి అయిన కుమారస్వామి పార్వతీ దేవి యొక్క కుమారుడు, ఈయనకు స్కంధుడనే పేరు కుడా ఉన్నది. చతుర్భుజాలను కలిగి అమ్మవారు బాల స్కందుడిని ఒడిలో ఒక చేతిలో పట్టుకుని దర్శనమిస్తుంది. అలాగే మరొక చేతిలో పద్మం ధరించి ఉంటుంది. తెల్లటి వర్ణం గల ఈ అమ్మవారిని పూజిస్తే సకల శాస్త్రాలు ఆధ్యాత్మికత ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి. గరువారం రాత్రి అమ్మవారి అలయంలోని అలంకార మండపం నందు భ్రమరాంబ దేవి ఉత్సవ మూర్తిని స్కందమాత అలంకరణలో అలంకరించారు. అలంకృత అమ్మవారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద మంత్రాలు మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్కతంగా లఘు పూజలు, అష్టోత్తర శతనామాలతో కుంకుమార్చనలు, శ్రీశుద్ధ సహిత మంత్ర పుష్పహారతలు వంటి విశేష పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహనాధికారి కెవెస్ రామారావు, ఆలయ భద్రతా అధికారి శ్రీనివాసులు, పిఆర్వో అనీల్, ఈఈ రామిరెడ్డి, ఎఈఓ క్రిష్ణారెడ్డి, సూపరిండెంట్ మల్లికార్జున రెడ్డి ,వెంకటేశ్వర్లు, పండితులు, అర్చకులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

**శ్రీశైలంలో నేడు..**

జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న దసరా నవరాత్ర ఉత్సవాలలో భాగంగా నవదుర్గ అలంకరణలో భాగంగా నేడు అమ్మవారికి కాత్యాయని అలంకరణలో భక్తులకు దర్శనమివ్వ నున్నారు. అలాగే స్వామివారి వాహన సేవలో భాగంగా హంస వాహనంపై స్వామివారు, అలంకృత అమ్మవారితో హంసవాహనంపై ఆసీనులై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## దెందులూరుకు వస్తా...

# పోలీసుల అరాచకాలను నిలదీస్తా

- కార్యకర్తలను వేధిస్తే... ఉపేక్షించేది లేదు
- టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరిక



**అమరావతి, ఆంధ్రప్రభ:** దెందులూరుకు వస్తా.. పోలీసుల అరాచకాలను నిలదీస్తానని చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి, పోలీసులకు హెచ్చరికలు జారీ చేశారు. గురువారం పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ముఖ్య నేతలు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును గుంటూరులోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కలిశారు. పశ్చిమగోదావరి జిల్లా పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కేసులతో వేధిస్తున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో పాటు ముఖ్య నేతలు, చురుకైన కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ కేసులు అక్రమంగా నమోదు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు చింతమనేనిపై ఒకదానిపై మరొక కేసు పెడుతూ జైలుకే పరిమితమయ్యేలా చేస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం, పోలీసులు హద్దు మీరొద్దని హెచ్చరించారు. పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అడ్డగోలుగా వ్యవహరించడం తగదని మండిపడ్డారు. పోలీసులు, వైకాపా నేతల ఆరాచకాలు శృతిమించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే తెదేపా ప్రజాప్రతినిధుల బృందం దెందులూరులో పర్యటించి నిజనిజాలను సమీక్షించిందని త్వరలో పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులు పర్యటించి వాస్తవాలను తనకు తెలియజేస్తారని తెలిపారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని వైకాపా నేతలు గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు. తనను కలిసిన దెందులూరు కార్యకర్తలకు అన్ని విధాల అండగా ఉంటానని, ధర్మం, న్యాయం కోసం పోరాటం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు పోలీసులు 172 అక్రమ కేసులు నమోదు చేశారని వీటిలో 10 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పశ్చిమగోదావరి జిల్లాలో నమోదు అయ్యాయని తెలిపారు. ఇటువంటి పరిణామాలు మంచివి కావని పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఎప్పటికైనా వైకాపా నేతలతో పాటు పోలీసులు సైతం చట్టం, న్యాయం ముందు తలవం చుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. చంద్రబాబును కలిసిన వారిలో మాజీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబులతో పాటు పశ్చిమగోదావరి జిల్లా నేతలు బడేటి బుజ్జి, గంజి ఆంజనేయులు, దెందులూరు కార్యకర్తలు ఉన్నారు.

# ప్రైవేట్ ఫీజులపై కమిషన్ దృష్టి

**అమరావతి, ఆంధ్రప్రభ:** పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ యాక్షన్‌లోకి దిగింది. రాష్ట్రంలో పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో దారుణమైన ఫీజు దోపిడీ జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల ఫీజుల వివరాలను తమకు అందజేయాలని కమిషన్ ఆదేశించింది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రైవేట్ పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధనా సిబ్బంది, ఫీజులపై దృష్టి సారిస్తామని ప్రకటించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కూడా పలు వేదికలపై ఈ అంశాన్ని అనేకసార్లు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో గత నెలలో పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్, ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్‌లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కమిషన్‌ల అధిపతులు విస్తృతానుభవం కలిగి నిర్ణయాధికారం తీసుకోగలిగి ఉండాలనే ఉద్దేశంతో విశ్రాంత న్యాయమూర్తులను నియమించాలని ప్రభుత్వం భావించింది. ఈ కమిషన్‌లు విద్యకు సంబంధించి ఏ అంశంపైనైనా స్వేచ్ఛగా విచారణ జరిపి తదనుగుణంగా నిర్ణయాలు తీసుకోగలిగేలా ఏర్పాటయ్యాయి. ఈ నేపథ్యంలో పాఠశాల విద్య రెగ్యులేటరీ, మానిటరింగ్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఆర్. కాంతారావు ప్రైవేట్ పాఠశాలల్లోని ఫీజులపై దృష్టిసారించారు. అందుకోసం అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులు, ప్రాంతీయ పాఠశాల విద్యా సంచాలకులు ఆయా జిల్లాల్లోని అన్ని ప్రైవేట్ పాఠశాలల ఫీజుల వివరాలు, ఆయా పాఠశాలల విద్యాశాఖ గుర్తింపు కోసం కరస్పాండెంట్లు సమర్పించిన రికార్డుల్లోని ఫీజుల వివరాలు అందజేయాలని ఆదేశించారు. ఇందుకు ఈ నెల 9ని గడువుగా నిర్దేశిస్తూ ఆదేశాలిచ్చారు. డీఈవోలు, ఎంఈవోలు ఈ వివరాలను ఇబ్రహీంపట్నంలోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని జస్టిస్ ఆర్. కాంతారావు ఆదేశించారు.

# పట్టుబడిన అవినీతి అక్కి'రాజు'

- ఏసీబీ వలలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్
- ఏకకాలంలో ఐదుచోట్ల సోదాలు
- రూ.80 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు
- ఉగాండాలోనూ బ్యాంక్ ఖాతా



**కర్నూలు బ్యూరో, ప్రభ న్యూస్:** మరో భారీ అవినీతి తిమింగలం అవినీతి నిరోధక శాఖ వలకు చిక్కింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్నాడన్న అభియోగంపై కర్నూలు ఆర్‌టిఓ కార్యాలయంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న అక్కిరాజు శివప్రసాద్ ఇంటిపై గురువారం కర్నూలు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈయనకు కర్నూలుతో పాటు బెంగుళూరు, హైదరాబాద్, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో అక్రమ ఆస్తులు ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు ఏకకాలంలో ఐదుచోట్ల దాడులు నిర్వహించారు. శివప్రసాద్ అక్రమ ఆస్తుల చిట్టాను వెలికి తీశారు. మార్కెట్ విలువ మేరకు పట్టుబడిన శివప్రసాద్ ఆస్తుల విలువ రూ.10కోట్లు కాగా, బహిరంగ మార్కెట్‌లో రూ.80 కోట్లకు పైగానే చేస్తుందని ఏసీబీ అధికారులు వెల్లడించారు. గత మూడు నెలల కాలంలో కర్నూలు జిల్లాలో అక్రమార్కులపై ఏసీబీ కొరడా ఝుళిపించగా, ఆర్‌టీఓ కార్యాలయంలో పనిచేస్తూ ఏసీబీకి పట్టుబడిన భారీ తిమింగలం శివప్రసాదే కావడం గమనార్హం. కర్నూలు జిల్లాలోని హైదరాబాద్, బెంగుళూరు జాతీయ రహదారిపై గల పంచలింగాల చెక్‌పోస్టులో అక్కిరాజు శివప్రసాద్ ప్రస్తుతం మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇతనికి ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న అభియోగంపై కర్నూలు కోర్టులో ఏసీబీ పిటిషన్ దాఖలుచేసి నగరంలోని డాక్టర్స్ కాలనీలో గల శివప్రసాద్ ఇంటిపై దాడులు నిర్వహించారు. ఈ దాడులకు ఏసీబీ డీఎస్పీ నాగభూషణం నేతృత్వం వహించగా ముగ్గురు సీఐల బృందంతో సిబ్బంది అతని ఇంటిలో సోదాలు నిర్వహించారు. ఇదే సమయంలో బెంగుళూరు, తాడిపత్రి, హైదరాబాద్‌లో గల శివప్రసాద్, అతని బంధువుల ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. మొత్తంగా ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాలలో ఆశ్చర్యకరమైన రీతిలో శివప్రసాద్ ఆస్తులు బహిర్గతం కాగా, ఇందులో బెంగుళూరులోని కార్తీక్‌నగర్ బస్టాప్ సమీపంలో జీప్లస్ 7, ఆక్సిట్రీ సర్వీస్ అపార్టుమెంట్ పేరుతో శివప్రసాద్ సొంతంగా బిల్డింగ్ నిర్వహించారు. డాక్యుమెంట్ విలువ ప్రకారం వీటి విలువ రూ.3కోట్ల వరకు ఉంటుంది. అలాగే బెంగుళూరులోని కుందాల్‌హల్లి వద్ద జీప్లస్ 1 ఇండిపెండెంట్ రేంజల్ హౌస్ ఉంది. డాక్యుమెంట్ విలువ ప్రకారం వీటి విలువ రూ. 2.7కోట్లు. 2017లో వీటిని కొనుగోలు చేసినట్లు ఏసీబీ విచారణలో బహిర్గతమైంది. అలాగే హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జయభేరిఆరెంజ్ ఆర్కేడ్‌లో ఏ103 ప్లాటు ఉంది. డాక్యుమెంట్ విలువ ప్రకారం వీటి విలువ రూ.1.2కోట్లు, ఇక గాజులరామారంలో ఒక ఎకరా భూమి ఉండగా, వీటి డాక్యుమెంట్ విలువ ప్రకారం రూ.కోటి వరకు చేస్తుంది. వీటితో పాటు ప్రస్తుతం శివప్రసాద్ నివాసం ఉన్న కర్నూలు డాక్టర్స్ కాలనీలో శ్రీ నిలయ అపార్టుమెంట్‌లో 403 నంబర్ గల విల్లాస్‌ను గుర్తించారు. వీటి విలువ రూ. కోటివరకు చేస్తుంది. వీటితో పాటు భార్య, పెద్ద కుమారుడు అఖిల్ పేరిట ఆక్సిట్రీ హోటల్, సిక్రిక్స్ సూట్‌కేసుల విక్రయ ప్రైవేటు సంస్థలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. మనీ ట్రాన్సాక్షన్ కోసం వీటిని నిర్వహిస్తున్నట్లుగా ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇక శివప్రసాద్ అతని కుటుంబ సభ్యుల పేరిట మొత్తం 11 అకౌంట్లు ఉండగా, ఇందులో ఒక బ్యాంకు అకౌంట్ దేశం సరిహద్దులు దాటి ఉగాండాలో ఉన్నట్లుగా గుర్తించారు. ప్రస్తుతం ఈ బ్యాంకు అకౌంట్‌లో గల వివరాలు తెలుసుకునేందుకు ఏసీబీ అధికారులు సంబంధిత బ్యాంకుకు మెయిల్ పెట్టినట్లు కూడా ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు. మెయిల్‌కు రిప్లై రావాల్సి ఉంది. వెరిఫై చేసిన తర్వాత ఉగాండా అకౌంట్‌లో ఎంతమేరకు ట్రాన్సాక్షన్స్ జరిగాయన్నది కూడా ఏసీబీ అధికారులు తేల్చనున్నారు. వీటితో పాటు శివప్రసాద్ ఇంటిలో రూ.3.5 లక్షల నగదుతో పాటు, 1.250 గ్రాముల బంగారం, డైమండ్ జ్యూవెలరీ లభ్యమైంది. డాక్యుమెంట్ మేరకు ఇప్పటివరకు అక్కిరాజు శివప్రసాద్ ఇళ్లల్లో గుర్తించిన ఆస్తుల విలువ రూ.10 కోట్లు కాగా, బహిరంగ మార్కెట్లో వీటి విలువ రూ.80కోట్లు చేస్తుందని, ఇక బ్యాంకు లాకర్‌లు, బంధువుల పేరుపై ఉన్న ఆస్తుల వివరాలను పూర్తిస్థాయిలో వెలికితీసిన అనంతరం ఇతని ఆస్తుల చిట్టా వివరాలు మరింత పెరగనున్నట్లు ఏసీబీ అధికారులు ప్రకటించారు. దాదాపు రూ.100 కోట్లకు దాటే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. మొత్తంగా గత మూడునెలల కాలంలో కర్నూలు జిల్లాలో అక్రమ ఆస్తులు కూడబెట్టిన ప్రభుత్వాధికారుల ఇళ్లపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించగా, ఇటీవల కాలంలో అత్యధిక ఆస్తులు కూడబెట్టిన భారీ తిమింగళం అక్కిరాజు శివప్రసాద్ కావడం గమనార్హం. రవాణాశాఖ పరిధిలో ఇంత భారీగా ఆస్తులు కూడబెట్టిన తిమింగలం దొరకడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

# రైళ్ళు కిట కిట!

- పోటెత్తుతున్న ప్రయాణికులు
- వచ్చీరాగానే నిండిపోతున్న రైళ్ళు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** దసరా పండుగను పురస్కరించుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు తమ సొంతూళ్ళకు బయలుదేరుతుండడంతో గత కొద్ది రోజులుగా రైళ్ళన్నీ కిటకిటలాడుతున్నాయి. దసరా పండుగ సందర్భంగా సెప్టెంబర్ 28 నుంచి ఈనెల 14 వరకు పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పండుగను తమ సొంతూళ్ళలో ఆనందంగా జరుపుకునేందుకు నగరవాసులు గ్రామాల బాట పట్టడంతో ఇటు రైళ్ళు, అటు బస్సులు కిటకిటలాడుతున్నాయి. సెప్టెంబర్ 29 నుంచే సికింద్రాబాద్ స్టేషన్‌కు ప్రయాణీకులు పోటెత్తుతుండడంతో ఏ రైలులో చూసినా జనం రద్దీనే కనిపిస్తోంది. రెండు రోజుల నుంచి సికింద్రాబాద్ స్టేషన్ నుంచి దాదాపు 1.80 లక్షల మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించారు. ఒక్క మంగళవారం రోజే సికింద్రాబాద్ స్టేషన్ నుంచే రెండు లక్షల మంది వివిధ రైళ్ళ ద్వారా తమ స్వస్థలాలకు తరలివెళ్ళినట్లు రైల్వేవర్గాలు వెల్లడించాయి. బుధవారం కూడా రద్దీ ఏ మాత్రం తగ్గలేదని తెలిపారు. అలాగే నాంపల్లి, కాచిగూడతో పాటు చర్లపల్లి, లాలాగూడ స్టేషన్ల నుంచి మరో 50వేల మంది ప్రయాణించినట్లు రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు.



## రిజర్వేషన్లు దొరక్క ఇబ్బందులు

దసరా పండుగను దృష్టిలో ఉంచుకుని సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్లలో ఆగే రైళ్ళ ద్వారా తమ స్వగ్రామాలకు వెళ్ళేందుకు కొంతమంది ముందస్తుగా టికెట్లను రిజర్వేషన్ చేసుకున్నారు. అయితే ఇందులో పలువురికి తాము ఎక్కాల్సిన రైలుకు టికెట్లు కన్‌ఫాం కాకపోవడంతో స్టేషన్లకు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సికింద్రాబాద్ నుంచి న్యూఢిల్లీకి వెళ్ళే తెలంగాణ ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్‌వైపు వెళ్ళే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ నుంచి ఆంధ్రావైపు వెళ్ళే గౌతమి, ఫలక్‌నుమా, శాతవాహన వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్ళలో సీట్లు కన్‌ఫాం కాకపోవడంతో ప్రయాణీకులు జనరల్ బోగీల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో జనరల్ బోగీలు కూడా ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి.

## బస్సులదీ ఇదే పరిస్థితి..

పండుగకు వెళ్ళే ప్రయాణీకుల రద్దీ రైళ్ళతో పాటు బస్సుల్లో కూడా కనిపిస్తోంది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈనెల 5 నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చిన తరుణంలో నగరానికి చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు ముందస్తుగా తమ ఊళ్ళకు బయలుదేరి వెళుతున్నారు. ఎంజీబీఎస్, జూబ్లీ బస్టేషన్ నుంచి మంగళవారం సుమారు 60వేల మంది వరకు దూరప్రాంతాలకు వెళ్ళినట్టు అధికారులు తెలిపారు. కాగా బస్సులు కిటకిటలాడుతుండడంతో ఆయా బస్టేషన్ల నుంచి చాలామంది రైల్వే స్టేషన్లకు పరుగులు తీస్తుండడంతో అక్కడ రద్దీ విపరీతంగా పెరిగిపోతుంది. కాగా పండుగ సందర్భంగా ఆర్టీసీ నగరం నుంచి వివిధ ప్రాంతాలకు 600 బస్సులు నడిపించగా, మరో 400 బస్సులను అందుబాటులో ఉంచింది. అయినప్పటికీ ఇవి ఏ మాత్రం సరిపోక పోవడంతో వందలాది మంది ప్రయాణికులు బస్సులో రామచంద్రా అంటూ అధికారులను ప్రాదేయపడుతున్నారు.

## రైళ్ళలో ఉయ్యాలలు

రైలు ప్రయాణాలకు సిద్ధమైన వారు కిక్కిరిసిన రైళ్ళలో ఎలాగోలా ఎక్కుతున్నారు. తర్వాత కూర్చోవడానికి కూడా స్థలం లేకపోవడం, నిలబడేందుకు వీలు కాకపోవడంతో కొంత మంది తమతో పాటు తెచ్చుకున్న దుప్పట్లు, చీరలను ఊయల మాదిరిగా కట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. రిజర్వేషన్ బోగీలతో పాటు సాధారణ బోగీలలోనూ ఈ తరహా పరిస్థితి నెలకొంది.

## బేఖాతరవుతున్న పోలీసుల హెచ్చరికలు

గమ్యం చేరాలన్న తొందరలో రైల్వే స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులు రైలు స్టేషన్‌కు చేరుకోక ముందే సీట్ల కోసం ఎగబడి ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. రైలు ప్లాట్‌ఫాంపైకి వచ్చిన క్షణాల్లోనే బోగీలన్నీ ప్రయాణికులతో కిక్కిరిసి పోతున్నాయి. సీట్ల కోసం ఎవరికి తోచిన విధంగా వారు కిటికీలు, ప్యాంట్రీ బోగీల నుంచి దూరిపోతున్నారు.

ఈ క్రమంలో కొంత మంది తోటి ప్రయాణికులు కింద పడటంతో స్వల్ప గాయాలకు గురవుతున్నారు. ఇలాంటివి చోటు చేసుకోకుండా ఉండేందుకు రైల్వే పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. రైలు ప్లాట్‌ఫాంపై ఆగిన తర్వాత ఎక్కాలని, తోటి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించరాదని పోలీసులు హెచ్చరిస్తున్నా పట్టించుకునే వారు లేరు. నడుస్తున్న రైలును ఎక్కడం వల్ల ప్రయాణికులు పొరపాటున రైలు కింద పడితే ప్రాణం పోతుందని, అయినప్పటికీ ప్రయాణికులెవరూ లెక్క చేయడం లేదని పోలీసులు వాపోతున్నారు. వీలైనంత మేర ప్లాట్‌ఫాంలపై ఎక్కువ మంది పోలీసులను ఉంచుతున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

# సీమలో పొంగని గంగ

- వర్షాలు, వరదలు వచ్చినా పెరగని భూగర్భ జలాలు
- సరాసరి 66 అడుగులకు వెళితేగాని అందని గ్రౌండ్ వాటర్



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఓ వైపు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో వైపు నదులు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. అయితే ఆశించిన స్థాయిలో మాత్రం భూగర్భ జలాలు పైకి ఉబకటం లేదు. ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో భూగర్భ జలాలు చాలా దారుణ స్థితిలో ఉన్నాయి. నాలుగు నెలల నుంచి ప్రతిరోజూ వర్షం పడుతున్నా.. ఇక్కడ మాత్రం భూగర్భ జలాలు పాతాళంలోనే ఉండిపోయాయి. ఇక కృష్ణా, గోదావరి, వంశధార, నాగవళి, పెన్నా, తదితర నదులు ప్రవహించే కోస్తా ప్రాంతంలోనూ భూగర్భ జలాల్లో గతేడాదితో పోల్చితే తగ్గుదల కనిపించింది. కనీసం గత ఏడాది ఉన్న స్థితిలో కూడా ఈ సంవత్సరం భూగర్భ జలాలు లేకపోవటం అటు పర్యావరణవేత్తలను, ఇటు రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

## 66 అడుగులకు వెళితేనే..

ప్రస్తుతం రాయలసీమ పరిధిలోని చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో సరాసరి 66 అడుగుల లోతుకు వెళితే గాని భూగర్భ జలం తగలటం లేదు. గతేడాది ఇదే సమయానికి (అక్టోబరు -3) 55 అడుగుల్లోపే ఈ ప్రాంతంలో నీరు తగిలింది. అయితే గతేడాదితో పోల్చుకుంటే ఈ సంవత్సరం పెద్దస్థాయిలో వర్షాలు పడినప్పటికీ భూగర్భ జలం పెరగకపోవటం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో 76 అడుగులు(గతేడాది -63 అడుగుల్లోనే), కడప జిల్లాలో 79 అడుగులు( గతేడాది -63 అడుగులు), అనంతపురం జిల్లాలో 77 అడుగులు(గతేడాది -67 అడుగులు), కర్నూలు జిల్లాలో 34 అడుగుల(గతేడాది- 35 అడుగులు)లో నీటి లభ్యత ఉంది. అలాగే ఈ నాలుగు జిల్లాల్లో మొత్తం 67,114 చ.కి.మీలలో భూగర్భ జలం విస్తరించి ఉంది. చిత్తూరులో 15,012 కి.మీ. మేర, కడపలో 15,354 కి.మీ, అనంతపురంలో 19,130 కి.మీ, కర్నూలులో 17,617 కి.మీల మేర భూగర్భ జలం విస్తరించి ఉంది.

## వర్షాలు పడినా..

ఈ ఏడాది రాయలసీమ జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఈ పరిధిలో సరాసరి మొత్తం 421.95 మి.మీ వర్షపాతం నమోదైంది. చిత్తూరు జిల్లాలో 511.71మి.మీ వర్షపాతం పడింది. ఇక్కడ సాధారణం కంటే 11 శాతం అదనంగా వర్షం పడింది. కడప జిల్లాలో 365మి.మీ, అనంతపురం జిల్లాలో 347 మి.మీ, కర్నూలు జిల్లాలో 476మి.మీ వర్షపాతం నమోదైంది. అయినప్పటికీ భూగర్భ జలం పెరగలేదు. కాగా భూగర్భ జలాలు పెంచేందుకు నీరు-చెట్టు పథకం ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు గత ప్రభుత్వం పేర్కొంది. నీటి కుంటలు, ఫామ్ పాండ్స్, చెరువుల తవ్వకాలు కూడా అనేకం చేపట్టామని అప్పటి ప్రభుత్వ అధికారులు కూడా స్పష్టం చేశారు. ఈ రాయలసీమ ప్రాంతంలో ప్రస్తుతం భూగర్భ జలాలు పెరగకపోగా.. ఇంకా తగ్గిపోవటం కాస్త ఆందోళనకు గురిచేస్తున్న అంశంగా ఉంది.

## కోస్తా ప్రాంతంలోనూ తగ్గుదల

రాయలసీమ ప్రాంతంలో భూగర్భ నీటిమట్టం పాతాళానికి చేరుకోగా.. కోస్తా జిల్లాల్లో ఫర్వాలేదనిపించే విధంగా ఉంది. గతేడాదితో పోల్చుకుంటే ఇక్కడ కూడా సరాసరి ఒక అడుగు నీటిమట్టం తగ్గింది. గతేడాది కోస్తా ప్రాంతంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సరాసరి 33.72 అడుగుల్లో నీటి లభ్యత ఉండగా.. ఈ సంవత్సరం 34.48 అడుగుల్లో భూగర్భ జలం లభ్యమవుతోంది. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో 10.56 అడుగులు (3.22మీ)లలో నీటి లభ్యత ఉంది. విజయనగరంలో 15 అడుగుల లోతులో (4.81మీ) భూగర్భ జలం దొరుకుతోంది. విశాఖ జిల్లాలో 20 అడుగుల్లో (6.11మీ), తూర్పుగోదావరిలో 22 అడుగుల్లో (6.91), పశ్చిమగోదావరి జిల్లాలో 57 అడుగుల్లో(17.41మీ), కృష్ణా జిల్లాలో 28 అడుగుల్లో (8.69మీ), గుంటూరులో 25 అడుగుల్లో (7.77మీ), ప్రకాశం జిల్లాలో 58 అడుగుల్లో (17.75మీ), నెల్లూరు జిల్లాలో 43 అడుగుల లోతులో (13.27మీ) భూగర్భ జలం అందుతోంది. కోస్తాలోని ఈ తొమ్మిది జిల్లాల్లో మొత్తం 95,984 చ.కి.మీ మేర భూగర్భ జలం ఉంది.

# ఇది అరాచక రాజ్యం

- సోషల్ మీడియా ద్వారా విషప్రచారం
- అక్రమ కేసులు.. అరెస్టులు
- అణచివేతలను ఎదుర్కొంటాం



**అమరావతి, ఆంధ్రప్రభ:** 'ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డీ ఇది పులివెందుల కాదు.. నీ దౌర్జన్యాలను ఇకపై సాగనివ్వమంటూ' మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు రెచ్చిపోయారు. పోలీసులను అడ్డుపెట్టుకుని కేసులు పెట్టి వేధిస్తుంటే సహించేది లేదని ధ్వజమెత్తారు. గుంటూరులోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పాశవికంగా వ్యవహరిస్తోంది.. అణచివేత ధోరణులను అవలంబిస్తోంది.. ఎంత కర్కశంగా అణచివేయాలని చూస్తే అంతకన్నా వేగంగా పోరాడతామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్న నెపంతో అనేకమంది తెలుగుదేశం కార్యకర్తలను, నాయకులను కేసులు పెట్టి జైళ్లల్లో నెడుతున్నారు. అసలు ఏ సెక్షన్ల కింద కేసులు పెట్టి జైళ్లకు పంపిస్తున్నారో పోలీసులు చెప్పాలన్నారు. సోషల్ మీడియాలో వైకాపా ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందో అందరికీ తెలుసన్నారు. ఈ సందర్భంగా వైకాపా సోషల్ మీడియాలో తమకు వ్యతిరేకంగా పెట్టిన పోస్టులను చంద్రబాబు మీడియాకు ప్రజంటేషన్ ఇచ్చారు. పార్టీలో పనిచేసే మహిళలనూ, బాధిత మహిళలను కూడా వదిలిపెట్టకుండా అత్యంత అసభ్యంగా పోస్టులు పెడుతున్న వైకాపా కార్యకర్తలపై పోలీసులు ఎందుకు కేసులు పెట్టటం లేదన్నారు.

సోషల్ మీడియాలో పెట్టే పోస్టులపై తమకొక చట్టం, అధికారపార్టీకి మరో చట్టం ఉన్నాయా అని చంద్రబాబు ప్రశ్నించారు. దీనికి పోలీసులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని సైతం యధేచ్ఛగా ఉల్లంఘిస్తోంది. చట్టాలను కాలరాస్తున్నారు.. వ్యవస్థలన్నీ కుప్పకూలిపోతున్నాయి. ప్రజలకు రక్షణ లేకుండాపోతోంది. '14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా ఉన్నాను.. సుదీర్ఘకాలం ప్రతిపక్షంలో ఉన్నాను.. ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశాను.. ఇంతటి అరాచకాలనూ, దౌర్జన్యాలను నా రాజకీయ జీవితంలోనే చూడలేదంటూ' చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజలు ఛీ కొడుతున్నారనీ, అసహ్యించుకుంటున్నారన్న సంగతిని ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలన్నారు.

## మీ ఇళ్లల్లో మహిళలు లేరా..

టీడీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి, విజయవాడ నగర పాలక సంస్థ మాజీ మేయర్ పంచుమర్తి అనూరాధపై అసభ్యకరంగా పోస్టులు పెట్టారు. అయినాసరే, పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా చంద్రబాబు డీజీపీ, ముఖ్యమంత్రిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'మీ ఇళ్లలో మహిళలకు ఇలాగే జరిగితే మీరు ఊరుకుంటారా.. మీ ఇళ్ళల్లో ఆడవారు లేరా' అని మండిపడ్డారు. ఆ తరువాత అనూరాధను వేదిక మీదకు పిలిచి మాట్లాడించారు. తన ఆత్మగౌరవానికి భంగం కలిగేలా అత్యంత అసభ్యకరీతిలో వైకాపా సోషల్ మీడియాలో పోస్టులు వస్తున్నాయని అన్నారు. ఆ తరువాత మళ్ళీ చంద్రబాబు మాట్లాడుతూ జనవనరుల శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌ను కులం పేరుతో తిట్టారని టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి రాజమండ్రి జైలుకు పంపించారని ఆరోపించారు. లోకేష్‌పై కూడా కేసులు పెడుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో టీడీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తన వ్యక్తిత్వాన్ని కూడా దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్నారని కొన్ని పోస్టులను తెరపై చూపించారు. వైకాపా బరితెగింపునకు అడ్డూ అదుపూ లేకుండాపోతోందన్నారు. బద్ధ శత్రువులు సైతం తన వ్యక్తిత్వాన్ని వేలెత్తి చూపలేదన్నారు. 43 వేలకోట్ల రూపాయలు దోచుకున్న దొంగ రాజ్యం చేస్తున్నాడన్నారు. తన ఇల్లును ముంచటానికి వరద తీసుకొచ్చి లంకను ముంచారనీ, ఆ రైతులకు ఇప్పటిదాకా ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇవ్వలేదని చంద్రబాబు మండిపడ్డారు.

# గ్రామీణ విద్యుత్‌కు రూ.521 కోట్లు మంజూరు

- సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలోడును మెరుగుపర్చడం, లో ఓల్టేజీ సమస్యను అధిగమించేందుకు దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన పథకం కింద చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన పథకంపై రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం సీఎస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ ఎల్వీ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో మెరుగుదలకు ఏపీ ప్రాజెక్టులకు ఎంత మేరకు పెట్టుబడులు పెడుతున్నాము.. వాటి ద్వారా ఎంత మేరకు ఫలితాలు వస్తున్నాయనే దానిని దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రాజెక్టులను నిర్ణీత గడువు ప్రకారం సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మంచి ప్రయోజనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పలానా ప్రాజెక్టు పూర్తయిన పిదప విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని వినియోగదారులు స్టెబిలైజర్లు పెట్టుకోవాల్సిన అవసరం లేదని ఖచ్చితంగా హామీ ఇచ్చే రీతిలో వివిధ విద్యుత్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీఎస్ స్పష్టం చేశారు.

అదే విధంగా నూతనంగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే వారికి ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించి పూర్తి భరోసాను ఇచ్చే విధంగా విద్యుత్ శాఖ అధికారులు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని అన్నారు. అంతేగాక కాస్ట్ బెనిఫిట్ రేషియోను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఏ ప్రాజెక్టు చేపట్టడం ద్వారా ఎంతవరకు ప్రయోజనం కలుగుతుందో పూర్తిగా అవగాహన కలిగించాలని సీఎస్ సుబ్రహ్మణ్యం ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు. కాగా రాష్ట్రంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన పథకం అమలుకు సంబంధించి రూ.521.54 కోట్లు మంజూరయిందని సీఎస్ ఎల్వీ వెల్లడించారు. గ్రామీణ విద్యుద్దీకరణ, నాన్ ఆర్ఇ కాంపోనెంట్ కేంద్ర విద్యుత్ ఉపకేంద్రాలు, డిటిఆర్ మీటర్లు, హెచ్వీడీఎస్ తదితర పనులకు ఇప్పటికి రూ.404 కోట్లు ఖర్చు చేయగా మిగతా రూ.117.54 కోట్లు ఖర్చు చేసేందుకు ఈ సమావేశంలో ఆమోదం తెలిపారు. ఈ పథఖం ఏపీఎస్పీడీసీఎల్ పరిధి కింద 8 జిల్లాల్లో అదనంగా 33/11 కెవి సామర్థ్యంతో కూడిన 66 ఉపవిద్యుత్ కేంద్రాలు ఏర్పాటు ద్వారా విద్యుత్ లోడ్ సామర్థ్యాన్ని పెంచడంలో ఓల్టేజీ సమస్యను తగ్గించడం వంటి చర్యలు చేపడుతున్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఇంధన శాఖ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్, ఏపిఇపిడీసిఎల్ డైరెక్టర్ ప్రాజెక్ట్స్ రాజబాపయ్య, ఏపి ఎస్పిడీసిఎల్ డైరెక్టర్ టెక్నికల్ టి.వనజ, ఆర్ఇసి ప్రతినిధి వెంకటేష్, అటవీ శాఖ ప్రత్యేక కార్యదర్శి డా.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం దుకాణాల నుంచి 'జె'ట్యాక్స్

- డిస్టిల్లరీల నుంచి కోట్లు దండుకుంటున్న వైసీపీ
- ఆరోపించిన మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో మద్యాన్ని విచ్చలవిడిగా పారిస్తూ ప్రతి బాటిల్‌పై 'జె' ట్యాక్స్ వసూలు చేస్తున్నారని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ నాయకుడు కొల్లు రవీంద్ర ఆరోపించారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం నూతన పాలసీ పేరుతో ప్రభుత్వమే గుడులు, బడులు, నివాసాల మధ్య మద్యం దుకాణాలు తెరవటం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారం 20 శాతం తగ్గిస్తే రాష్ట్రంలో 2,800 దుకాణాలు మాత్రమే ఉండాలన్నారు. 3,500 షాపులకు పరిమితం చేశామని ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందన్నారు. ప్రభుత్వం ఒక్క దుకాణాన్ని తగ్గించకపోగా అన్ని మద్యం బ్రాండ్లపై ధరలు పెంచటం ద్వారా డిస్టిలరీల నుంచి కోట్ల రూపాయలు దండుకుంటుందన్నారు. చీప్ లిక్కర్, ఇతర తక్కువస్థాయి మద్యం ధరలను పెంచి ప్రతి బాటిల్‌పై అనధికారికంగా 'జె' ట్యాక్స్ రాబడుతున్నారని ఆరోపించారు.

# పవన్ మద్దతు కోరతాం

- హుజూర్‌నగర్ ఉపఎన్నికపై మాజీ ఎంపీ వీహెచ్

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** హుజూర్ నగర్ ఉప ఎన్నికలపై తాము తప్పక గెలుస్తామని గతంలో ప్రగల్బాలు పలికిన కేసీఆర్ ఇప్పుడు ఓడిపోతామనే భయంతో సీపీఐ మద్దతు తీసుకున్నారని కాంగ్రెస్ మాజీ ఎంపీ వి.హనుమంతరావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిన్న మొన్నటి వరకు కాంగ్రెస్ కంటే సీపీఐ నేతలే ఎక్కువగా విమర్శించారని ఢిల్లీలోని తెలంగాణా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన గుర్తు చేశారు. తెలంగాణా ప్రజలు సమయం వచ్చినప్పుడు సీపీఐని చీ కొడతారని వీహెచ్ జోస్యం చెప్పారు. హుజూర్ నగర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి తప్ప కుండా గెలుస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ యురేనియం తవ్వకాలపై స్పందించడంపై అభినందనలు తెలిపారు. పవన్ పద్మావతి గెలుపునకు సహకరించాలని వీహెచ్ కోరారు. కాంగ్రెస్ పార్టీ తరఫున తాను వెళ్లి పవన్ కళ్యాణ్ మద్దతు కోరతానని, పద్మావతికి పవన్ కళ్యాణ్‌కు మద్దతిస్తే బాగుంటుందని వి.హనుమంతరావు అభిప్రాయపడ్డారు.

# రెండురోజుల పాటు వర్షాలే

- రాయలసీమ, కోస్తాకు వర్షసూచన

**అమరావతి, ఆంధ్రప్రభ:** మరి కొద్దిరోజుల్లో రుతుపవనాల తిరోగమనం ప్రారంభం అవుతున్న తరుణంలో మళ్లీ రెండు తెలుగు రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తనున్నాయా..? అంటే అవుననే అంటున్నారు వాతావరణశాఖ నిపుణులు. ఈ నెల 5వ తేదీ తర్వాత నైరుతి రుతుపవనాలు తిరోగమనం చెందనున్నాయి. గతంతో పోలిస్తే రుతుపవనాల ప్రారంభంలో వర్షపాతం అంతగా లేకున్నా రుతుపవనాలు వెనక్కు వెళ్లే క్రమంలో వర్షాలు జోరందుకున్నాయి. కొద్దిరోజుల క్రితం ఏపీ, తెలంగాణా జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురిశాయి. గురువారం సాయంత్రం అయితే రంగారెడ్డి జిల్లా, నల్గొండ జిల్లాలో భారీ వర్షం కురిసింది. ఇక రానున్న రెండురోజుల్లో రాయలసీమ, కోస్తా జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. వాతావరణ హెచ్చరిక కేంద్రం తాజా బులెటిన్‌లో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని 12 రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఒడిశా, ఉత్తరాఖండ్, జార్ఖండ్, పంజాబ్, బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సోం రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలతో పాటు కొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని బులెటిన్‌లో పేర్కొన్నారు. రాయలసీమ జిల్లాల్లో కొన్నింటిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# ఆదుకుంటాం.. చేయూతనిస్తాం

- బోటు ప్రమాద బాధిత కుటుంబాలతో మంత్రి శ్రీనివాసరావు
- రూ.90 లక్షల పరిహారం చెక్కుల పంపిణీ సభలో ప్రకటన



**విశాఖపట్నం, ప్రభన్యూస్:** పాపి కొండలలో గోదావరి నదిలో ఇటీవల సంభవించిన బోటు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబీకులను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర యువజన, పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఎం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. బోటు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు గురువారం విశాఖపట్నంలోని ప్రభుత్వ అతిథి గృహంలో రూ.90 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు చెందిన వారికి ఇల్లు, ఉద్యోగం లేని వారికి వాటిని కల్పిస్తామని వెల్లడించారు. మృతులు అందరికీ బీమా మొత్తం త్వరలోనే అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు. గత నెలలో నదిలో జరిగిన బోటు ప్రమాదంలో విశాఖపట్నం జిల్లాకు చెందిన 17 మంది ప్రయాణికులు గల్లంతయ్యారని, వీరిలో తొమ్మిది మంది మృతులకు ఒక్కొక్కరికి పది లక్షల రూపాయల చొప్పున వారి కుటుంబీకులకు చెల్లిస్తున్నట్లుగా మంత్రి ఎం. శ్రీనివాసరావు వెల్లడించారు. ఇప్పటి వరకూ పదమూడు మంది మృత దేహాలను గుర్తు పట్టగా మరో నలుగురి మృతదేహాలు ఇంకా లభించలేదని వెల్లడించారు.

జరిగిన ప్రమాదం ఉదంతంపై అయిదుగురు ఐఏఎస్ అధికారులతో కూడిన కమిటీని ప్రభుత్వం నియమించిందన్నారు. అనకాపల్లి మండలానికి చెందిన ముగ్గురు, పెందుర్తి మండలంకు చెందిన మరొకరు, గోపాలపట్నంకు చెందిన ఒకరు, మహారాణి పేటకు చెందిన ఇద్దరు మృతులకు చెందిన వారి తరపున వారి కుటుంబీకులు ఈ చెక్‌లను అందుకున్నారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్, కలెక్టర్ వి. వినయ్ చంద్, ఎం.ఎల్.ఎలు గుడివాడ అమర్‌నాథ్, కరణం ధర్మశ్రీ, అన్నంరెడ్డి అదీప్ రాజ్, తిప్పల నాగిరెడ్డి, ఆర్డీవో పెంచల కిశోర్, తాసిల్దార్ పి. రామారావు, వైఎస్‌వివి ప్రసాద్‌రావు, బీవీ రాణి, అప్పలరాజు తదితరులు భాగమయ్యారు.

# ఆలయ పాలక మండళ్లలో చోటుకు నేతలు రె'ఢీ'!



- తలలు పట్టుకుంటున్న ప్రజాప్రతినిధులు

**అమరావతి, ఆంధ్రప్రభ:** 'ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేస్తున్నాము. ఎన్నికల ముందు.. తర్వాత పార్టీలో చేరిన వారికి ఆలయ పాలక మండళ్లలో ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మాకు ఇవ్వండి. లేకుంటే కార్యకర్తలు.. ప్రజల ఎదుట తలెత్తుకోలేము' అంటూ పలువురు ద్వితీయశ్రేణి నేతలు ఎమ్మెల్యేలు, మంత్రులపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు తెలుస్తోంది. నెలాఖరులోగా దేవాలయాల పాలక మండళ్ల భర్తీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో పట్టు కోసం పలువురు నేతలు పోటీ పడుతున్నారు. ఆలయాల పాలక మండళ్ల నియామకానికి వ్యవధి తక్కువ ఉండటంతో ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ వీరంతా ప్రదిక్షణలు చేస్తున్నారు. రాష్ట్రంలో రూ.5 నుంచి రూ.20 కోట్ల మధ్య వార్షిక ఆదాయం ఉన్న మూడు ఆలయాలతో పాటు రూ.5కోట్ల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఆలయాల పాలక మండళ్ల నియామకానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్లు జారీ చేసింది. మరో 10 ప్రముఖ ఆలయాల పాలక మండళ్ల కాలపరిమితి ముగియడంతో ట్రస్టు బోర్డులు రద్దు చేస్తూ ప్రభుత్వపరంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవాలయమైన శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం, శ్రీశైలంలోని భ్రమరాంభ మల్లేశ్వరస్వామి ఆలయాల విషయంలో ప్రభుత్వ వైఖరి ఇంకా స్పష్టం కాలేదు. వీటికి సంబంధించి కూడా ప్రభుత్వపరంగా త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలోని ఆలయాల పాలక మండళ్ల నియామకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతం ఇవ్వనున్నట్లు ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. మొత్తం పాలక మండలి సభ్యుల్లో మహిళలు 50 శాతం ఉండాల్సిందే నంటూ సీఎం తేటతెల్లం చేసిన నేపథ్యంలో అధికారులు ఆ దిశగా చర్యలు ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మహిళల కోటాతో తమకు అన్యాయం జరుగుతుందనే ఆందోళన కొందరి నేతల్లో నెలకొంది. తాము వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని సీఎం చేసేందుకు క్షేత్రస్థాయిలో చేసిన సేవలను గుర్తించాలనే డిమాండ్‌ను పలువురు నేతలు మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద వ్యక్తం చేస్తున్నారు. పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేసిన తమకు ఇప్పుడు రిజర్వేషన్ల వలన గండిపడితే ఎలా గనేది వీరి ప్రశ్న. ఇంత కాలం పనిచేసి కనీసం ఆలయాల పాలక మండళ్లలో కూడా చోటు లేకుంటే స్థానికంగా తమను ఎవరు గుర్తిస్తారంటూ వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రానున్న లోకల్ బాడీ ఎన్నికల్లో తాము ప్రజల వద్దకు వెళ్లడం ఇబ్బందిగా ఉంటుందనే అభిప్రాయాన్ని వీరు వ్యక్తం చేస్తుండటంతో ప్రజాప్రతినిధులకు పాలుపోవడం లేదు. నియామకాల్లో తమ పాత్ర ఎంత వరకు ఉంటుందో తెలియని స్థితిలో పదవులు ఆశిస్తున్న వారికి హామీ ఇవ్వలేని స్థితి నెలకొంది. పైగా నామినేటెడ్ పదవుల విషయంలో ఇప్పటికే ఓ సామాజిక వర్గంపై విమర్శలు వెల్లు ఎత్తుతున్న నేపథ్యంలో రానున్న పరిస్థితులను అధిగమించడమెలా? అనే దానిపై ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు.



# గర్భిణీలకు పోషకాహారం

• మార్పులు చేర్పులపై నివేదిక ఇవ్వండి • అవసరమనుకుంటే నగదు బదిలీ చేద్దాం • విద్య, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి జగన్

**అమరావతి, ఆంధ్రప్రభ:** స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా రాష్ట్రంలో ప్రస్తుతం గర్భిణీలు, పిల్లల తల్లులు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని మరింత బలవర్ధకంగా అందించేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం విద్య, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రస్తుతం అందిస్తున్న పోషకాహారాన్ని, అందులో తీసుకురావాల్సిన మార్పులను అధికారులు పరిశీలించి నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. అవసరమైతే వీరికి నగదు బదిలీ చేసేలా కూడా పరిశీలన చేయాలని చెప్పారు. ఆరోగ్యవంతమైన తల్లులు, పిల్లలు ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని పూర్తి స్థాయిలో నివారించాలని సూచించారు. వీటన్నింటిపైన ప్రతిపాదనలు తయారు చేసి తమకు అందించాలని ఆదేశించారు.

### మార్చి నాటికి పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన ఆరా తీశారు. నవంబరు నుండి పాఠశాలల్లో పనులు ప్రారంభించి మార్చినాటికి వాటిని పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మొదటి దశలో సుమారు 15 వేలకు పైగా పాఠశాలలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పాఠశాలలకు ప్రస్తుతం ఇస్తున్న మౌలిక సదుపాయాలు, పరికరాలు అన్నీ కూడా నాణ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సౌకర్యాల కల్పనలో ఏ ఇతర పాఠశాలలకు తీసిపోని విధంగా ఉండాలని చెప్పారు. అవసరమైతే రూ. 10 ఎక్కువైనా సరే సౌకర్యాల కల్పనలో రాజీపడొద్దని ఆదేశించారు. అనుకున్న ప్రకారం వచ్చే ఏడాది పాఠశాలలు ప్రారంభం అయ్యేనాటికి పాఠశాలల యూనిఫామ్స్, పుస్తకాలు అందించాలని సీఎం ఆదేశించారు.

### మధ్యాహ్న భోజన నాణ్యత పెంచండి

మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతను పెంచాలని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో మరో 65 సెంట్రలైజ్‌డ్ కిచెన్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. మధ్యాహ్న భోజనంలో పిల్లలకు ప్రత్యేకమైన వంటకం ఇవ్వడంపై కూడా అధికారులతో ఆయన చర్చించారు. ఈ అంశంపై ప్రతిపాదనలు తయారుచేసి ఇవ్వాలని చెప్పారు.

# నేడు దుర్గమ్మకు జగన్ పట్టువస్త్రాలు

## అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రోత్సవాల్లో అయిదవరోజైన గురువారం అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. ఈ క్రమంలో భక్తులు భారీస్థాయిలో దుర్గమ్మ దర్శనానికి విచ్చేశారు. మొత్తం 90వేల మంది అమ్మ దర్శనం నిమిత్తం వచ్చారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమా, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా ఈ గురువారం సాయంత్రం 6గం. సమయానికి రూ. 28లక్షల ఆదాయం వచ్చింది. రూ. 300ల టికెట్ల విక్రయాలపై రూ. 9లక్షలు, రూ. 100 టికెట్ల విక్రయాలపై రూ. 5లక్షలు, లడ్డూ ప్రసాదంపై రూ. 8లక్షల ఆదాయం వచ్చింది. అలాగే 11వేల మందికి అన్నదానం చేశారు. 1260 కేజీల ఉచిత ప్రసాదాన్ని వితరణ చేశారు.

### సీఎం జగన్ రాకతో ప్రత్యేక ఏర్పాట్లు

శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకోబోతున్నారు. నేటి సాయంత్రం ఆరుగంటల నుంచి మూల నక్షత్రం ఘడియలు ప్రారంభం కానుండటంతో ఆయన అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, దర్శనం చేసుకోనున్నారు. ఈ సందర్భంగా దుర్గ



గుడిపై భద్రతాపరంగా అధికార, యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వీఐపీ క్యూలైన్లను నిలిపివేయనున్నారు. మధ్యాహ్నం 2.30ని.లకు ఘాట్‌రోడ్‌పైకి ఏవిధమైన వాహనాలను అనుమతించరు. అయితే సాధారణ, రూ. 100 టికెట్ క్యూలైన్లు యథావిధిగా నడుస్తాయి. ప్రకాశం బ్యారేజీ పై నుంచి నేరుగా సీఎం జగన్ ఘాట్‌రోడ్‌లోని ఓంకారం వద్దకు వస్తారు. అక్కడ ఆయనకు మంత్రులు, ఆలయాధికారులు స్వాగతం పలకనున్నారు.

# ముందుగానే పంట ధర



(మొదటిపేజీ తరువాయి)

పనిచేయాలని చెప్పారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మార్కెటింగ్, సహకార శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ, మార్కెటింగ్‌లో మనం అనుసరించే విధానాలు రైతుల ప్రయోజనమే లక్ష్యంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. గ్రామ సచివాలయాల్లోనే ఈ పంట వివరాలు, ధరలు ప్రకటించాలని చెప్పారు. రైతులకు నేరుగా కాల్‌చేసి సహాయం అడిగే అవకాశం ఉండాలన్నారు. దీనివల్ల ప్రైవేటు వ్యక్తులు కూడా మంచి ధరలకు రైతులనుండి కొనుగోలు చేస్తారని చెప్పారు. ఈ-క్రాప్ నమోదుపై వాలంటీర్ల ద్వారా రైతులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. గ్రామ సచివాలయాల్లో డిస్‌ప్లే బోర్డులు తప్పని సరిగా ఉండాలన్నారు. కనీస మద్దతు ధర లేని పంటలకు ధరలు ప్రకటించాలని సూచించారు. రైతులకు నష్టం రాకుండా ఉండేలా ఈ ధరలు నిర్ణయించాలని చెప్పారు. కందులు, మినుములు, పెసలు, శెనగలు, టమోటా, పత్తి పంటలకు భవిష్యత్తు ధరలు ఎలా ఉంటాయోన్న దానిపై ముఖ్యమంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ధరల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకున్న తరువాత పరిస్థితి కచ్చితంగా మారాలన్నారు. రైతులకు కచ్చితంగా భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఆ బాధ్యత మనదేనని గుర్తెరగాలన్నారు. క్షేత్రస్థాయి వరకు అది జరిగితీరాల్సిందేనని స్పష్టం చేశారు.

జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నష్టాలపై అధ్యయనానికి ఒక కమిటీ వేయాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులకు, సహకార బ్యాంకులకు మధ్య విడదీయరాని బంధం ఉందన్నారు. ఈ బ్యాంకులు రైతుల సొంత బ్యాంకులుగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఆర్థిక పరిపుష్టిని కోల్పోయిన ఈ బ్యాంకులకు పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా ఈ ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. అందులో భాగంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను తిరిగి బలోపేతం చేయడంపై కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న సమస్యలు, దీన్ని పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర ప్రణాళిక తయారు చేయాలన్నారు. అవినీతి, పక్షపాతానికి తావులేని విధానం ఉండే విధంగా ఈ ప్రణాళిక రూపొందించాలని చెప్పారు.

### ధరల స్థిరీకరణ, మార్కెట్‌లలో ప్రభుత్వ జోక్యం

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉల్లి ధరలు పెరిగిన నేపథ్యంలో ఇప్పటికే 85 శాతం రైతు బజార్లలో రూ. 25కే కిలో ఉల్లిపాయలు విక్రయించేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఇందుకుగానూ 660 మెట్రిక్ టన్నులు వినియోగదారులకు ఇచ్చినట్లు వారు చెప్పారు. రూ. 32కే కిలో ఉల్లి ధరను అదుపు చేయగలి గామన్నారు. మళ్లీ ధరలు పెరిగిన క్రమంలో ఆదుకోవడానికి కూడా ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. రాష్ట్రం లో ఇప్పుడు సరిపడా ఉల్లి నిల్వలు ఉన్నాయని చెప్పారు. టమోటా రైతులను కూడా ఆదుకోవడం జరిగిందని వివరించారు. కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో మార్కెటింగ్ అవకాశాలు చూసి ఆ మేరకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు.

సహకార రంగాన్ని పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరించాలని, అందుకు ఏమేమి అవసరమో అవన్నీ చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను కంప్యూటీకరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిష్టాత్మక సంస్థతో సమగ్ర పరిశీలన, అధ్యయనం చేయాలన్నారు. అలాగే ఆప్కో పునరుద్ధరణ, బలోపేతానికి కూడా అధ్యయనం చేయాలని ఆదేశించారు. నిర్ణీత కాలవ్యవధి లోగా ఈ ప్రక్రియ పూర్తి కావాలని చెప్పారు. ఆరు నెలల కాలంలో మొత్తం అధ్యయనం, సిఫార్సుల అమలు కావాలని సూచించారు.

### గోడౌన్లు, శీతల గిడ్డంగులపై సమగ్ర పరిశీలన అవసరం

వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకోసం ఇప్పుడున్న గోడౌన్లు, కోల్డు స్టోరేజీలపై సమగ్ర పరిశీలన జరగాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న అవసరాలు, వాటిని తీర్చేలా గోడౌన్లు, కోల్డు స్టోరేజీలపై కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. చేపలు, రొయ్యలు, ఇతర సముద్ర ఉత్పత్తుల కోసం కూడా ఎన్ని కోల్డు స్టోరేజీలు ఉండాలన్న దానిపై కార్యాచరణ తప్పనిసరి అన్నారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఆలోచనలు చేయాలని చెప్పారు.

### చిరుధాన్యాల హబ్‌గా రాయలసీమ

రాయలసీమ ప్రాంతాన్ని చిరుధాన్యాల హబ్‌గా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. 9 నెలలపాటు గ్రీన్ కవర్ ఉండేలా చూడాలని చెప్పారు. చిరుధాన్యాల బోర్డులో కూడా నిపుణులకు పెద్దపీట వేసి మంచి ఫలితాలు వచ్చేలా ప్రణాళికలు రూపొందించి వాటిని పకడ్బందీగా అమలుపర్చాలని సూచించారు. వ్యవసాయ విధానాలు, మార్కెటింగ్, ప్రాసెసింగ్ అన్నీ బోర్డు పరిధిలో ఉండాలన్నారు. చిరుధాన్యాల బోర్డు విధివిధానాలపై సమావేశంలో చర్చ, అక్టోబరు చివరి నాటికి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

### మార్కెటింగ్ కమిటీల ఏర్పాటు పూర్తి చేయండి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి జగన్ అధికారులను ఆదేశించారు. ఇందులో ఛైర్మన్ పదవుల్లో 50 శాతం మహిళలకు అవకాశం కల్పించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మూడు మార్గాల్లో వ్యవసాయ ఉత్పత్తులు, వాటికున్న డిమాండ్, వివిధ ప్రాంతాల్లో ధరలపై ఎప్పటి కప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. ఇప్పు డున్న అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలు, అగ్రివాచ్‌తో సహా మరో ఏజెఈ ఏర్పాటుకు గతసమీక్షలో తీసుకున్న నిర్ణయం ప్రతిపాదనలపై అధికారులను ఆరా తీశారు.

వ్యవసాయ ఉత్పత్తుల భవిష్యత్ ధరలు, బిజినెస్ కన్సల్టెన్సీ, ధరల స్థిరీకరణ నిధి నిర్వహణ, వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువ జోడించడం ఈ ఏజెన్సీ విధులుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి అధికారులకు సూచించారు. ఇందులో నిపుణుల కమిటీ కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పప్పు ధాన్యాల కొనుగోలు కేంద్రాలపై కూడా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆరా తీశారు. అన్ని ఆరుతడి పంటల వివరాలను ఆన్‌లైన్‌లో రైతులు నమోదు చేసుకోవాలని అధికారులు ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఆరుతడి పంటలపై అక్టోబరు 10 నుండి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఏర్పాట్లు చేశామని అధికారులు సీఎంకు వివరించారు. అక్టోబరు 15 నుండి కొనుగోలు ప్రారంభిస్తామని సీఎంకు తెలిపారు.

# జీఎస్టీ... పల్టీ! నకిలీ మకిలీ!!

(మొదటిపేజీ తరువాయి)

నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌లు వెయ్యికి పైగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. లెక్కలలోకి రాకుండా, రికార్డులలో నమోదు కాకుండా వుండే నకిలీ రిజిస్ట్రేషన్‌లు రాష్ట్రవ్యాప్తంగా వేలసంఖ్యలో ఉన్నాయనడంలో సందేహం లేదు. వీటివల్ల ఇప్పటికే వేలాది కోట్ల రూపాయల ప్రభుత్వాదాయానికి గండి పడింది.

బ్యాంకులో రుణాలు ఇప్పిస్తామని అందుకవసరమైన ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు స్టేట్ మెంట్‌లను ఇవ్వాలని ఇటీవల కొంతమంది ప్రకటనలు చేశారు. దానికి స్పందించి పెద్దసంఖ్యలో రుణాల కోసం వందలాది మంది దరఖాస్తు చేశారు. అయితే, ఆ తర్వాత మోసం జరిగిందంటూ వీరిలో కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా ఒంగోలు పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. వారంతా దరఖాస్తుదారుల నుంచి సేకరించిన ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు స్టేట్ మెంట్‌లను నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌లకు వినియోగిస్తున్నట్లు ఒంగోలు పోలీసులు గుర్తించారు. దీంతో ఒంగోలు పోలీస్‌లు సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించారు. కొద్ది రోజుల క్రితం ఒంగోలులో వెలుగు చూసిన ఈ సంఘటనతో రాష్ట్రవ్యాప్తంగా జీఎస్టీ నకిలీ రిజిస్ట్రేషన్లు కేవలం కొంతమంది వ్యక్తుల పనిగా కాకుండా, ఒక వ్యవస్థగా వేళ్లూనుకొని ఉన్నదన్న విషయం సంబంధిత అధికారులకు అవగతమైంది. ప్రస్తుత విధానంలో ఈ నకిలీ రిజిస్ట్రేషన్‌లను నియంత్రించటం జీఎస్టీ అధికారులకు సాధ్యం కాకపోయినప్పటికీ, వాటిని నిరుపయోగం చేసే అవకాశం ఉంది. అయినప్పటికీ, ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవటంతో జీఎస్టీ లో కొంతమంది అధికారులు, సిబ్బంది అండదండలతోనే ఈ తతంగమంతా నడుస్తోందన్న అనుమానాలకు అస్కారమేర్పడుతోంది.

గతంలో 'విలువ ఆధారిత పన్ను' (వ్యాట్) అమలులో ఉన్నప్పుడు రిజిస్ట్రేషన్ ఎంతో పకడ్బంధీగా ఉండేది. రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత అధికారి స్వయంగా వెళ్లి తనిఖీచేసి అందుకు అనుమతి ఇచ్చేవారు. రిజిస్ట్రేషన్ అనుమతి జారీ అనంతరం మరోసారి వేరొక ఉన్నతాధికారి వెళ్లి సంబంధిత సంస్థ వున్నాదా? వ్యాపారం నిర్వహిస్తున్నదా? లేదా? అని ధ్రువపర్చుకునేవారు. అంతేకాకుండా, వ్యాపార సంస్థ చిరునామా వున్న పరిధిలో ఉండే వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనే నిబంధన వుండేది. దీనివల్ల ఆ వ్యాపార సంస్థ కార్యకలాపాలపై సంబంధిత అధికారులకు అవగాహన వుండేది. కానీ, ప్రస్తుతం జీఎస్టీ నిర్వహణలో పరిధితో నిమిత్తంలేకుండా ఎవరైనా ఎక్కడి నుంచి అయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అందుకు అవసరమైన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే అప్ లోడ్ చేయాల్సి వుంటుంది. ఈ వెసులుబాటే అక్రమార్కులకు వరంగా మారింది. వివిధ అవసరాలకోసం సేకరించిన ఆధార్, పాన్ కార్డులు, బ్యాంకు స్టేట్ మెంట్‌లను జీఎస్టీ రిజిస్ట్రేషన్ కోసం అప్‌లోడ్ చేశారు. బ్యాంక్స్ స్టేట్ మెంట్‌లు, ఫోటో ఇతర వివరాలను ఆధార్, పాన్‌కార్డులతో సరిపోలే విధంగా కంప్యూటర్‌లలో మార్ఫింగ్ చేశారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన దరఖాస్తును పరిశీలించిన అధికారి నిబంధనల ప్రకారం ధ్రువపత్రాలన్నీ సక్రమంగా వుండటంతో దానికి అనుమతి ఇచ్చేశారు. సంబంధిత వ్యాపారి సంస్థను వ్యక్తిగతంగా తనిఖీ చేసే అవకాశానికి ఇక్కడ లేకుండా పోయింది.

### కళ్లు చెదిరే ఆదాయం!

నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌లతో ప్రభుత్వాదాయానికి గండి కొట్టడం ద్వారా కొంతమంది బ్రోకర్లు కోట్లకు పడగలెత్తారు. ఇందులో గ్రానైట్, పాత ఇనుము, జీడిపప్పు వ్యాపారాలకు సంబంధించిన కొంతమంది బ్రోకర్లు ముందువరుసలో వున్నారు. సరుకు ఉత్పత్తి అయ్యే ప్రదేశం అంటే క్వారీ, గోదాము లేదా ప్రాసెసింగ్ యూనిట్‌ల వద్ద నుంచి సరిహద్దులో చెక్‌పోస్ట్ దాటించే వరకు బ్రోకర్లు బాధ్యత తీసుకుంటారు. ఆ బ్రోకర్ తమ సరుకును ఏవిధంగా చేరుస్తాడన్నది వ్యాపారులకు సంబంధం వుండదు. లారీ కిరాయికి కుదుర్చుకోవటం నుంచి, రవాణా సమయంలో ఎవరైనా నిలిపివేస్తే వారికి మామూళ్లు సమర్పించుకోవటం వరకు బ్రోకర్లే





చూసుకోవాల్సి వుంటుంది. అందుకు ఒక్కొక్క లారీ సరుకుకు దాదాపు 25 వేల రూపాయల వరకు బ్రోకర్లకు ముట్ట చెబుతారు. ఈ బ్రోకర్లు నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ల ద్వారా తీసుకున్న వే బిల్లులను చెక్‌పోస్టులలో అందజేస్తారు.

గుంటూరు జిల్లాలో కేవలం ఒక్క గ్రానైట్‌కు సంబంధించే సుమారు రెండు వందల లారీలు ఈ విధంగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నాయని అంచనా. ఈ వ్యవహారంలో బ్రోకర్లకు ముట్టేది రోజుకు దాదాపు 50 లక్షల రూపాయలుకు పైగానే ఉంటుందని అంచనా. ఆ మొత్తం నుంచే కొంత మంది ప్రభుత్వ అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులకు మాముళ్లు చేరుతాయనేది బహిరంగ రహస్యమే. అయితే, కేవలం బ్రోకర్లకు ఇంతపెద్ద మొత్తంలో నగదు ఎందుకు ముట్ట చెబుతారనే సందేహం కలుగవచ్చు. ఒక్కొక్క లారీ ద్వారా సుమారు 5 నుంచి పది లక్షల (సరుకును బట్టి) రూపాయలు విలువజేసే సరుకు రవాణా అవుతుంది. అంటే కేవలం గ్రానైట్‌కు సంబంధించే పది నుంచి 20 కోట్ల రూపాయల విలువైన సరుకు ప్రతిరోజూ రవాణా అవుతుంది. దానిపై 28 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. పాత ఇనుము, జీడిపప్పు వ్యాపారాలలో సైతం ఇదే తరహా లావా దేవీ నడుస్తుంది. అయితే ఈ తరహా వ్యాపారం చేసే వ్యాపారులు అసలు జీఎస్టీ చెల్లించరు. నిజాయితీపరులైన అధికారులు దీనిపై విచారణ జరిపినప్పటికీ, వారికి ఏ విధమైన ఆధారమూ లభించదు. ఎందుకంటే వారికి జీఎస్టీ ఆధారంగా నోటీసులు పంపినా, లేదా వ్యక్తిగతంగా వెళ్లినా ఆ వ్యాపారానికి ఏమాత్రం సంబంధంలేని ఒక అమాయకుడు అక్కడ ఉంటాడు! తన పేరుతో ఇంతపెద్ద వ్యాపారం జరుగుతోందన్న విషయమే అతనికి తెలియదు! గుంటూరు జిల్లాలో అక్రమ మైనింగ్ వ్యవహారంలో విచారణ జరిపిన అధికారులకు దాచేపల్లి మండలంలోని ఒక మత్స్యకారుడు పేరిట జీఎస్టీ ఉన్నదని, అది నకిలీదని గుర్తించి అవాక్కయ్యారు. ఈ విధంగా నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌లతో వేల కొట్ల రూపాయల ప్రభుత్వాదాయానికి గండిపడుతున్నది.

### 'ఎనర్జీ 'ఆడిట్ ఒక్కటే పరిష్కారం!

ప్రస్తుత విధానంలో నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌లను అరికట్టడం కష్టసాధ్యం అయినప్పటికీ, పన్ను ఎగవేతను నిరోధించేందుకు అధికారులకు అవకాశం వున్నది. ఎనర్జీ ఆడిట్ చేపడితే పన్ను చెల్లించకుండా సరుకు అక్రమ రవాణా చేపట్టడం అక్రమార్కులకు సాధ్యం కాదు. ఉదాహరణకు గ్రానైట్‌ను క్వారీల నుంచి వెలికి తీసిన అనంతరం వాటిని పాలిషింగ్ యూనిట్‌ల వద్దకు తీసుకెళ్లి పాలిష్, కటింగ్ చేసి అనంతరం వ్యాపార అవసరాలకు తరలిస్తారు. ఆ పాలిషింగ్ యూనిట్‌లో వినియోగం అయ్యే విద్యుత్ ఆధారంగా ఎంత పరిణామంలో గ్రానైట్‌ను వారు పాలిష్ చేసి, కటింగ్ చేసిందీ నిర్ధారించవచ్చు. దాని ఆధారంగా అక్కడే పన్ను విధించే అవకాశం వున్నది. పాలిషింగ్ యూనిట్‌ల వద్దనే ప్రభుత్వ శాఖలకు సంబంధించిన చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేస్తే వ్యాపారుల నుంచి పూర్తిస్థాయిలో పన్ను వసూలు చేసే అవకాశం వున్నది. కానీ ఆ దిశగా అధికారులు ప్రయత్నాలు జరుపకపోవటంతో పలు సందేహాలు తలెత్తుతున్నాయి.

### 20 సంవత్సరాల క్రితమే...

దాదాపు 20 సంవత్సరాల క్రితమే ఉత్తరాంధ్రలో పనిచేసిన ఒక అధికారి ఈ ఎనర్జీ ఆడిట్ ద్వారా పన్ను ఎగవేతదారులకు 'చెక్' పెట్టారు. శ్రీకాకుళం జిల్లాలోని పలాస-కాసీబుగ్గ ప్రాంతంలో జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్‌లకు ఎనర్జీ ఆడిట్ నిర్వహించటంతోపాటు, అక్కడే తమ శాఖ విభాగాన్ని ఏర్పరచటంతో సత్ఫలితాల నిచ్చింది. ప్రస్తుతం ఆ విధానాన్ని తిరిగి అమల్లో పెడితే కోట్లాది రూపాయల పన్ను ఎగవేతను అరికట్టవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ (ఈవోడి)లో భాగంగా ఎన్నో సంస్కరణలను చేపడుతున్నందున ఎనర్జీ ఆడిట్‌ను అనివార్యం చేసిన పక్షంలో సత్ఫలితాలు సాధించే అవకాశం వుంది. దీని ద్వారా అక్రమార్కుల జేబుల్లోకి వెళుతున్న కోట్లాది రూపాయలు ప్రభుత్వ ఖజానాకు చేరతాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

# అసత్య ప్రచారం



• చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలి
• వైకాపా ఎమ్మెల్యే రజని డిమాండ్

**అమరావతి, ఆంధ్రప్రభ:** గాంధీ జయంతి రోజున మద్యం విక్రయాలు జరిగాయంటూ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్న చంద్రబాబుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వైకాపా ఎమ్మెల్యే విడదల రజని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ, మద్యనిషేధం దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే గాంధీ జయంతి రోజున విక్రయాలు జరిగాయని ఆరోపిస్తున్నారని, ఎక్కడ విక్రయాలు జరిగాయో చూపాలని డిమాండ్ చేశారు. మద్యం బెల్టు షాపులను రద్దు చేస్తామని తొలి సంతకం చేసిన చంద్రబాబు ఆ తర్వాత అధికారంలోకి వచ్చి మద్యాన్ని ఏరులుగా పారించారని చెప్పారు. సత్యం, అహింస తన ఆయుధాలుగా పోరా టం సాగించిన మహాత్ము డు జయంతి రోజున అసత్యమే పరమా వధిగా చంద్రబాబు ఆరోపణలు చేస్తున్నారని మండి పడ్డారు. ఆయన ఆడుతున్న అబద్ధాలను చూసి అబద్ధమే నవ్వు కుంటుందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక వీధివీధిన ఉన్న 43 వేల బెల్ట్‌షాపులు రద్దు చేశారని, 40,380 పర్మిట్ రూమ్‌ల లైసెన్స్‌లను రద్దు చేశారని గుర్తు చేశారు. అదే చంద్రబాబు హయాంలో 4,380 మద్యం దుకాణాలు వేలం నిర్వహిం చాని చెప్పారు. మద్యం దుకాణాల్లో కూడా 20 శాతం తగ్గించి ప్రస్తుతం 3,450 దుకాణాలకు తగ్గించిన విషయా న్ని చంద్ర బాబు గమనించకపోయినా ప్రజలు గుర్తించారని చెప్పారు. చంద్రబాబు హయాంలో ఉదయం 10 నుండి మద్యం అమ్మకాలు ప్రారంభమై అర్థ రాత్రి వరకూ అనధి కారికంగా కొనసాగాయన్నారు. కానీ, తమ ప్రభుత్వ హయా ంలో ఉదయం 11 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు మాత్రమే మద్యం షాపులు తెరచి ఉండేలా నిర్ణయించడం జరిగిందని వివరించారు. ఈ దుకాణాల్లో ఎంఆర్‌పీ రేట్లలో మాత్రమే విక్రయాలు జరుపుతున్నారన్నారు. మహిళలం తా గర్వపడేలా నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. అవినీతి రహిత పరిపాలన అందిస్తున్నామన్నారు. ఇటువం టి ఆదర్శపాలనను చూసి ఓర్వలేక చంద్రబాబు మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు.

# కేసుల మాఫీకే ప్రధానితో భేటీ

• జగన్ ఢిల్లీ పర్యటన వివరాలు తెలపాలి
• టీడీపీ అధికార ప్రతినిధి అనూరాధ

**అమరావతి, ఆంధ్రప్రభ:** తన గోడు వెళ్లబోసుకుని కేసు ల నుంచి తప్పించుకోవటానికే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి ఈనెల 5న ప్రధాన మంత్రి నరేంద్రమోడీతో భేటీ అవుతున్నారని టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనూరాధ ఆరోపించారు. గుంటూరులోని పార్టీ రాష్ట్ర కార్యాల యంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో ఆమె మాట్లాడారు. రైతు భరోసా కార్యక్రమం ముసుగు లో కేసుల నుంచి తప్పించుకోవటానికి ఢిల్లీ వెళుతున్నారని అన్నారు. నాలుగు నెలలుగా జగన్ ఢిల్లీ పర్యటన అత్యంత గోప్యంగా మారిందన్నారు. ప్రధానమంత్రినీ, కేసీఆర్‌నూ, కేంద్ర మంత్రులను ఆయన ఎందుకు కలుస్తున్నారో బయట కు చెప్పటం లేదన్నారు. రాష్ట్రం కోసమే అయితే ఆ విషయాలను ఎందుకు వెల్లడించటం లేదని ప్రశ్నించారు. చంద్ర బాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా ఢిల్లీలో ఎవరిని కలిసినా, ఏం మాట్లాడినా అన్ని విషయాలు బయటకు తెలిసే వి.. జగన్ ఢిల్లీ పర్యటన వివరాలు మాత్రం అత్యంత రహస్యంగా ఉంటున్నాయని వ్యాఖ్యానించారు. దేశంలో అతి పెద్ద వైట్ కాలర్ నేరానికి పాల్పడిన జగన్మోహన్‌రెడ్డి ఇతరుల అవినీతి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వ్యక్తిగత హాజరు నుంచి తనను మినహాయించాలని ముఖ్యమంత్రి అభ్యర్థన పెట్టుకుంటే దానికి వ్యతిరేకంగా సీబీఐ తీవ్ర అభ్యంతరం తెలిపిందంటేనే సాక్ష్యాధారాలను తారుమారు చేయటంలో ఈయనెంత నేర్పరో తెలుస్తోందన్నారు. 12 చార్జి షీట్లలో నిందితులుగా ఉన్న వారిని టీటీడీ బోర్డు సభ్యులుగా ముఖ్యమంత్రి నియమించారన్నారు. ఇది కేసును ప్రభావితం చేయటం కాదా అని ప్రశ్నించారు.

# హంపి@3



**న్యూఢిల్లీ :** భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానానికి చేరుకుంది. ప్రపంచ చెస్ సంఘం(ఫిడే) గురువారం తాజా ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 32 ఏళ్ల హంపి ర్యాంకింగ్స్‌లో కెరీర్ అత్యుత్తమ ర్యాంకింగ్‌కు చేరుకుంది. ఇటీవల రష్యాలో జరిగిన ఫిడే మహిళల గ్రాండ్‌ప్రి టోర్నీలో హంపి విజేతగా నిలిచింది. ఆ విజయంతో హంపి 17 ఎలో పాయింట్లు గెలుచుకుని మొత్తంగా 2,577 రేటింగ్‌తో మూడో స్థానానికి చేరుకుంది. హంపి తన కూతురు అహన ఆలనాపాలన చూసుకునేందుకు రెండేళ్లపాటు ఆటకు దూరంగా ఉంది. ఇటీవల రష్యా గ్రాండ్‌ప్రిని గెలుచుకుని తనలో సత్తా తగ్గలేదని నిరూపించుకోవడమేగాక ర్యాంకింగ్‌ను మెరుగుపరచు కుంది. చైనా క్రీడాకారిణులు హో యిఫాన్(2,659 పాయింట్లు), జు వెన్‌జున్(2,586 పాయింట్లు) తొలి రెండు స్థానాలను దక్కించుకున్నారు. ఓపెన్ కేటగిరిలో మాజీ ప్రపంచ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ 2,765 పాయింట్లతో 9వ ర్యాంక్‌లో ఉండగా, ప్రస్తుత ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్(నార్వే) 2,876 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.



# భారత్‌కు మరో విజయం

**ఐదో మ్యాచ్‌లోనూ ఓడిన సౌతాఫ్రికా • మహిళల టి20 సిరీస్**

**సూరత్:** వరుస విజయాలతో జోరుమీదున్న భారత్ తమ ఖాతాలో మరో విజయాన్ని వేసుకుంది. మహిళల టి20 సిరీస్‌లో భాగంగా గురువారం సౌతాఫ్రికాతో జరిగిన ఐదో మ్యాచ్‌లో భారత్ 5 వికెట్లతో ఘన విజయం సాధించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 3-0 ఆధిక్యాన్ని సాధించింది. రెండు మ్యాచ్‌లు వర్షంతో రద్దవడంతో ఇంకో మ్యాచ్ ఆడించాలని బీసీసీఐ నిర్ణయించింది. దీంతో శుక్రవారం ఇరు జట్ల మధ్య ఆరో టీ20 జరగనుంది. గురువారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సఫారీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. రాధ యాదవ్ (3/23), దీప్తి శర్మ (2/19) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో సఫారీ జట్టును తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత్ 17.1 ఓవర్లలో 99/5 స్కోరు చేసి విజయాన్ని అందుకుంది. షఫాలీ వర్మ (14), స్మృతి మంధాన (7), జెమీమా (7) విఫలమైనా.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కెప్టెన్ హర్మన్ కౌర్ (34 నాటౌట్; 32 బంతుల్లో 4 ఫోర్లు) ధాటిగా ఆడి టీమిండియా విజయాన్ని పూర్తి చేసింది.

**సంక్షిప్త స్కోర్లు:** సౌతాఫ్రికా : 98/8 (20 ఓవర్లు).. లౌరా 17, లీజెలె లీ 16.
భారత్ : 99/5 (17.1 ఓవర్లు).. హర్మన్ ప్రీత్ కౌర్ 34 (నాటౌట్), దీప్తి శర్మ 16.

# టెన్నిస్ ఆడొద్దన్నారు: సానియా



**న్యూఢిల్లీ :** ఆటలాడితే నల్లబడి పెళ్లి కాదని చిన్న తనంలో తనను టెన్నిస్ ఆడకుండా అడ్డుకునేందుకు బంధువులు, ఇరుగుపొరుగు ప్రయత్నించారని భారత టెన్నిస్‌స్టార్ సానియా మీర్జా వెల్లడించింది. తనకు ఎనిమిదేళ్లపుడే ఇటువంటి పరిస్థితి ఎదురైందని తెలిపింది. గురువారం ఇక్కడ జరిగిన ప్రపంచ ఎకనమిక్ ఫోరం సమావేశంలో చర్చ సందర్భంగా సానియా తాను ఎదుర్కొన్న పలు సవాళ్లను వివరించింది. దేశంలో క్రీడలు ఆడితే అమ్మాయిలు నల్లబడతారని, వారికి అంత త్వరగా పెళ్లి కాదనే అపప్రథ ఉందని, ఇటువంటి ఆలోచనలు తొలగాలని సానియా సూచించింది. భారత అత్యంత విజయవంతమైన టెన్నిస్ క్రీడాకారిణి అయిన సానియా మూడు డబుల్స్, మూడు మిక్సడ్ డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సొంతం చేసుకుంది. కెరీర్‌లో అత్యుత్తమంగా డబుల్స్‌లో అగ్రస్థానం, సింగిల్స్‌లో 27వ ర్యాంక్‌కు చేరుకుంది. ఆమె ఇపుడు దక్షిణాసియాకు ఐక్యరాజ్య సమితి మహిళా గుడ్‌విల్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నది.

# పోరాడి ఓడిన టైటాన్స్

**పంచకుల :** ప్రొ కబడ్డీ ఏడో సీజన్‌లో గురువారం పుణెరి పల్టన్‌తో జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ పోరాడి ఓడింది. రాకేష్ గౌడ(16), ఫరద్(10) సూపర్ టెన్స్‌తో జట్టు విజయానికి కడదాకా పోరాడినా ఫలితం లేకపోయింది. పుణె జట్టు 53-50తో విజయం సాధించింది. పుణె జట్టులో మంజీత్(12), సుశాంత్ సెయిల్(11) సూపర్ టెన్స్ నమోదు చేయగా, సుర్జీత్ సింగ్ 7, ఇమద్ 6, నితిన్ తోమర్ 5 పాయింట్లు సాధించారు.



టైటాన్స్‌లో తతిమా ఆటగాళ్లలో ఆకాష్ అర్సుల్, కృష్ణమదనె చెరి 5, సిద్ధార్థ్ దేశాయ్ 3 పాయింట్లు సాధించారు. రెయిండింగ్ (31-31)లో, టాకి లింగ్ (15-15)లో ఇరు జట్లు సమ ఉజ్జీలు గా నిలువగా, టైటాన్స్ మూడు సార్లు, పుణె రెండుసార్లు ఆలౌట వడం విజేతను నిర్ణయిం చడంలో కీలకంగా మారింది. నేడు జైపూర్‌తో బెంగళూరు, హర్యానాతో టైటాన్స్ తలపడనున్నాయి



*సఫారీలతో జరుగుతున్న తొలి టెస్టులో భారత ఓపెనర్లు చిరస్మరణీయ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. కెరీర్‌లో ఐదో టెస్టు ఆడుతున్న మయాంక్ అగర్వాల్ తొలి శతకాన్నే డబుల్ సెంచరీగా మరల్చి ఔరా అనిపించుకున్నాడు. 23 ఫోర్లు, 6 సిక్సర్లతో జోరును ప్రదర్శించాడు. గత ఏడాది ఆస్ట్రేలియా పర్యటనతో అంతర్జాతీయ టెస్టుల్లో అరంగేట్రం చేసిన మయాంక్ తొలి సిరీస్‌లోనే సత్తా చాటాడు. మరోవైపు టెస్టుల్లో తొలిసారి ఓపెనింగ్ చేసిన హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ ఆరంభపు మ్యాచ్‌లోనే అదరగొట్టాడు. బౌండరీల వర్షంతో సఫారీ బౌలర్లను చితక్కొట్టి తృటిలో ద్విశతకాన్ని మిస్ చేసుకున్నాడు.*

**1** సౌతాఫ్రికాపై 300 పరుగులకు పైగా భాగస్వామ్యం నెలకొల్పిన తొలి భారత జోడీగా రోహిత్, మయాంక్‌లు రికార్డు సృష్టించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 317 పరుగులు జోడించారు.

**3** టెస్టుల్లో భారత్ తరఫున మూడో అత్యధిక పరుగుల భాగస్వామ్యం. ప్రస్తుతం విశాఖలో జరుగుతున్న టెస్టులో రోహిత్, మయాంక్ అగర్వాల్ సఫారీలపై తొలి వికెట్‌కు 317 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయగా.. వీరికంటే ముందు వినూ మన్కడ్-పంకజ్ రాయ్ జోడీ న్యూజిలాండ్‌పై 413 పరుగులు, వీరేంద్ర సెహ్వాగ్-రాహుల్ ద్రవిడ్‌లు పాక్‌పై 410 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

**23** ఫోర్లు — **6** సిక్సర్లు — **215** పరుగులు

**4** టెస్టుల్లో తొలి ప్రయత్నంలోనే ద్విశతకం సాధించిన నాలుగో భారత బ్యాట్స్‌మెన్‌గా మయాంక్ రికార్డుల్లో నిలిచాడు. మయాంక్ కంటే ముందు దిలీప్ సర్‌దేశాయ్, వినోద్ కాంబ్లి, కరుణ్ నాయర్‌లు తొలి శతకాన్ని డబుల్ సెంచరీగా మలిచారు

మయాంక్ అగర్వాల్ (215)



అశ్విన్ 8-4-9-2

## స్పిన్నర్ల దూకుడు..

భారత్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన తర్వాత బ్యాటింగ్ చేపట్టిన సౌతాఫ్రికాకు భారత స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలు చుక్కలు చూపె ట్టారు. ఇన్నింగ్స్ ఆరంభమైన కొద్ది సేపటికే కుదురుగా ఆడుతున్న ఓపెనర్ మర్క్‌రమ్ (5)ను అశ్విన్ క్లీన్ బౌల్డ్ చేయడంతో సఫారీ జట్టు 14 పరుగులవద్ద తొలి వికెట్ కోల్పోయింది. తర్వాత డి బ్రూన్ (5)ను కూడా అశ్విన్ ఆవుట్ చేశాడు. అనం తరం డేన్ పీడ్ (0)ను జడేజా ఖాతా తెరవకుండానే ఇంటి బాట పట్టించాడు. దీంతో మూ డు పరుగుల వ్యవధిలోనే రెండు వికెట్లు కోల్పోయిన సఫా రీ జట్టు 34 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. అనంతరం గురువారం ఆట ముగిసే సమయానికి సౌతాఫ్రికా 3 వికెట్ల నష్టానికి 39 పరుగులు చేసింది.

# మయాంక్ డబుల్

- ఐదో టెస్టులోనే ద్విశతకం బాదేసిన ఓపెనర్
- రోహిత్ డబుల్ మిస్ • భారత్ 502/7
- విజృంభించిన స్పిన్నర్లు • సౌతాఫ్రికా 39/3
- తొలి టెస్టులో పట్టు బిగించిన టీమిండియా

**23** భారత్ తరఫున టెస్టుల్లో డబుల్ సెంచరీ సాధించిన 23వ ఆటగాడిగా మయాంక్ రికార్డులకెక్కాడు.

**విశాఖపట్నం:** విశాఖ సాగర తీరంలో సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా పట్టు బిగిం చింది. ఓపెనర్లు విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. మయాంక్ అగర్వాల్ (215; 371 బంతుల్లో 23 ఫోర్లు, 6 సిక్సులు) తొలి ప్రయత్నంలోనే డబుల్ సెంచరీతో చెలరేగగా.. మరో ఓపెనర్ రోహిత్‌శర్మ (176; 244 బంతుల్లో 23 ఫోర్లు, 6 సిక్సులు) తృటిలో ద్విశతకాన్ని చేజార్చుకున్నాడు. ఇద్దరు ఓపెనర్లు తొలి వికెట్‌కు 317 పరుగులతో మూడో అత్యధిక భాగస్వామ్యాన్ని ఏర్పర్చారు. అనంతరం భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 502/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా గురువారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 39 పరుగులు చేసింది. స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్ రెండు వికెట్లు పడగొట్టగా, రవీంద్ర జడేజా ఒక వికెట్ దక్కించుకున్నాడు. ఎల్గర్ (27 బ్యాటింగ్), టెంబ బవుమా (2 బ్యాటింగ్) క్రీజులోఉన్నారు. ప్రస్తుతం సఫారీ జట్టు భారత్ తొలి ఇన్నింగ్స్‌కు స్కోరుకు 463 పరుగులతో వెనుకబడి ఉంది. ముందు బ్యాటింగ్‌లో భారీ పరుగులు సాధించి.. తర్వాత బౌలింగ్‌లోనూ విజృంభించిన టీమిండియా తొలి టెస్టులో సఫారీలపై పట్టు సాధించింది.

### ఓపెనర్ల జోరు..

గురువారం 202/0 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన టీమిండియాకు ఓపెనర్లు రోహిత్ శర్మ, మయాంక్ అగర్వాల్ రెండో రోజు మరిన్ని పరుగులు జోడించారు. ఓవర్‌నైట్ స్కోరు 84తో ఉన్న మయాంక్ 204 బంతుల్లో కెరీర్ తొలి శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మయాంక్ ఆచితూచి ఆడుతుంటే.. రోహిత్ మాత్రం తనదైన మార్క్ షార్టులతో సఫారీ బౌలర్లపై విరుచు కుపడ్డాడు. ఈక్రమంలోనే రోహిత్ 150 పరుగుల మార్కును అందుకున్నాడు. ఈ జోడీని విడదీయడానికి సఫారీ బౌలర్లు ఎన్నో ప్రయత్నాలు చేశారు. కెప్టెన్ డుప్లిసిస్ తరచు బౌలర్లను మార్చినా లాభం లేకుం డా పోయింది. ఆఖరికి వీరిద్దరూ 481 బంతుల్లో 300 పరుగుల భాగస్వా మ్యాన్ని పూర్తి చేసుకొని టీమిండియాకు గట్టి పునాది వేశారు. తర్వాత చెలరేగి ఆడుతున్న రోహిత్ శర్మ (176) కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లో స్టంప్ ఆవుటయ్యాడు. దీంతో 317 పరుగుల కీలక భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం క్రీజులోకి వచ్చిన చతేశ్వర్ పుజారా (6) మరోసారి నిరాశ పరిచాడు. ఈ దశలో మయాంక్‌కు కెప్టెన్ కోహ్లీ జతయ్యాడు. వీరిద్దరూ నిలకడగా ఆడుతూ స్కోరుబోర్డును ముందుకు నడిపించారు. ధాటిగా ఆడిన మయాంక్ 294 బంతుల్లో 150 పరుగుల స్కోరును సాధించాడు. కోహ్లీతో కలిసి మూడో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యాన్ని పూర్తి చేసుకున్నాడు. కానీ ఆ తర్వాత కుదురుగా ఆడుతున్న కోహ్లీ (20) ముత్తుసామీ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. తర్వాత రహానే (15)తో కలిసి మయాంక్ స్కోరుబోర్డును 400 దాటించాడు. ఈ దశలోనే కెరీర్ అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడిన మయాంక్ అగర్వాల్ 358 బంతుల్లో 22 ఫోర్లు, 5 భారీ సిక్సర్లతో తొలి డబుల్ సెంచరీని పూరించాడు. తరువాత కొద్దిసేపటికే మయాంక్ 215 పరుగులకు స్కోరు 436 పరుగులవద్ద అవుటయ్యాడు. ఆ తర్వాత హనుమ విహారి (10), సాహా (21) తక్కువ స్కోరుకే ఆవుటైనా.. ఆల్‌రౌండర్ జడేజా (30 నాటౌట్) రాణించడంతో భారత్ 136 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 502 పరు గులు చేసింది. ఈ సమయంలో భారత సారథి కోహ్లీ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు.

అరంగేట్ర టెస్టు ఆడుతున్న భారత సంతతికి చెందిన కేశవ్ మహరాజ్ మూడు వికెట్లు తీశాడు.

### స్కోరు బోర్డు:

**భారత్ తొలి ఇన్నింగ్స్:** మయాంక్ అగర్వాల్ (సి) డేన్ (బి) ఎల్గర్ 215, రోహిత్ శర్మ (స్టంప్) డికాక్ (బి) మహరాజ్ 176, పుజారా (బి) ఫిలాండర్ 6, విరాట్ కోహ్లీ (సి) అండ్ (బి) ముత్తుసామీ 20, రహానే (సి) బవుమా (బి) మహరాజ్ 15, జడేజా (నాటౌట్) 30, విహారి (సి) ఎల్గర్ (బి) మహరాజ్ 10, సాహా (సి) ముత్తుసామీ (డి) డేన్ 21, అశ్విన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు: 8, మొత్తం (136 ఓవర్లలో) 502/7.

**వికెట్ల పతనం:** 1-317, 2-324, 3-377, 4-431, 5-436, 6-457, 7-494.

**బౌలింగ్:** ఫిలాండర్ 22-4-68-1, కగిసో రబాడా 24-7-66-0, కేశవ్ మహరాజ్ 55-6-189-3, డేన్ పీట్ 19-1-107-1, ముత్తుసామీ 15-1-63-1, డీన్ ఎల్గర్ 1-0-4-1.

**సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** డీన్ ఎల్గర్ (బ్యాటింగ్) 27, మార్క్‌రమ్ (బి) అశ్విన్ 5, డి బ్రూన్ (సి) సాహా (బి) అశ్విన్ 4, డేన్ పీట్ (బి) జడేజా 0, టెంబ బవుమా (బ్యాటింగ్) 2; ఎక్స్‌ట్రాలు: 1, (మొత్తం 20 ఓవర్లలో) 39/3.

**వికెట్ల పతనం:** 1-14, 2-31, 3-34.

**బౌలింగ్:** ఇషాంత్ శర్మ 2-0-8-0, షమీ 2-2-0-0, అశ్విన్ 8-4-9-2, జడేజా 8-1-21-1.

# తిరుగులేని భారత్

**ఆంట్వెర్ప్ :** బెల్జియం పర్యటనలో భారత హాకీ తిరుగులేని విజయాలందుకున్నది. గురువారం జరిగిన అయిదో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. ప్రపంచ, ఐరోపా చాంపియన్ బెల్జియంతో 5-1తో చిత్తుచేసింది. ఈ పర్యటనలో భారత హాకీ జట్టు తామాడిన అయిదు మ్యాచ్‌లనూ గెలుచుకుంది. తొలి మ్యాచ్‌లో బెల్జియంను 2-0తో ఓడించిన భారత్ తరువాత 6-1, 5-1తో స్పెయిన్‌పై, తిరిగి 2-1తో బెల్జియంపై విజయాలు నమోదు చేసింది. గురువారంనాటి చివరి మ్యాచ్‌లో బెల్జియంపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. భారత్‌కు సిమ్రన్‌జిత్ సింగ్(7వ నిమిషం), లలిత్ కుమార్ ఉపాధ్యాయ(35ని.), వివేక్ సాగర(36ని.), హర్మన్‌ప్రీత్ సింగ్(42ని.), రమణ్‌దీప్ సింగ్(43ని.) గోల్స్ చేయగా, బెల్జియంకు ఏకైక గోల్‌ను 39వ నిమిషంలో అలెగ్జాండర్ హెండ్రిక్స్ సాధించిపెట్టాడు.

# ఫాజ్దెక్‌కు నాలుగో స్వర్ణం

**ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్**

**దోహా:** ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిఫ్ హామ్ త్రో అంశంలో పోలండ్‌కు చెందిన పావెల్ ఫాజ్దెక్ వరుసగా నాలుగోసారి స్వర్ణం సాధించాడు. ఈ అంశంలో నాలుగో స్వర్ణం గెలుపొందిన తొలి అథ్లెట్‌గా రికార్డులకెక్కాడు. ఫాజ్దెక్ హామర్‌ను 80.5మీ. దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఫ్రాన్స్‌కు చెందిన క్వెంటెన్ బిగోట్ 78.19మీ.తో రజతం, హంగరీకి చెందిన బెన్స్ హలాజ్ 78.18మీ.తో కాంస్యం గెలుచుకున్నారు. 2013 మాస్కో(రష్యా), 2015 బీజింగ్(చైనా), 2107 లండన్ (ఇంగ్లండ్) చాంపియన్‌షిప్‌లలో ఫాజ్దెక్ స్వర్ణాలు గెలుచుకున్నాడు. పురుషుల 110మీ. హర్డిల్స్‌లో అమెరికాకు చెందిన గ్రాంట్ హాలోవే 12.10 సెకండ్లలో గమ్యాన్ని చేరి విజేతగా నిలిచాడు. తటస్థ ఆటగాడిగా పాల్గొన్న రష్యా అథ్లెట్ 13.15 సెంకడ్లతో రజతం, ఫ్రాన్స్‌కు చెందిన పాస్కల్ మార్టినాట్ లాగ్రేడ్ 13.18 సెకండ్లతో కాంస్యం దక్కించుకున్నారు. మహిళల 200మీ. రేస్‌ను గ్రేట్ బ్రిటన్‌కు చెందిన దినా ఆషర్ స్మిత్ గెలుచుకుంది. దినా 21.88 సెకండ్లతో గమ్యాన్ని అధిగమించి అగ్రస్థానంలో నిలిచింది. అమెరికాకు చెందిన బ్రిట్టాని బ్రౌన్ 22.22 సెకండ్లతో రజతం, స్వీడన్‌కు చెందిన ముజింగ కాంబుండ్జి 22.51 సెకండ్లతో కాంస్యం అందుకున్నారు.



Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

epaper.prabhanews.com

# రంగుల దసరహాసం!

ప్రతిపండుగకు దానికే సొంతమైన కొన్ని ప్రత్యేకతలు ఉంటాయి. అన్ని పండుగల్లో పూజలు, ఆరాధనలు, ప్రార్థనలు వంటివి మామూలే అయినా...ఆ ప్రత్యేకత పండుగను మరింత వేడుకగా మారుస్తుంది. దీపావళికి వెలుగులు, వినాయకచవితికి భిన్నరూపాల్లో కనిపించే వినాయక విగ్రహాలు, ఉగాదికి రుచుల కలయికతో పచ్చడి...ఇలాంటివన్నమాట. అలా దసరాను మరింత శోభాయమానం చేసే అంశం... అమ్మవారికి ప్రతిరోజూ చేసే భిన్న అలంకారాలు. నవరూపాలంకరణలో అమ్మవారు రోజుకి ఒక రకమైన రంగు అలంకరణలో దర్శనమిస్తుంటారు. ఇప్పటివరకు పూర్తయిన అమ్మవారి అలంకరణ రూపాలు....మొదటి రోజు శైలపుత్రి (ఆరెంజ్ రంగు), రెండవరోజు బ్రహ్మచారిణి (తెలుపు), మూడవరోజు చంద్రఘంటా దేవి (ఎరుపు), నాల్గవరోజు కూష్మాండ దేవి (రాయల్ బ్లూ), ఐదవరోజు స్కందమాత (పసుపు రంగు)....ఇప్పటివరకు ఇలా దర్శనమిచ్చిన అమ్మవారు ఆరవరోజు అంటే నేడు... కాత్యాయని అలంకరణ (ఆకుపచ్చరంగు)లో దర్శనమిస్తారు. ఆకుపచ్చరంగు నూతన ప్రారంభాలను సూచిస్తుంది. అభివృద్ధి, సంతాప సాఫల్యం, శాంతి సంతోషాలను అందించే అమ్మవారు కాత్యాయనీ దేవి. ఇక ఏడవరోజు అమ్మవారి అలంకార రూపం కాళరాత్రి (బూడిద రంగు). ఈ రంగు మనలోని భావోద్వేగాలను సమతుల్యంగా ఉంచుతుంది. నిరాడంబరత, వినయవిధేయతలను ఈ రంగు సూచిస్తుంది. ఎనిమిదవ రోజు అమ్మవారి రూపం మహాగౌరి. ఎరుపు నీలం రంగుల కలయిక అయిన పర్పుల్ రంగులో అమ్మవారిని అలంకరిస్తారు. ఈ రంగు సంపదను, ఐశ్వర్యాన్ని సూచిస్తుంది. తొమ్మిదవ రోజు అమ్మవారి అలంకార రూపం సిద్ధిదాత్రి. నెమలిపింఛంలోని ఆకుపచ్చ రంగులో అమ్మవారి అలంకరణ ఉంటుంది. ఈ రంగు దయని సూచిస్తుంది. పదవరోజున అంటే దసరానాడు అమ్మవారిని దుర్గాదేవిగా పూజిస్తారు. నవరాత్రుల రంగులు ...మనజీవితంలోని కొన్ని గుణాలు, లక్షణాలను సూచిస్తున్న నేపథ్యంలో దసరా నవరాత్రుల్లో రంగులకు అత్యంత ప్రాధాన్యత ఉంది. అందుకే నవరూపాలంకరణను దృష్టిలో ఉంచుకుని నవరంగుల చీరలు విస్తృతంగా ఆన్‌లైన్ మార్కెట్‌లో లభిస్తున్నాయి. అలాగే దసరా ప్రత్యేకతను చాటే దాండియా నృత్యం డ్రస్‌లు లెహంగా చోళీలు సైతం ఎంతో వైవిధ్యభరితంగా అందంగా డిజైన్ చేసినవి అందుబాటులో ఉన్నాయి.










# ఆకుపచ్చని అనుభూతి!

గ్రీన్ టీ మనందరికీ తెలుసు...అయితే గ్రీన్ టీ లాగే గ్రీన్ కాఫీ కూడా ఉంది. గ్రీన్ టీలాగే గ్రీన్ కాఫీ కూడా ఆరోగ్యానికి చాలామంచిది అంటున్నాడు కునాల్ కపూర్ అనే సెలబ్రిటీ చెఫ్. మాస్టర్ చెఫ్ ఇండియా, మాస్టర్ చెఫ్ అమెరికా, మాస్టర్ చెఫ్ (అమెరికా టీవీ సిరీస్), మై ఎల్లో టేబుల్, తాలీస్ ఆఫ్ ఇండియా, పికిల్ నేషన్... లాంటి ఎన్నో టీవీ షోల్లో హోస్ట్‌గా, జడ్జ్‌గా కనిపించాడు కునాల్ కపూర్. గ్రీన్ కాఫీ భారత్‌కి కొత్త. దీనిని రోజువారీ దినచర్యలో భాగం చేసుకుని దానివలన వచ్చే ఆరోగ్య లాభాలను పొందమని చెబుతున్నాడీ సెలబ్రిటీ చెఫ్. కునాల్ వివరించిన గ్రీన్ కాఫీలోని విశేషాలివి-



## ఆరోగ్యాన్నిచ్చే గ్రీన్ కాఫీ

మామూలుగా సాధారణ కాఫీలో వాడే కాఫీపొడి... పచ్చి కాఫీ గింజలనుండి కాకుండా వేయించిన కాఫీ గింజలనుండి తయారవుతుంది. కానీ గ్రీన్ కాఫీ మాత్రం పచ్చి కాఫీ గింజలనుండి తయారవుతుంది. గ్రీన్ కాఫీలో చాలా పెద్ద మొత్తంలో మన ఆరోగ్యానికి మేలు చేసే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయని, ఇది సూపర్ ఫుడ్ అని అంటున్నాడు కునాల్. ఆయన చెబుతున్న వివరాల ప్రకారం- కాఫీ గింజలను వేయించడం వలన అందులోని పదార్థ గుణాల్లో మార్పు వస్తుంది. కానీ పచ్చి కాఫీ గింజలను వేయించకుండా ఎండబెట్టి వాడటం వలన వీటి వినియోగంలో దుష్ఫలితాలేమీ ఉండవు. గ్రీన్ కాఫీలో కెఫిన్ చాలా తక్కువ మోతాదులో ఉంటుంది. పోషకాలు ఎక్కువగా ఉంటాయి. గ్రీన్ కాఫీ తాగితే బరువు తగ్గుతామని పలువురు భావిస్తుండగా కునాల్ కపూర్ మాత్రం గ్రీన్ కాఫీతో బరువు తగ్గరు కానీ...ఉన్న బరువుని కొనసాగించే అవకాశం ఉందంటున్నాడు. రక్తంలో చెక్కర శాతాన్ని, మెటబాలిజం స్థాయిని క్రమబద్దీకరిస్తుందని కునాల్ వెల్లడించాడు.

సంవత్సరం క్రితం ఒక విదేశీ పర్యటనలో ఉన్నపుడు కునాల్ గ్రీన్ కాఫీ గురించి తెలుసుకున్నాడు. భారత్‌లో కూడా అక్కడక్కడా ఇది లభ్యమవుతున్నా దానికి తగిన ప్రచారం లేదని గుర్తించాడతను. కాఫీ అనగానే ఘుమఘుమ లాడుతూ ఉత్తేజపూరితమైన రుచిలో ఉండాలని ఎవరైనా అనుకుంటారు. కానీ గ్రీన్ కాఫీ రుచి అలా ఉండదు. గ్రీన్ కాఫీలో ఘాటుదనం ఒక మోస్తరుగా ఉండటం వలన దీంట్లో నిమ్మలాంటి అదనపు రుచులను కలుపుకోవచ్చు. ఇందులో అల్లం తులసి వంటివి కలుపుకోవచ్చని కునాల్ సలహా ఇస్తున్నాడు.

మీరు తాగేది కాఫీనే అయినా...ఇది మీకు ఒక ప్రత్యేకమైన అనుభూతిని కలిగిస్తుందంటున్నాడతను. గ్రీన్ కాఫీ నోటిలోపలి భాగాన్ని శుభ్రం చేస్తుందని, దీనికి ఆహారం రుచిని పెంచి, దానికి అనుబంధంగా పనిచేసే గుణం ఉంది కనుక దీనిని ఉదయాన్నే లేదా భోజనం చేసిన తరువాత అయినా తీసుకోవచ్చని కునాల్



చెబుతున్నాడు. గ్రీన్ కాఫీ రుచి మామూలు కాఫీలా తన ప్రత్యేకతని చాటుకునేలా లేకపోవటం వలన.. పచ్చి కాఫీ గింజల పొడిని మిల్క్ షేక్‌ల్లో, కేకుల్లో కూడా కలపవచ్చని, ఇంకా ఇతర ఆహారాలపై కూడా చల్లుకుని తినవచ్చని కునాల్ సలహా ఇస్తున్నాడు.

### గ్రీన్ కాఫీ తయారీ ఇలా...

కాఫీ గింజలను తీసుకుని వాటిపై దుమ్ము ధూళి పోయేలా శుభ్రంగా కడగాలి. ఇప్పుడు కాఫీకి సరిపడా నీటిని తీసుకుని గింజలను అందులో వేసి పదినిముషాలపాటు మరిగించాలి. మరుగుతున్న నీటిని తిప్పుతూ ఉండాలి. తరువాత స్టవ్ ఆపేసి పదినుండి పదిహేను నిముషాలపాటు డికాషన్‌ని పక్కన ఉంచాలి. ఆపై వడపోసుకుని తాగాలి. గింజలను తెచ్చుకుని కడిగి ఎండబెట్టి పొడిగా చేసుకుని దానిని కూడా వాడుకోవచ్చు. మార్కెట్‌లో కూడా గ్రీన్ కాఫీ గింజల పొడి ప్యాకెట్లలో దొరుకుతోంది.



# వానాకాలం...వన్నె తగ్గకుండా!

## ఆభరణాలను శుభ్రం చేసే పద్ధతులు

ప్రతిరోజు వాడే నగల్లో దుమ్ము ధూళి చేరడమే కాకుండా వాటి కళ తగ్గుతుం ది. నగలు మెరుస్తూ ఉండాలంటే అప్పుడప్పుడు వాటిని శుభ్రం చేస్తుండాలి. ముఖ్యంగా వర్షాకాలంలో వాతావరణంలోని తేమ వలన అవి మరింతగా మెరుపుతగ్గటం, కిలుం పట్టటం లాంటి సమస్యలకు గురికావచ్చు. అందుకే వానాకాలంలో నగల శుభ్రత విషయంలో మరన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకు పనికొచ్చే చిట్కాలు మీకోసం-

☞ ఇప్పుడు బంగారంతో సమానంగా చాలామంది వెండి ఆభరణాలను వాడుతున్నారు. అయితే ఇవి త్వరగా నల్లబడుతుంటాయి. వెండికి పట్టిన మురికిని వదిలించడానికి టూత్ పేస్టుని నగలపైన చేత్తో లేదా మెత్తని క్లాత్‌తో అప్లయి చేసి తరువాత గోరువెచ్చని నీటితో కడగాలి. ఆపై మెత్తని క్లాత్‌తో చక్కగా తుడిచి శుభ్రం చేసుకోవాలి. వెండి మరీ నల్లబడి ఉంటే రెండుమూడు చుక్కల లిక్విడ్ డిష్ సోప్‌ని గోరువెచ్చని నీటిలో వేసి ఆ నీటిలో మెత్తని బట్టని ముంచి నగలను తుడవాలి. తరువాత చల్లని నీళ్లతో కడిగి తిరిగి మెత్తని క్లాత్‌తో తుడవాలి. మూడువంతుల బేకింగ్ సోడాకి ఒకవంతు నీటిని కలిపి...వెండిని తడిపి దానికి ఈ మిశ్రమాన్ని మెత్తని క్లాత్‌తో రాయాలి. తరువాత శుభ్రంగా కడిగి తుడుచుకోవాలి.

☞ బంగారానికి సైతం వానాకాలంలో మరింత మురికి పట్టే అవకాశం ఉంది. బంగారం, ప్లాటినంలను గోరువెచ్చని సబ్బునీటితో కడిగితే వాటి మెరుపు నిలిచి ఉంటుంది. పెద్ద నగలను అయిదు నిముషాలపాటు నీళ్లలో ఉంచి...మెత్తని బ్రష్‌తో లింకులు హుక్కులు ఉన్నచోట మురికిని తొలగించాలి. తరువాత ఎక్కువ నీళ్లతో బాగా కడిగి మెత్తని బట్టతో తుడవాలి.

# దినఫలాలు

**మేష రాశి**
బంధువుల నుంచి శుభ ఆహ్వానాలు అందుకుంటారు. విందు వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. కార్యజయం పొందుతారు. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. స్వల్ప ధనలాభం.

**వృషభ రాశి**
శ్రమ అధికంగా ఉంటుంది. ముఖ్యమైన పనుల్లో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. ఉద్యోగాల్లో స్థాన మార్పులు ఉంటాయి.

**మిథున రాశి**
ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు డబ్బు చేతికి అందుతుంది. ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కర్కాటక రాశి**
కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దూర ప్రాంతాల నుంచి శుభ ఆహ్వానాలు అందుకుంటారు. ఉద్యోగులకు అనుకూలంగా ఉంటుంది.

**సింహ రాశి**
మీ మాటకు సంఘంలో గౌరవం పెరుగుతుంది. సన్నిహితుల నుంచి సాయం పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో ఉన్నతహోదాలు దక్కుతాయి.

**కన్య రాశి**
ఋణ బాధలు తప్పవు. ఉద్యోగాలలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**తులా రాశి**
రాబడి కంటే ఖర్చులు అధికం అవుతాయి. ముఖ్యమైన పనులలో తొందరపాటు తగదు. బంధువులు, మిత్రులతో కష్టసుఖాలు పంచుకుంటారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**వృశ్చిక రాశి**
అనుకున్న రాబడి సకాలంలో అందుతుంది. కార్యజయం కలుగుతుంది. బాకీలు వసూలవుతాయి. భాగస్వామ్య వ్యాపారాలలో స్వల్ప ధన లాభం పొందుతారు. వాహన సౌఖ్యం.

**ధనూ రాశి**
ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. పనులలో ఆటంకాలు ఎదురైనా నిదానంగా పూర్తి చేస్తారు. సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**మకర రాశి**
ఆర్థికాభివృద్ధి సాధిస్తారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. పెట్టుబడులకు అనుకూల కాలం. ఆకస్మిక ధనలాభం.

**కుంభ రాశి**
అనుకున్న కార్యక్రమాల్లో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఇంటాబయటా అనుకూలంగా ఉంటుంది. జీవితభాగస్వామి నుంచి ఆస్తి లాభం పొందుతారు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు.

**మీన రాశి**
ముఖ్యమైన వ్యవహారాలలో జాప్యం జరిగినా విజయం సాధిస్తారు. ఆర్థిక పరిస్థితి కొంతమేర మెరుగుపడుతుంది. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. వస్తులాభం ఉంది.



శ్రీ గుదిమెళ్ళ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి

# శ్రీ దేవీ వైభవం



## చింతన

> సృష్టి స్థితి లయ కారకులైన బ్రహ్మ విష్ణు రుద్రులు పరాశక్తి అయిన శ్రీదేవి సంకల్పంతో ఆవిర్భవించారు. శ్రీదేవీ శక్తిని అనుభూతి పొందిన బ్రహ్మ 'వేదాలు కూడా నీ శక్తిని వర్ణించలేవు, ముల్లోకాలకు నీవే సర్వజ్ఞురాలవు అన్నాడు. విష్ణువు ఆమెను వర్ణిస్తూ 'పండితుల యందు విద్య, శక్తిమంతుల యందు శక్తి, మానవులందు కీర్తి, తుష్టి నీవే' అన్నాడు. రుద్రుడు, పంచ భూతాలు, పంచేంద్రియాలు, మనసు, బుద్ధి, చిత్తం నీవే' అన్నాడు.

సృష్టి స్థితి లయ కారకులైన బ్రహ్మ విష్ణు రుద్రులు పరాశక్తి అయిన శ్రీదేవి సంకల్పంతో ఆవిర్భవించారు. శ్రీదేవీ శక్తిని అనుభూతి పొందిన బ్రహ్మ 'వేదాలు కూడా నీ శక్తిని వర్ణించలేవు, ముల్లోకాలకు నీవే సర్వజ్ఞురాలవు అన్నాడు. విష్ణువు ఆమెను వర్ణిస్తూ 'పండితుల యందు విద్య, శక్తిమంతుల యందు శక్తి, మానవులందు కీర్తి, తుష్టి నీవే' అన్నాడు. రుద్రుడు, పంచ భూతాలు, పంచేంద్రియాలు, మనసు, బుద్ధి, చిత్తం నీవే' అన్నాడు. (దేవీ పురాణము).

తనచే సృష్టించబడిన త్రిమూర్తుల మాటలకు సంతృప్తురాలైన శ్రీదేవి, త్రిమూర్తులకు సాత్విక, రాజస,తామస శక్తులను ఇచ్చి జగత్తు, సృష్టి స్థితి లయలకు అధిష్ఠులై జగత్తును పాలించమన్నది. వీరికి సహకరించేందుకు ఇచ్ఛా, క్రియా, జ్ఞాన శక్తులనే త్రిమూర్తులను తన విభూతులుగా సృష్టించి ఇచ్చింది. సరస్వతి రూపంలో బ్రహ్మకు, మహాలక్ష్మి రూపంలో విష్ణువుకు, మహాకాళి విభూతితో రుద్రునకు ఇచ్చి, ఇల్లాండ్రుగా ఉంటూ కర్తవ్యాలను నిర్వహించడంలో వారికి తోడ్పడుతూ ఉండుమని ఆదేశించి, తన స్థానమైన మణి ద్వీపానికి తరలిపోయింది జగన్మాత. ఈ సందర్భాన్ని కావ్యకంఠ గణపతి ముని అతి రమ్యంగా వర్ణించారు.

**బ్రహ్మ ముఖాబ్జే వాగ్వనితా, వక్షసి విష్ణోశ్శ్రీర్లలితా**
**శంభు శరీరే భాగమితా విశ్వ శరీరే వ్యోమ్ని తథా**

బ్రహ్మ ముఖాన సరస్వతిగా, విష్ణు వక్షాన లక్ష్మిగా, శివుని శరీరంలో అర్ధ భాగంగా, విశ్వ శరీరంలో ఆకాశ రూపంలో ఆకాశంగా అంతటా ఆమే ఉన్నది. లలితా సహస్ర నామాలలో పేర్కొన్న నామాలన్నీ జగన్మాతవే అన్నారు మహర్షులు. ఆ శక్తిని లేదా చైతన్యాన్ని పురుష రూపంలోగాని స్త్రీ రూపంలో గాని ధ్యానించవచ్చు. **'ఏకమేవాద్వితీయం బ్రహ్మ'** అన్నది అమ్మ.

దేవీ భాగవతంలో జగన్మాత మహిమను తెలియజేసే నాలుగు ముఖ్యమైన సంఘటనలు ప్రధానంగా దర్శనమిస్తాయి. దేవీ సప్తశతిలో రాక్షస సంహారానికై జగన్మాత అభివ్యక్త రూపాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఆ నాలుగు సంఘటనలు మధు కైటభుల వధ, మహిషాసురుని సంహారం, చండముండుల వధ, శుంభనిశుంభులు, వారి పరివారాన్ని అంతమొందించడం.

పద్మసంభవుడైన విధాతను మధు కైటభులు బాధించినప్పుడు ఆయన యోగ నిద్రా దేవిని స్తుతించాడు. ఆ స్తుతిని 'రాత్రి సూక్తం' అంటారు.

**విశ్వేశ్వరీం జగద్ధాత్రీం స్థితి సంహార కారిణీమ్**
**నిద్రాం భగవతీం విష్ణోరతులాం తేజసః ప్రభుః**
**నీలాశ్మ ద్యుతి మాస్యపాద దశకాం సేవే మహా కాళికాం**
**యామస్తౌత్స్వపితే హరౌ కమలజో హంతుంమధు కైటభమ్**

విధాత ప్రార్థనకు సంతుష్టి చెంది జగన్మాత మహాకాళి రూపంలో, నీల వర్ణంతో ఆవిర్భవించి మధు కైటభులను సంహరించింది.

మహిషాసురుని బారి నుంచి జగత్తును రక్షించడానికి జగన్మాత మహాలక్ష్మిగా అవతరించింది, మహిషాసురుని అంతమొందించింది.

**'...ప్రవాళ ప్రభాం సేవే సైరిభ మర్దినీమిహ మహాలక్ష్మీం సరోజ స్థితాం'** అని సప్తశతీ స్తోత్రంలో వర్ణించబడింది.

శుంభ నిశుంభులనే రాక్షసులను సంహరించేందుకు జగన్మాత నుంచి చంద్రికాసమానదేహ సరస్వతీ శక్తి సాక్షాత్కరించింది.

**గౌరీ దేహ సముద్భవాం త్రిజగతామాధార భూతాం**
**మహాపూర్వామత్ర సరస్వతీమనుభజే శుంభాది దైత్యార్దినీమ్**

ఆ రాక్షసుల్నీ పరివారాన్నీ తన అంశలతో అంతమొందించింది.

**యాదేవి సర్వ భూతేషు శక్తి రూపేణ సంస్థితా**
**నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః**

సమస్త ప్రాణి కోటిలో శక్తి రూపంలో ఉన్న ఆ దేవికి నమస్కారం అంటున్నది మార్కండేయ పురాణం. ఈ నామరూపాత్మక జగత్తంతా ఆ పరాశక్తే వ్యాపించి ఉన్నదన్నది యజుర్వేదం. శక్తిలేని పదార్థం ఏ పనీ చేయలేదని శంకర భాష్యం పేర్కొన్నది. దేవీ వైభవాన్ని దుర్గాసప్తశతి, దేవీ భాగవతం, లలితోపాఖ్యానం (బ్రహ్మాండ పురాణం), ఋగ్వేదంలోని దేవీ సూక్త మంత్ర భాగం, **'దేవ్యథర్వ శీర్షం'** వంటి గ్రంథాలు స్పష్టపరిచాయి. ఇవి కాక ఇతిహాస పురాణాలు, శాస్త్రాలు, కల్పాలు దేవీ వైభవాన్ని చాటి చెప్పాయి. ఏ సిద్ధాంతాన్ని అనుసరించే వారైనా దేవీ ఆరాధనకు ప్రాముఖ్యం ఇస్తారు.

**(తరువాయి భాగం రేపటి సంచికలో...)**

ఎ. సీతారామారావు

## నవరూపాల నవరాత్రి



నవరాత్రుల సంరంభం
నవజ్యోతుల సంబరం
పరమేశ్వరి ఆరాధనం ॥నవరాత్రుల॥

పాడ్యమిన ప్రారంభించేము
విదియ తదియల విడనాడక
లక్ష్యా లక్ష్య స్వరూపిణి లక్ష్మీ
లక్ష్యము సిద్ధించనీవమ్మా
మా లక్ష్యము సిద్ధించనీవమ్మా ॥నవరాత్రుల॥

చవితి చతుర్వేద సారం
పంచమి పంచాషట్ స్వరూపిణి
మహిషాసుర మర్దని
మధు కైటభ సంహారిణి
మమ్ముద్ధరించరావమ్మా ॥నవరాత్రుల॥

షష్ఠి సృష్టి స్వరూపిణి
సప్తమి సర్వ చైతన్య శక్తి
శుంభ నిశుంభ సంహారిణి
శుభములు అభయముగ
చేకూర్చే తల్లీ ॥నవరాత్రుల॥

అష్టమి అష్టాదశ స్వరూపిణి
నవమిన నవ చైతన్యవాణి
సృష్టి స్థితి లయకారిణి
మా ఇడుములు బాపే జగదీశ్వరి ॥నవరాత్రుల॥

దశమిన దయచూపే దయామయి
విజయము మా దరి చేర్చే
సర్వ చైతన్య శక్తి సర్వేశ్వరి
లోకపావని మహేశ్వరి
మాలోక పావని మహేశ్వరి ॥నవరాత్రుల॥

రాళ్ళపల్లి రామసుబ్బారావు
9908269665

## నేటి అవతారం
# మహాలక్ష్మీ దేవి

త్రిమూర్తుల శక్తిని ఇతిహాసపురాణాలు మూడు విధాలుగా అభివర్ణిస్తున్నాయి. వాటి ఆధారంగా శ్రీమహావిష్ణువుకు ఉండే శక్తిని మహాలక్ష్మిగాను, శంకరునిలోని శక్తిని మహాకాళిగా, బ్రహ్మలోని శక్తిని మహాసరస్వతిగా వ్యవహరిస్తున్నాము. శ్రీమహావిష్ణువు రక్షించువాడు, రుద్రుడు సంహరించువాడు, బ్రహ్మ సృష్టించువాడు. పరమాత్మ ఎలాగైతే ఒక్కడో అలాగే పరమాత్మలో ఉండే శక్తి కూడా ఒక్కటే. గుణాలను, పనులను బట్టి పేర్లు మారుతూ ఉంటాయి. ఈ మూడు శక్తులలో విశిష్టమైనది విష్ణుశక్తే.

**ఏకదేశస్థితస్యాగ్నేః జ్యోత్స్నా విస్తారిణీ యథా**
**పరస్య బ్రహ్మణోశక్తిః తదేదమఖిలం జగత్ ॥**

ఒక ప్రదేశంలో ఉన్న అగ్ని ప్రకాశం చాలా దూరం వరకు ప్రసరిస్తున్నట్టే పరమాత్మ శక్తి సకల ప్రపంచంలో వ్యాపించి ఉండునని ఈ శ్లోక భావం. ఇలా పరమాత్మకు ఉండే అనంత శక్తులలో ఒకటైన అహంతాశక్తియే 'మహాలక్ష్మి'గా వ్యవహరించబడుతుంది.

**తస్య యా పరమా శక్తిః జ్యోత్స్నే వ హిమదీధితేః**
**సర్వావస్థాగతా దేవీ స్వాత్మ భూతానపాయినీ**
**అహన్తా బ్రహ్మణస్తస్య సాహమస్మి సనాతనీ**

అని లక్ష్మీతంత్రములో ఇంద్రునికి, చంద్రునికి వెన్నెల వలె తాను ఆ శ్రీమన్నారాయణునికి పరమశక్తినని, సకలావస్థలలో విడిచి ఉండని దానినని లక్ష్మీదేవి పేర్కొంది. తానే అహంతాశక్తినని, సనాతన శక్తినని ఈ శక్తియే నారాయణి అని కూడా తెలిపింది.



**నిత్యానిర్దోష నిస్సీమ కల్యాణగుణశాలినీ**
**అహం నారాయణీ నామ సాసత్తా వైష్ణవీమాతా**

ఈవిధంగా నారాయణుని శక్తియే నారాయణిగాను, వైష్ణవిగాను, మహాలక్ష్మిగాను వ్యవహరించబడుతుంది. ఈ మహాలక్ష్మి స్వయంగా పరమాత్మకు విశేషణమై, ధర్మమై అనేక గుణములు, ధర్మములు, శక్తి శక్తిమలు కలదని గ్రహించాలి.

విష్ణుశక్తిగా చెప్పబడిన అహంతా శక్తియే ఆదిలక్ష్మి, అందులోనివే ఆ పరాశక్తి, విద్యాశక్తి అని స్పష్టపరచబడింది.

పరమాత్మగా చెప్పబడే శ్రీమన్నారాయణునికి అన్నివేళలా అన్ని కార్యాలను సమకూర్చేది శక్తే. ఈ జగత్తునంతా ఆమె లక్షిస్తుంది. అనగా చూస్తుంది, కటాక్షిస్తుంది, లక్ష్యంగా చేసుకుంటుంది. కావున లక్ష్మీ అయింది. శ్రీమహావిష్ణువు భావమును ఆశ్రయిస్తుంది కావున 'శ్రీ' అని వ్యవహరిస్తారు. అందరికీ కోరికలను తీరుస్తుంది కావున 'కమల' అయింది. అలాగే పద్మ, పద్మమాలిని అని కూడా లక్ష్మిని వ్యవహరిస్తారు. పరమాత్మ సృష్టిలో ఉన్న తారతమ్యములకు అమ్మవారి కనుబొమల కదలికే కారణం. కనుబొమలు ఎగురవేసినట్లయితే దేవతలుగాను, తక్కువగా ఎగురవేస్తే మానవులుగాను, కిందకి చేసినట్లయితే దానవులుగాను, అసలు కదల్చకుంటే పశువులుగాను పరమాత్మ సృష్టిస్తాడు. స్వామి రక్షణలో అమ్మ పురుషకార రూపంగా, సంహారంలో మహాకాళిగా సహకరిస్తుంది. పరమాత్మ మోక్షం ఇచ్చునట్లు చేసేది పురుషకారరూపం. జీవుల కర్మలను లక్ష్యంగా చేసుకొని సృష్టికార్యంలో సహకరిస్తుంది కావున ఆమ్మ శ్రీమహాలక్ష్మిగా, రక్షణలో శ్రీదేవిగా పేర్కొనబడుతుంది. అమ్మ దయ లేనిదే స్వామి అనుగ్రహం పొందలేము.

అమ్మవారి చూపులు, స్పర్శ అమృతం చిలకరిస్తాయి కావున లక్ష్మీదేవిని అమృతదృక్, అమృతా అని కూడా వ్యవహరిస్తారు.

నైవేద్యం:మహాలక్ష్మి దేవికి ఇష్టమైన నైవేద్యం లడ్డూలు, చక్కిలాలు, అరిసెలు, కజ్జికాయలు.



డా॥ కందాడై రామానుజాచార్య

# నవరాత్రులలో నవరత్నాలంకరణ

**ఆశ్వయుజ శుక్లపక్షంలో వచ్చే దసరా నవరాత్రులలో పాడ్యమి నుండి నవమి వరకు నవ మూర్తులను నవ రూపాలతో నవ విధమైన అలంకారాలతో, నవ వర్ణాలతో, నవ రత్నాలతో, నవ ఆభరణాలతో, నవ ధాన్యాలతో అలంకరించి ఈ నవ రాత్రుల్లో ఆరాధన చేస్తారు.**



1. పూర్తిగా తెలుపు రంగు అలంకారం చేసినపుడు స్ఫటిక మణులను ఆభరణాలుగా అలంకరిస్తారు
2. నీలి వర్ణము అలంకరించినపుడు నీల మణులతో చేసిన ఆభరణాలను అలంకరిస్తారు
3. ఎరుపు వర్ణ అలంకారం చేసినపుడు పగడం ఆభరణాలతో అలంకరిస్తారు
4. పసుపు పచ్చ వస్త్రాదులు కట్టినపుడు పుష్యరాగమును అలంకరిస్తారు
5. ధూమ్ర వర్ణం అనగా ఆకుపచ్చ, తెలుపు కలిపిన రంగుతో అలంకరించినపుడు మరకతముతో అలంకరిస్తారు
6. నలుపు, తెలుపు రంగులు కలిపిన అలంకారం చేసినపుడు మాణిక్యంతో అలంకరిస్తారు
7. పాండురవర్ణం అనగా పసుపు, తెలుపు అలంకారం చేసినపుడు ముత్యాలతో అలంకరిస్తారు
8. మేదుర వర్ణం అనగా ఎరుపు, నలుపుతో అలంకారం చేసినపుడు గోమేదికంతో అలంకరిస్తారు
9. ఎరుపు, నలుపు, తెలుపు వస్త్రాదులతో అలంకరించినపుడు రత్నాల ఆభరణాలతో అలంకరిస్తారు

ఈ విధంగా నవరాత్రులలో నవ వర్ణాలలో, నవరత్నాలతో అమ్మను రోజుకో రకంగా అలంకరించి నవ సిద్ధులను, బుద్ధులను ఆమె అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందాలి.

డా॥ కందాడై



మోహిని అవతారం

## బ్రహ్మోత్సవ సంరంభం

బ్రహ్మోత్సవాల్లో నేడు శ్రీవారు మోహిని అవతారంలో దర్శనమిస్తారు. అంతేకాక గరుడ వాహనంపై భక్తులకు కనువిందు చేస్తారు.



గరుడ వాహనం






# టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌లో 3డీలు కీలకం!

## ○ డెత్(మరణం)...డిసీజ్(వ్యాధి)... డిజెబిలిటీ(వైకల్యం)

దేశంలోని ప్రజల్లో నిశ్చితస్థితి ఎంతవరకు ఉంది...అనే అంశంపై ఇటీవల నిర్వహించిన ఒక అధ్యయనంలో 84శాతం మంది భారతీయులు తాము తీవ్రమైన అనిశ్చిత భావనకు గురవుతున్నట్టుగా వెల్లడించారు.

ఇందుకు గల కారణాల్లో... ఒకవేళ తనకేదైనా అయితే... తన కుటుంబ ఆర్థిక భద్రత పరిస్థితి ఏమిటి?' అనేది మొదటి అంశంగా ఉంది. హఠాత్తుగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యల వలన వైద్య ఖర్చులకు తాము చేసిన పొదుపు మొత్తం ఖర్చయిపో తుందనే భయం తరువాత అంశంగా ఉంది. కుటుంబంలో ఒక్కరే సంపాదిస్తున్న పరిస్థితుల్లో...తీవ్రమైన అనారోగ్యాలు వస్తే భరించాల్సిన ఖర్చులను గురించి కూడా ఎక్కువమంది ఆందోళనకు గురవుతున్నట్టుగా ఈ అధ్యయనంలో తేలింది.

ఏ కుటుంబానికైనా ఆర్థిక భద్రత చాలా ముఖ్యం. అది లేని కుటుంబాల్లో ఆ ఆందోళన కొనసాగుతూనే ఉంటుంది. ఆర్థికంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్న కుటుంబాల్లో ఆర్థిక భద్రతే పెద్ద బహుమతి అవుతుంది. ఆర్థిక అనిశ్చితులకు ఒక చక్కని పరిష్కారం మార్గం భీమా. ఆస్తులు, లబ్ధిదారులైన వారసులు ఉన్న వారికి ఎవరికైనా అతి ముఖ్యమైన పెట్టుబడి సాధనంగా టర్మ్ ఇన్సూరెన్స్ నిలుస్తుంది. ఇది కేవలం ఋణాలను తీర్చడంలో సహాయపడటమే కాదు మీ కుటుంబ భావి ఆర్థికావసరాలు అయినటువంటి చిన్నారుల విద్య, వివాహం మొదలైన వాటికి తగిన నిధులను అందిస్తుంది. ఒకవేళ మీకిప్పటికే టర్మ్ ఇన్సూరెన్స్ ఉంటే, మీకు ఓ ప్రశ్న... మీరు మీ టర్మ్ ప్లాన్‌లో 3డీలపై దృష్టి సారించారా? అసలు 3డీలు అంటే ఏమిటో మీకు తెలుసా? ఇంతకీ వాటి ప్రాధాన్యత ఏమిటి? టర్మ్ ఇన్సూరెన్స్ 3డీలు... 1 డెత్ (మరణం), 2 డిసీజ్ (వ్యాధి), 3 డిజెబిలిటీ (వైకల్యం)లను గురించి తెలుసుకుందాం.

### 1.డెత్ (మరణం)

కుటుంబంలో సంపాదనాపరుడు అనుకోకుండా మరణిస్తే, భావోద్వేగాల పరంగా కలిగే తీవ్రమైన ఆందోళనతో పాటుగా కుటుంబ ఆర్థిక భద్రతకు సైతం పెను విపత్తు కలుగుతుంది. ఈ అనిశ్చితికి సమాధానం టర్మ్ ఇన్సూరెన్స్. చాలామంది టర్మ్ ఇన్సూరెన్స్ ఖర్చుతో కూడుకున్నదని భావిస్తుంటారు తప్ప దానిని ఓ పెట్టుబడిగా భావించరు. తమ కుటుంబానికి భద్రతతో పాటుగా మనశ్శాంతిని ఇవ్వటంలో ఈ పథకాల అంతర్గత ప్రయోజనాలను అర్థం చేసుకోవడంలో అధికశాతం మంది విఫలమవుతుంటారు. మీ కుటుంబంలో సంపాదనాపరులు మీరు మాత్రమే అయి ఉండి, మీ పై ఆధారపడిన వారుంటే వీటి గురించి తెలుసుకోవడం తప్పనిసరి. అందుబాటులో ప్రీమియం రేట్లతో, పాలసీ హెూల్డరు మరణించినప్పుడు నామినీ ఆర్థిక సహకారాన్ని అందుకోవడం ఈ టర్మ్ ఇన్సూరెన్స్ యొక్క ప్రధాన ప్రయోజనం. పాలసీ కాలంలో ఒకవేళ పాలసీదారుడు మరణిస్తే నామినీకి ఏకమొత్తంలో నగదు చెల్లిస్తారు. ఈ డెత్ ప్రయోజనంతో పాటుగా ప్రీమియం చెల్లింపులపై పన్ను ప్రయోజనాలను సైతం పొందవచ్చు. లబ్ధిదారునికి ట్యాక్స్‌ఫ్రీ చెల్లింపులు జరుగుతాయి.

### 2. డిసీజ్ (వ్యాధి)

అనారోగ్యకరమైన, ఒత్తిడితో కూడిన జీవనశైలి కారణంగా ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన వ్యాధుల భారం పెరిగిపోతోంది. ఈ వ్యాధులకయ్యే చికిత్స ఖర్చు కారణంగా పొదుపు సొమ్ము మొత్తం ఖాళీ అవుతుంది. అందువల్ల, టర్మ్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయాలనుకున్న వారు తప్పనిసరిగా క్రిటికల్ ఇల్‌నెస్ బెనిఫిట్ రైడర్‌ని కూడా ఎంచుకోవాలి. ఇది ఉన్నపుడు....పాలసీ హెూల్డర్లకు అతి తీవ్రమైన వ్యాధులైనటువంటి క్యాన్సర్, హార్ట్ ఎటాక్ లేదా బహుళ అవయవాలు విఫలంకావడం... లాంటివి నిర్ధారించిన పరిస్థితుల్లో నగదు చెల్లించడం జరుగుతుంది. ఈ తరహా ప్లాన్స్ సాధారణంగా ఫిక్స్‌డ్ బెనిఫిట్ ప్లాన్స్. ఇవి ఏకమొత్తంలో చెల్లింపులను అందజేస్తాయి. ఈ రైడర్‌ను కొనుగోలు చేయడం వలన ఇది కేవలం ఆదాయ భర్తీగా మాత్రమే కాకుండా... ఇంటి ఖర్చులైనటువంటి విద్య, వైద్యం, ఇంటి అద్దె మొదలైన వాటిని నిర్వహించడంలో సైతం ఉపయోగపడతాయి. ఉదాహరణకు, మీరు ఒకవేళ కోటి రూపాయల హామీ మొత్తానికి టర్మ్ ఇన్సూరెన్స్ అదనపు క్రిటికల్ ఇల్‌నెస్ బెనిఫిట్‌ను 25 లక్షల రూపాయలకు కొనుగోలు చేశారు. దురదృష్టవశాత్తు ఐదు, పదేళ్ల తరువాత మీకు ఏదైనా తీవ్రమైన వ్యాధి ఉన్నట్లుగా నిర్ధారణ అయితే మీరు సంపాదించలేకపోవచ్చు. ముందుగా చెప్పబడిన వ్యాధికి సంబంధించిన భీమా ప్రొవైడర్ మీకు 25 లక్షల రూపాయల మొత్తంను చెల్లిస్తాడు. ఒకవేళ ఈ పాలసీ కాలంలో పాలసీ గ్రహీత మరణిస్తే, అతనిపై ఆధారపడిన వారు అదనంగా ఒక కోటి రూపాయలు పొందగలరు.

### 3. డిజెబిలిటీ (వైకల్యం)

చాలా వరకూ టర్మ్ ఇన్సూరెన్స్ అనగానే మరణం వల్ల కోల్పోయిన ఆదాయాన్ని భర్తీ చేసే వనరుగానే భావిస్తారు. కానీ కేవలం కొద్దిమంది మాత్రమే తీవ్రమైన ప్రమాదాల వల్ల వైకల్యం సంభవించడం వల్ల ఎదురయ్యే ఆదాయ నష్టం గురించి ఆలోచిస్తారు. ఇది మరణానికన్నా మించిన బాధను కలిగిస్తుంది. ఆదాయం లేకుండా ఇంటిలో గడిపే ఇబ్బందిని తప్పిస్తూ, మీరు మీ టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌పై ప్రత్యేక రైడర్స్‌ను... వైకల్యం సంభవించే పరిస్థితుల్లో పొందవచ్చు. ఈ తరహా కేసులలో శాశ్వత లేదా పాక్షిక అంగవైకల్యం కారణంగా సాధారణ జీవితాన్ని పొందే అవకాశం కోల్పోవచ్చు. అప్పుడు బీమా కంపెనీ హామీ చేసిన మొత్తానికి నష్టపోయిన ఆదాయాన్ని భర్తీ చేస్తుంది. కొన్ని కేసులలో, కొన్ని రకాల టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్స్... పాలసీ గ్రహీత శాశ్వత వైకల్యం పొందిన పరిస్థితుల్లో భావి ప్రీమియంలను చెల్లించాల్సిన అవసరాన్ని లేకుండా చేస్తాయి.. పూర్తి వైకల్యం సంభవించిన పరిస్థితుల్లో పాలసీ గ్రహీత హామీ ఇవ్వబడిన మొత్తం పొందుతారు. అదే పాక్షిక వైకల్యం కేసులలో భీమా తీసుకున్న వ్యక్తి పాక్షిక మొత్తాన్ని మాత్రమే పొందుతాడు. భీమా కంపెనీని అనుసరించి ఈ నియమనిబంధనలు పేఔట్ ప్లాన్స్ విభిన్నంగా ఉండవచ్చు.

ఓ టర్మ్ ప్లాన్ కొనుగోలు చేసే ముందు 3డీల ప్రమాదాలను పరిగణలోకి తీసుకోవడం అవసరం. నేటి కాలంలో ప్రతి సందర్భంలోనూ ఆర్థికంగా మిమ్మల్ని మీరు ప్రమాదం నుంచి కాపాడుకోవడం ఒక్కటే మార్గం. అందువల్ల క్రిటికల్ ఇల్‌నెస్ యాక్సిడెంట్ రైడర్స్ వంటి జీవిత భీమా పరిష్కారాలు టర్మ్ ప్లాన్‌ను మరింత బలోపేతం చేస్తాయి. మీ టర్మ్ ప్లాన్‌లో 3డీ షీల్డ్ ఉందో లేదో పరిశీలించి తగు చర్యలను తీసుకునేందుకు ఇది మంచి సమయం!





అనిల్ కుమార్ సింగ్,
చీఫ్ ఆక్చ్యురియల్ ఆఫీసర్,
ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్

# ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ మళ్లీ అగ్రశ్రేణి

**బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ కేటగిరీ చార్టుల్లో**




ముంబై సగటు నికర ఈక్విటీ ఎక్స్పోజర్ 47శాతంతో ఫండ్ గత సంవత్సరంలో 8.1 శాతం పంపిణీ చేసింది. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారులలో ఫండ్ యొక్క బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ కేటగిరి ఆఫ్ ఫండ్ ప్రముఖ పెట్టుబడి ఉత్పత్తిగా అవతరించింది. మార్కెట్ స్థాయిలు / మదింపుల ఆధారంగా ఈక్విటీ మరియు అప్పులలో పెట్టుబడి పెట్టడానికి ఫండ్ యొక్క సామర్థ్యం ఒక కారణం. దీని అర్థం ఫండ్ నిర్వాహకులు ఆకర్షణీయంగా కనిపించే ఆస్తి తరగతుల్లోకి పెట్టుబడి పెట్టవచ్చు, తద్వారా స్పెక్ట్రం అంతటా లభించే అవకాశాలను ఎక్కువగా పొందవచ్చు.

### ఫండ్ పనితీరు

ఆర్థ్‌లాబ్.కామ్ డేటా ప్రకారం, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఈ విభాగంలో అత్యంత స్థిరమైన ప్రదర్శనకారులలో ఒకటి. ఇది పెట్టుబడిదారులకు వారి పెట్టుబడికి సహాయపడటమే కాక, మార్కెట్ తిరోగమన సమయంలో మూలధనం బాగా రక్షించబడిందని నిర్ధారిస్తుంది. గత ఒక సంవత్సరంలో సగటు నికర ఈక్విటీ ఎక్స్పోజర్ 47 శాతం ఉన్న ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ గత సంవత్సరంలో 8.1 ఇవ్వగలిగింది. కేటగిరి సగటు 5.9, నిఫ్టీ 50 టిఆర్ఐ కేవలం 4.7

అయితే, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ పెట్టుబడిదారులు చాలా సంతోషంగా ఉన్నారు. మార్కెట్లో గత కొన్ని గందరగోళ సంవత్సరాల్లో ఈ ఫండ్ అత్యుత్తమ పెట్టుబడిదారుల అనుభవాన్ని అందించగలిగింది. ఫండ్ దాని లేబుల్‌కు నిజం అయినందున ఇది సాధ్యమైంది. ఆగష్టు సెప్టెంబర్ 2018 చుట్టూ ఈక్విటీ మార్కెట్ క్రమంగా వెళుతున్నప్పుడు ఈ ఫండ్ తదనుగుణంగా 30 శాతం తక్కువ ఈక్విటీ కేటాయింపును కలిగి ఉంది, ఇది సెబీ ఆదేశించిన విధంగా నిర్వహించాల్సిన కనీస ఈక్విటీ కేటాయింపు కూడా.




ఏదేమైనా, ఫండ్ హౌస్‌లు ఆస్తి తరగతుల మధ్య ఎలా కేటాయించాలో ప్రామాణికమైన ప్రక్రియ లేదు. ఉదాహరణకు అతిపెద్ద ఫండ్‌లో ఒకటి బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ మార్గదర్శకుడు. ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ దాని ఆస్తి కేటాయింపును నిర్వహించడానికి అంతర్గత ఆస్తి కేటాయింపు నమూనాను ఉపయోగిస్తుంది. అంటే మోడల్ ఆధారంగా, ఈక్విటీలు లేదా అప్పుల్లో పెట్టుబడులు పెట్టాలా వద్దా అని ఫండ్ మేనేజర్ నిర్ణయిస్తారు. ఈ వర్గంలోని ఇతర నిధుల గురించి కూడా చెప్పలేము.

### లేబుల్ కు నిజం

దాని ఆదేశం ప్రకారం ఫండ్ యొక్క సమతుల్య ప్రయోజన వర్గం మార్కెట్లకు ప్రతి చక్రీయ విధానాన్ని తీసుకుంటుంది. ఇక్కడ ఉన్న ఫండ్ తక్కువ కొనడానికి అధికంగా విక్రయించడానికి ప్రయత్నిస్తుంది. ఈక్విటీ విలువలు ఎక్కువగా ఉన్నప్పుడు రుణాన్ని కొనుగోలు చేయడానికి ఇది అనువదిస్తుంది. ఏదేమైనా అనేక ఫండ్ హౌస్‌లు వర్గం యొక్క స్ఫూర్తిని కోల్పోయాయని డేటా సూచిస్తుంది.

అనేక నిధులు ఉన్నాయి. ఇందులో ఆస్తి కేటాయింపు చాలా కాలం పాటు స్థిరంగా ఉంది. అలాగే మారుతున్న మార్కెట్ పరిస్థితుల ఆధారంగా ఆస్తి తరగతుల మధ్య టోగుల్, ఈ వర్గం యొక్క ముఖ్యమైన నిర్వచించే లక్షణాలకు కూడా మిస్ ఇవ్వబడింది. ఇది ఫండ్ యొక్క పనితీరును నిరంతరం ప్రభావితం చేస్తుంది. సమతుల్య ప్రయోజన వర్గం యొక్క ఆదేశం నుండి పెట్టుబడిదారులకు లాభం పొందే అవకాశాలను నిరాకరించింది.ఫలితంగా, తగ్గిన ఈక్విటీ ఎక్స్పోజర్తో కూడా ఫండ్ నిఫ్టీ 50 ను అధిగమించగలిగింది, తద్వారా ఆస్తి కేటాయింపు శక్తిని ప్రదర్శిస్తుంది. తద్వారా ఆస్తి కేటాయింపు యొక్క శక్తిని ప్రదర్శిస్తుంది.

**ఫలితంగా, తగ్గిన ఈక్విటీ ఎక్స్పోజర్తో కూడా ఫండ్ నిఫ్టీ 50 ను అధిగమించగలిగింది, తద్వారా ఆస్తి కేటాయింపు శక్తిని ప్రదర్శిస్తుంది. తద్వారా ఆస్తి కేటాయింపు యొక్క శక్తిని ప్రదర్శిస్తుంది.**

| వివరములు | 1 సంవత్సరం | 3 సంవత్సరాలు | 5 సంవత్సరాలు | 10 సంవత్సరాలు |
|---|---|---|---|---|
| ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ | 9.23 | 7.38 | 8.40 | 11.60 |
| డైనమిక్ అసెట్ కేటాయింపు వర్గం | 6.85 | 6.30 | 7.65 | 10.19 |
| నిఫ్టీ 50 టిఆర్ఐ | 4.7 | 10.42 | 9.01 | 10.05 |

# హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలుదారులకు చిట్కాలు




మానసికంగా, శారీరకంగా ఆరోగ్యకర జీవితం పొందాలంటే ఎల్లవేళలా ఫిట్‌గా ఉండటం అత్యంత ప్రాధాన్యం. అయినప్పటికీ ఒక్కోసారి కొందరు అనారోగ్యానికి గురవుతారు. వాళ్లు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ వారిని అనారోగ్యం వెంటాడుతుంది. ఇటువంటి సమయంలో హెల్త్ ఇన్సూరెన్స్ అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. మీరు ఆర్థికంగా ఎటువంటి ఇబ్బందులు పడకుండా హెల్త్ ఇన్సూరెన్స్ దోహదపడుతుంది.

సరైన హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని ఎంపిక చేసుకోవాలి. ఎక్కువ ప్రయోజనాలు ఉండేవిధంగా జాగ్రత్త పడాలి. అదే సమయంలో నాణ్యమైన వైద్య చికిత్స అందించాలి.

సరైన హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని ఎంచుకోవాలి. మొదటిసారి కొనుగోలు దారులు అన్ని విషయాలు తెలుసుకోవాలి.

### యుక్త వయసులో ఉన్నప్పుడు...

మీరు యుక్త వయసులో ఉన్నప్పుడు హెల్త్ ఇన్సురెన్స్ కొనుగోలు చేస్తున్నట్లయితే మీ పాలసీ ప్రీమియం పరిగణలోకి తీసుకోవాలి. మీరు 30 ఏళ్లు ఉన్నట్లయితే తక్కువ ఖర్చు అవుతుంది. అదే 50 ఏళ్ల వరకు ఉంటే ఎక్కువ మొత్తంలో ఖర్చవుతుంది. వయసు ప్రధాన భూమిక వహిస్తుంది.

### మంచి పాలసీని ఎంచుకోవాలి

హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ విషయంలో ఎల్లవేళలా మన అవసరాలకు తగ్గట్టు పాలసీని ఎంచుకోవాలి. దీనివల్ల అనారోగ్యానికి గురయినప్పుడు బాగా దోహదపడే పాలసీ అవసరమవుతుంది. గ్రూప్‌మెడికల్ కవర్ (జిఎంసి) మీకు సరిపోతుందా? మీరు వ్యక్తిగత పాలసీ తీసుకోవాలనుకుంటున్నారా? మీరు ఎంప్లాయర్ మీద ఆధారపడకుండా పాలసీ తీసుకోవాలనుకుంటున్నారా? సూపర్ టాప్ అప్ పాలసీ ఎంచుకోవాలనుకుంటున్నారా? ఈ ప్రశ్నలు




మిమ్మల్ని మీరు వేసుకోండి. ఒకవేళ అనుమానాలు ఉన్నట్లయితే మాత్రం ఇన్సూరెన్స్ కంపెనీలను సంప్రదించాలి.

### బ్యాక్‌గ్రౌండ్ చూసుకోవాలి

ఇన్సూరెన్స్ కంపెనీ చరిత్ర తెలుసుకోవాలి. ఇన్సూరెన్స్ కంపెనీలో కొనుగోలు చేస్తే మంచిదా ? కాదా? అనేది తెలుసుకోవాలి. నెట్ వర్క్ హాస్పిటల్స్ ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకోవాలి. కంపెనీ గూర్చి పూర్తి అవగాహన కలగడానికి నెట్ వర్క్ హాస్పిటల్స్ జాబితా చూస్తే తెలిసిపోతుంది. దీంతో పాటు మీరు మిగతా కంపెనీల పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవాలి. మార్కెట్ లో ఈ కంపెనీ నిలబడుతుందా? లేదా? అనేది కూడా తెలుసుకోవాలి. హెల్త్ ఇన్సూరెన్స్ కవర్‌లో ధర ఒక్కటే పరిగణలోకి తీసుకోవాల్సిన అంశం కాదు. ధరను ఒక ఆప్షన్‌గా ఎంచుకోవాలి తప్పితే అదే ప్రమాణికంగా తీసుకోవడం మంచి పద్ధతి కాదు.

### పాలసీ నియమ నిబంధనలు

హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలలో కొన్ని నియమ నిబంధనలుంటాయి. వాటిని పూర్తిగా అధ్యయనం చేయాలి. వెయిటింగ్ పీరియడ్ ఎంతవరకు ఉండాలి? ప్రస్తుతం ఉన్న రుగ్మతలు, గది అద్దె వంటివన్నీ తెలుసుకోవాలి. మీరు పాలసీని కొనుగోలు చేసే ముందు అన్ని అంశాలను తెలుసుకోవాలి. వైద్య సంబంధమైన ఖర్చులు పెరగడంతో సరైన హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని ఎంచుకోవాలి. దీనివల్ల ఆర్థికంగా ఎటువంటి ఇబ్బందులు రావు. మొదటిసారి ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నప్పుడు ప్రశాంతంగా ఉండే విధంగా జాగ్రత్తపడాలి. హాస్పిటల్ బిల్లులు తడిసిమోపెడు అవుతున్న సందర్భంగా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ అనివార్యం.

గుర్‌దీప్ సింగ్ బాత్రా
బజాజ్ అలియెంజ్ జనరల్ ఇన్సూరెన్స్

# కబడ్డీ కోచ్‌లుగా గోపీచంద్, తమన్నా

'ఏమైంది ఈ వేళ', 'రచ్చ' చిత్రాల ఫేమ్ సంపత్ నంది తన కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. గోపీచంద్, తమన్నా జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. గురువారం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభించారు. తొలి సన్నివేశానికి బోయపాటి శ్రీను క్లాప్ కొట్టారు. రాజమండ్రి ఎంపి. మార్గాని భరత్ రామ్ కెమెరా స్విచాన్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు బివిఎస్ఎన్. ప్రసాద్, అనీల్ సుంకర, కెకె.రాధామోహన్, యువ దర్శకుడు ప్రశాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు. ''గౌతమ్ నందా తర్వాత సంపత్ నంది ఓ మంచి స్క్రిప్ట్‌తో వచ్చాడు. మళ్లీ ఆయనతో చేయడం ఆనందంగా ఉంది'' అని హీరో గోపీచంద్ అన్నారు. ''హీరోయిన్ తమన్నాతో తొలిసారి కలిసి పనిచేస్తున్నాను'' అని చెప్పారు. చిత్ర దర్శకుడు సంపత్ నంది మాట్లాడుతూ ''తొలిసారి క్రీడా నేపథ్యం సినిమా చేస్తున్నాను. దీనికోసం చాలా పరిశోధన చేయడం జరిగింది. ఆంధ్రాకి లీడ్ చేసే మహిళా కబడ్డీ టీమ్ కోచ్‌గా గోపీచంద్, తెలంగాణ కబడ్డీ టీమ్ కోచ్‌గా తమన్నా నటిస్తున్నారు'' అని తెలిపారు. ''దర్శకుడు సంపత్ నందితో తనకిది మూడవ సినిమా'' అని నటి తమన్నా తెలిపింది. నిర్మాత మాట్లాడుతూ ''గోపీచంద్‌తో సినిమా తీయాలని చాలా సంవత్సరాలుగా అనుకుంటున్నా. ఇప్పటికి కుదిరింది'' అని చెప్పారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణ: సౌందర్ రాజన్, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: సంపత్ నంది.





ఐశ్వర్యారాయ్



# సైరా నా 150 చిత్రాలతో సమానం..

**- చిరంజీవి**

మెగాస్టార్ చిరంజీవి తాజా చిత్రం సైరా నరసింహారెడ్డికి ప్రేక్షకాదరణ దక్కుతోందని చిత్ర బృందం తెలిపింది. సినిమా విజయోత్సవ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని ఓ హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిరంజీవి మాట్లాడుతూ...స్వాతంత్ర సమరయోధుడి జీవిత కథలో నటించాలనే కోరిక ఎప్పటి నుంచో ఉండేది. ఇరవై ఇళ్ల కిందటే ఈ ప్రయత్నాలు మొదలయ్యాయి. అప్పట్లో భగత్ సింగ్ చేయాలని అనుకున్నాం. ఈ సినిమాలు చారిత్రక నేపథ్య కథలు కాబట్టి నిర్మాణ వ్యయం ఎక్కువవుతుందని ఆగుతూ వచ్చాం. అది ఇన్నాళ్లకు కుదిరింది. నా నూటా యాభై చిత్రాలు ఒకెత్తు, ఈ ఒక్క సినిమా ఒకెత్తు. సైరాకు అంతటా మంచి ఆదరణ దక్కుతోంది. ముంబైలో ప్రివ్యూ వేస్తే అక్కడి పాత్రికేయులు, సినిమా వాళ్లు చాలా బాగుందంటూ ట్వీట్‌లు చేశారు. సినిమా పూర్తయ్యాక గౌరవంగా లేచి నిలుచుని చప్పట్లు కొట్టారట. ఈ సినిమా తెలుగు స్వాతంత్ర యోధుడికి గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. నా కలలాంటి ఈ సినిమా అనుకున్నట్లు మీ ముందుకు వచ్చేందుకు ఎంతోమంది కృషి చేశారు. అమితాబ్ బచ్చన్ గారు ఆయన ఖర్చులతో వచ్చి, ఇక్కడ షూటింగ్ చేసి వెళ్లారు. స్నేహితుడి కోసం ఈ మాత్రం చేయనివ్వండి అంటూ చెప్పారు. ఆయన రుణం ఎలా తీర్చుకోగలం. నాతో పాటు అనేక మంది నటీనటులు తమ పాత్రల్లో మెప్పించారు. కథ రాసిన పరుచూరి సోదరుల నుంచి అనేక మంది సాంకేతిక నిపుణులు..సైరా ఇంత అందంగా తెరకెక్కేందుకు శ్రమించారు. అందరికీ కృతజ్ఞతలు. అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత చరణ్, దర్శకుడు సురేందర్ రెడ్డి, తమన్నా, జగపతి బాబు, ఇతర చిత్ర బృందం పాల్గొన్నారు.

# ఆకట్టుకునే స్పై థ్రిల్లర్...



తిరు

గోపీచంద్ హీరోగా స్పై థ్రిల్లర్ సినిమా చాణక్యను తెరకెక్కించారు దర్శకుడు తిరు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చాణక్య చిత్ర విశేషాలను తిరు వివరించారు. ఆయన మాట్లాడుతూ...గోపీచంద్ శౌర్యం సినిమాలో నటిస్తున్నప్పటి నుంచి ఆయనతో నాకు పరిచయం ఉంది. ఆ చిత్ర దర్శకుడు శివ నాకు స్నేహితుడు. గోపీచంద్‌తో ఓ మంచి యాక్షన్ సినిమా చేయాలని అప్పుడే నిర్ణయించుకున్నాం. చాణక్య అనేది ఒక గూఢచారికి సంబంధించిన కథ. అతను ఓ ఆపరేషన్ చేపడతాడు. అదేంటి, అందులో ఎలా విజయం సాధించాడు అనేది చూపిస్తున్నాం. కథ ప్రకారం ప్రతినాయకుడు పాకిస్థాన్‌లో ఉంటాడు. అంతేగానీ ఇందులో భారత్ పాకిస్థాన్ శత్రుత్వానికి సంబంధించి ఏ విధమైన అంశాలుండవు. నాకు పలువురు ముస్లిం స్నేహితులున్నారు. వాళ్ల మనోభావాలను ఎక్కడా కించపరచలేదు. కొందరు ఈ సినిమాను హాలీవుడ్ చిత్రాలతో పోలుస్తున్నారు. అలాంటిదేం లేదు. సల్మాన్ ఖాన్ ఏక్ థా టైగర్ చిత్రంతోనూ పోలికలు ఉండవు. రవీంద్ర అనే ఒక ఎస్పై ఉన్నాడు. అతనికి బ్లాక్ టైగర్ అని పేరు. అతని స్ఫూర్తి ఈ కథలో ఉంటుంది. అందుకే ఓ పాత్రకు రవీంద్ర అని పేరు పెట్టాను. చాణక్య కథ కోసం హీరో పాత్ర కోసం ఎన్ఐఏ, రా, సీఐఏ ఏజెంట్ల వ్యవహార శైలిని గురించి అధ్యయనం చేశాను. దాదాపు ఐదేళ్లు ఈ కథ మీద కసరత్తు చేసి బాగా రాసుకున్నాం కాబట్టి సినిమా ఫలితం నమ్మకంగా ఉన్నాం. తెలుగు తమిళంలో కొన్ని అవకాశాలు ఉన్నాయి. త్వరలో వెల్లడిస్తా. అంతా కుదిరితే చాణక్య 2 కూడా చేస్తాం. గోపీచంద్ అంకితభావమున్న నటుడు సినిమా చివరి షూటింగ్ రోజు అతనికి ప్రమాదం జరిగింది. మా అందరికీ ధైర్యం చెప్పి, వీలైనంత త్వరగా సినిమా పూర్తి చేశారు. అన్నారు.

# నా కోపాన్ని... ద్వేషాన్ని చూపిస్తా..?

అందాల భామ ఐశ్వర్యారాయ్ ఇప్పటివరకు ముద్దు ముద్దుగా పలికిన డైలాగ్‌లనే విన్నాం. ఇకపై నా కోపాన్ని...ద్వేషాన్ని చూపిస్తా...అంటూ చెప్పిన డైలాగ్‌లు నటనలోని మరో కోణాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఇంతకీ అసలు విషయం ఏంటంటే....హాలీవుడ్ ప్రముఖ తార ఏంజెలీనా జోలీ తాజాగా నటిస్తున్న చిత్రం మాలిఫిసెంట్: మిస్ట్రస్ ఆఫ్ ఈవిల్. ఇందులో మాలిఫిసెంట్ అనే దుష్ట పాత్రలో ఏంజెలీనా కనిపించబోతోంది. ఈ చిత్రాన్ని ఇంగ్లీష్‌తో పాటు హిందీలో కూడా విడుదల చేయబోతున్నారు. కాగా హిందీ వెర్షన్‌కు సంబంధించిన ఏంజెలీనా ధరించిన దుష్ట పాత్రకు విశ్వసుందరి ఐశ్వర్యారాయ్ చేత డబ్బింగ్ చెప్పించారు. ఆ పాత్ర కోసం ఐశ్ పలికిని డైలాగులే అవి. కాగా ఈ చిత్రం ట్రైలర్‌లోఐశ్ ఈ డైలాగులు చెబుతూ నల్ల డ్రస్సులో ఆకట్టుకుంటున్నారు. ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రాన్ని వాల్ట్ డిస్నీ సంస్థ నిర్మించగా...జోచిమ్ రోనింగ్ దర్శకత్వం వహించారు.



# కలెక్షన్లలో దూసుకెళుతున్నవార్

## తొలి రోజు 53.35 కోట్లు

హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ కలిసి నటించిన 'వార్' సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకువచ్చింది. భారీ అంచనాలున్న ఈ సినిమా ఎలాంటి విజయం సాధిస్తుందనే విషయంపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొని ఉండగా, అంతా ఆశించినట్టుగానే బాక్సాఫీస్‌విజయం చేజిక్కించుకుంది. హిందీతో పాటుగా తెలుగు, తమిళ్ భాషల్లో 'వార్' సినిమాను విడుదల చేశారు. మొదటి రోజు 53.35 కోట్లు రాబట్టింది. దేశవ్యాప్తంగా 4000 స్క్రీన్స్‌లో విడుదల చేశారు. తెలుగు, తమిళ్ భాషల్లో 1.75 కోట్లు వచ్చినట్ట సినీ ట్రేడ్ వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకు బాలీవుడ్‌లో ఇదే హయ్యెస్ట్‌గ్రాస్ అని తెలిసింది. గతంలో అమీర్ ఖాన్ నటించిన 'థగ్స్ ఆఫ్ హిందూస్తాన్ ' సినిమా తొలిరోజు 52 కోట్లు కలెక్ట్ చేసరింది. ఈ రికార్డ్‌ను 'వార్' అధిగమించింది. ప్రస్తుత అంచనా ప్రకారం బాలీవుడ్‌లో అత్యధిక గ్రాస్ సాధించే దిశగా ఉందని అంటున్నారు. యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్ మిళితం చేస్తూ ఈ సినిమా తీశారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించారు. ఆదిత్య చోప్రా నిర్మించారు. మనదేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం దూసుకెళుతోంది. బుధవారం హాలీవుడ్ సినిమా జోకర్ కూడా విడుదలైంది. ఈ సినిమా తొలిరోజు రూ.6 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసినట్టు సమాచారం 'వార్' సినిమాలో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ యాక్షన్ పార్ట్ ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించిందని ట్రేడ్ వర్గాలు తెలిపాయి. కొంత విరామం తర్వాత హృతిక్ నటించిన పూర్తిస్థాయి కమర్షియల్ సినిమా ఇది.



అక్షయ్‌కుమార్

# హిజ్రా లుక్‌లో...

విభిన్న పాత్రలకు పెద్దపీట వేస్తుంటారు బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్. ఆయన చేసిన సినిమాలను చూస్తే ఈ విషయం ఇట్టే అర్థమౌతుంది. ముఖ్యంగా కొంతకాలంగా ఆయన ఎంచుకుంటున్న పాత్రలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్యాడ్‌మ్యాన్, గోల్డ్ వంటి పలు చిత్రాల్లోని పాత్రలను ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఓ వైపు కథానాయకుడిగా వెలుగుతున్నప్పటికీ ఇటీవల 2.ఓ. చిత్రంలో ప్రతినాయకుడి పాత్రలో తన నటనా కౌశలాన్ని ప్రదర్శించిన తీరు ఆయనను మరోస్థాయిలో నిలబెట్టింది. ఇదిలావుండగా...ప్రస్తుతం హౌస్‌ఫుల్-4, గుడ్‌న్యూస్, సూర్యవంశీ, లక్ష్మీబాంబ్ తదితర బాలీవుడ్ చిత్రాలతో బిజీగా ఉన్నారాయన. ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న లక్ష్మీబాంబ్ చిత్రంలో హిజ్రాగా కనిపించేందుకు కూడా ఆయన వెనుకాడలేదు. రాఘవ లారెన్స్ ప్రధాన పాత్రలో నటించడంతో పాటు దర్శకత్వం వహించిన కాంచన (ముని-2) చిత్రం తెలుగు, తమిళ భాషలలో ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. ఇప్పుడు అదే చిత్రం హిందీలో లక్ష్మీబాంబ్ పేరుతో రీమేక్ అవుతోంది. కాంచన చిత్రంలో హిజ్రా పాత్రలో శరత్‌కుమార్ నటించి...విమర్శకుల చేత కూడా ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం తెరకెక్కుతున్న లక్ష్మీబాంబ్ చిత్రంలో అదే హిజ్రా పాత్రలో అక్షయ్‌కుమార్ నటిస్తున్నారు. ఆ పాత్రకు సంబంధించిన అక్షయ్‌కుమార్ లుక్‌ను సోషల్‌మీడియాలో విడుదలచేశారు. ఎరుపు రంగు చీరతో కాళికామాత పక్కన సీరియస్ లుక్‌తో అక్షయ్ కనిపిస్తున్నారు. రాఘవ లారెన్స్ దర్శకత్వం వహిస్తున్న ఈ రీమేక్‌లో కియారా అద్వాని నాయికగా నటిస్తోంది. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



# నవంబర్ ఒకటిన మీకు మాత్రమే చెప్తా

'మీకు మాత్రమే చెప్తా' అంటున్నాడు హీరో విజయ్ దేవరకొండ. ఆయన నిర్మాతగా తీసిన తొలి సినిమా పేరు 'మీకు మాత్రమే చెప్తా'. తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం, అనసూయ భరద్వాజ్, వాణి భోజన్ ప్రధాన పాత్రధారులు. షమ్మీర్ సుల్తాన్ దర్శకత్వం వహించారు. వినోదభరితమైన కథతో తీస్తున్న ఈ చిత్రాన్ని నవంబర్ ఒకటవ తేదీన విడుదల చేయబోతున్నారు. నిర్మాత వర్ధన్ దేవరకొండ మాట్లాడుతూ ''మంచోడు అనే ఇమేజ్‌ని కాపాడుకునేందుకు ప్రతి మనిషి ప్రయత్నిస్తుంటాడు. ఆ ఇమేజ్‌ని డామేజ్ చేసే చిన్న తప్పును దిద్దుకునే ప్రయత్నంలో ఎలాంటి కామెడీ పండింది అనేది చిత్రకథ. యువతని ఆకట్టుకునే విధంగా ఉన్న సినిమా ఇది'' అని చెప్పారు. కింగ్ ఆఫ్ ద హిల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమాకు ఛాయాగ్రహణం:మదన్ గుణదేవా, సంగీతం: శివకుమార్, నిర్మాతలు: విజయ్ దేవరకొండ, వర్ధన్ దేవరకొండ.



# ఎమ్జీఆర్ పాత్రలో అరవింద్ స్వామి

తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత బయోపిక్ నిర్మాణంలో ఉన్న విషయం తెలిసిందే. ప్రముఖ బాలీవుడ్ నటి కంగనా రనౌత్ జయలలిత పాత్రలో నటిస్తున్నారు. ఇందులో మరో అతి ముఖ్యమైన ఎమ్జీఆర్ పాత్రలో అరవింద్ స్వామి నటిస్తారని చిత్ర బృందం పేర్కొంది. ఎ.ఎల్. విజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ నవంబర్ నుండి మొదలుకానుంది. ఈ సినిమాకు విజయేంద్రప్రసాద్ రచయితగా పనిచేస్తున్నారు. హిందీ, తమిళ్, తెలుగు భాషల్లో ఈ చిత్రం నిర్మిస్తారు. విష్ణు ఇందూరి, శైలేష్ సింగ్ ఈ చిత్రానికి నిర్మాతలు.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?

అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076